www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 6-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 188 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి మ.12.24 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.6.16, ఉత్తరాభాద్ర తె. 4.01 వరకు; వర్జ్యం: మ.2.58-4.25, దుర్ముహూర్తం: మ.12.26-1.13, మ.2.48-3.35, అమృతఘడియలు: రా.11.40-1.07; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 5.56 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రద్ధాంజలి



కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి

(1951 – 05/10/2025)

ప్రేమకు ప్రతిరూపంగా.. ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

భర్త
పి. వీరా రెడ్డి

సోదరుడు
పి.పి. రెడ్డి - పి. రమ

కుమారులు
పి.వి. కృష్ణా రెడ్డి - పి. సుధారాణి
పి.వి. సుబ్బా రెడ్డి - పి. సుమలత

కుమార్తె
పి. ప్రసన్న కుమారి - పి. నాగి రెడ్డి

పెద్దకర్మ

2025 అక్టోబరు 15వ తేదీ
బుధవారం

స్థలం:
హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హైదరాబాద్.

meil family

స్పోర్ట్స్

అమ్మాయిలూ.. చిత్తు చేశారు

పాక్‌పై భారత్ ఘనవిజయం

క్రాంతికి సహచరుల అభినందన



మహిళల వన్డే వరల్డ్‌కప్

కొలంబో: వేదిక ఏదైనా.. టోర్నీ ఏదైనా అదే ఫలితం. ఒకటి కాదు, రెండు కాదు వరుసగా నాలుగు ఆదివారాలపాటు దాయాది పాకిస్థాన్‌తో ఆడిన మ్యాచ్‌ల్లో భారత క్రికెట్ జట్లదే ఆధిపత్యం. ఇటీవలి ఆసియాకప్‌లో భారత పురుషుల జట్టు పాక్‌ను మూడుసార్లు ఓడించిన సంగతి తెలిసిందే. తాజాగా మహిళల వన్డే వరల్డ్‌కప్‌లోనూ హర్మన్‌ప్రీత్ బృందం 88 పరుగుల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. ఇక ఈ టోర్నీలో భారత్‌కిది వరుసగా రెండో గెలుపు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. హర్లీన్ (46), రిచా (35 నాటౌట్), జెమీమా (32), ప్రతీకా (31), దీప్తి శర్మ (25) రాణించారు. పేసర్ డయానా బేగ్‌కు నాలుగు.. ఫాతిమా, సాదియాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో పాక్ 43 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. సిద్రా అమీన్ (81) మాత్రమే పోరాడింది. ఆరంభంలో పేసర్లు రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ (3/20)ల స్వింగ్ బంతులకు పాక్ బ్యాటర్ల దగ్గర సమాధానం లేకుండా పోయింది. సిద్రాకు నటాలియా (33) జత కలిసినప్పుడు పాక్ పరిస్థితి ఆశాజనకంగా కనిపించినా.. ఈ జోడీని క్రాంతి విడదీసి భారత్‌కు రిలీఫ్‌నిచ్చింది. ఆ తర్వాత పాక్ వికెట్ల పతనం వేగంగా సాగింది. అయితే కీపర్ రిచా మూడు క్యాచ్‌లను వదిలేయకపోతే వీరి ఆట మరింత ముందుగానే ముగిసేది. దీప్తి శర్మకు మూడు, స్నేహ్ రాణాకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రాంతి గౌడ్ నిలిచింది.

ఆదుకున్న హర్లీన్, రిచా: టాస్ 'ఓడి'న భారత్ బ్యాటింగ్‌కు దిగగా పిచ్ మందకొడిగా ఉండడంతో భారీ స్కోరు సాధించలేకపోయింది. పాక్ బౌలర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. అయితే మధ్య ఓవర్లలో హర్లీన్ నిలకడైన ఆటతీరు కనబర్చగా, చివర్లో రిచా మెరుపులకు స్కోరు 250కి సమీపానికి రాగలిగింది. ఆరంభంలో ఓపెనర్లు ప్రతీకా, మంధాన (23) తొలి వికెట్‌కు 48 పరుగులు జోడించారు. డయానా ఓవర్‌లో ప్రతీకా హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకుంది. అయితే మంధాన పవర్‌ప్లేలోనే వెనుదిరిగింది. ప్రతీకాను సాదియా బౌల్డ్ చేశాక హర్లీన్ అండగా నిలిచే ప్రయత్నం చేసింది. హర్మన్ (19)తో కలిసి మూడో వికెట్‌కు 39, జెమీమాతో కలిసి నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యాలను నెలకొల్పింది. అయితే హాఫ్ సెంచరీకి చేరువలో ఉన్న హర్లీన్‌ను రమీన్ అవుట్ చేసింది. అనంతరం పాక్ బౌలర్లు పరుగులను కట్టడి చేశారు. దీప్తి (25), స్నేహ్ రాణా (20) ఆచితూచి ఆడి ఆరో వికెట్‌కు 42 రన్స్ జత చేశారు. కానీ 203/7 స్కోరుతో కష్టాల్లో పడినట్టు కనిపించిన జట్టును రిచా ఆదుకుంది. ధనాధన్ షాట్లతో విరుచుకుపడి చివరి 4 ఓవర్లలో 44 పరుగులు జోడించగలిగింది.

స్కోరుబోర్డు

భారత్: ప్రతీకా (బి) సాదియా 31; మంధాన (ఎల్బీ) ఫాతిమా 23; హర్లీన్ (సి) నష్రా (బి) రమీన్ 46; హర్మన్‌ప్రీత్ (సి) సిద్రా (బి) డయానా 19; జెమీమా (ఎల్బీ) నష్రా 32; దీప్తి శర్మ (సి) సిద్రా (బి) డయానా 25; స్నేహ్ (సి) అలియా (బి) ఫాతిమా 20; రిచా (నాటౌట్) 35; శ్రీచరణి (సి) నటాలియా (బి) సాదియా 1; క్రాంతి (సి) అలియా (బి) డయానా 8; రేణుకా (సి) సిద్రా (బి) డయానా 0; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 50 ఓవర్లలో 247 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-48, 2-67, 3-106, 4-151, 5-159, 6-201, 7-203, 8-226, 9-247, 10-247; **బౌలింగ్:** సాదియా 10-0-47-2; డయానా 10-1-69-4; ఫాతిమా 10-2-38-2; రమీన్ 10-0-39-1; నష్రా సంధూ 10-0-52-1.

పాకిస్థాన్: మునీబా (రనౌట్) 2; సదాఫ్ (సి అండ్ బి) క్రాంతి 6; సిద్రా అమీన్ (సి) హర్మన్ (బి) స్నేహ్ రాణా 81; అలియా (సి) దీప్తి (బి) క్రాంతి 2; నటాలియా (సి-సబ్) రాధా యాదవ్ (బి) క్రాంతి 33; ఫాతిమా (సి) మంధాన (బి) దీప్తి 2; సిద్రా నవాజ్ (సి అండ్ బి) స్నేహ్ రాణా 14; రమీన్ (బి) దీప్తి 0; డయానా బేగ్ (రనౌట్) 9; నష్రా సంధూ (నాటౌట్) 2; సాదియా ఇక్బాల్ (సి) మంధాన (బి) దీప్తి 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 43 ఓవర్లలో 159 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-6, 2-20, 3-26, 4-95, 5-102, 6-143, 7-146, 8-150, 9-158, 10-159; **బౌలింగ్:** రేణుకా సింగ్ 10-1-29-0; క్రాంతి గౌడ్ 10-3-20-3; స్నేహ్ రాణా 8-0-38-2; శ్రీచరణి 6-1-26-0; దీప్తి శర్మ 9-0-45-3.

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా

కీటకాల దండయాత్ర



సహజంగా క్రికెట్ మ్యాచ్‌లకు వర్షం లేక వెలుతురులేమితో అంతరాయం కలుగుతుంటుంది. కానీ కొలంబోలో జరిగిన భారత్-పాక్ మహిళల వన్డేకు మాత్రం కీటకాలు అడ్డు తగిలాయి. ఆదివారం మేఘావృతంగా ఉండడంతో సాయంత్రమే ఫ్లడ్‌లైట్స్ వేశారు. ఈ వెలుతురుకు ప్రేమదాస స్టేడియంలోకి భారీగా కీటకాలు వచ్చాయి. మొదట భారత్ ఇన్నింగ్స్ *28వ* ఓవర్‌లో వీటిపై బౌలర్ నష్రా అంపైర్లకు ఫిర్యాదు చేసింది. ఇంతలోనే పాక్ సబ్‌స్టిట్యూట్ స్ప్రే తేగా దాంతో కెప్టెన్ ఫాతిమా పురుగులను పంపేందుకు ప్రయత్నించింది. కానీ అదేమీ పనిచేయకపోగా వాటి సంఖ్య మరింత పెరిగింది. దీంతో *34వ* ఓవర్ ముగిశాక ప్లేయర్లను బయటికి పంపి *15* నిమిషాలపాటు గ్రౌండ్ స్టాఫ్ స్మోక్ మిషన్లతో వాటిని పారదోలాలని చూశారు. ఈ ప్రయత్నం కూడా పెద్దగా ఫలించకపోయినప్పటికీ మ్యాచ్ మాత్రం కొనసాగింది.

టాస్ గెలిచిందెవరో?

భారత్-పాక్ మ్యాచ్ టాస్ విషయంలో గందరగోళం ఏర్పడింది. పాక్ సారథి ఫాతిమా టాస్ ఓడినప్పటికీ తనే ముందుగా ఏం కావాలో కోరుకోవడం గమనార్హం. జరిగిందేమిటంటే.. భారత కెప్టెన్ హర్మన్ హెడ్, ఫాతిమా టెయిల్ అని చెప్పారు. కానీ రెఫరీ ష్రిట్జ్, ప్రజెంటర్ మెల్ జోన్స్‌కు మాత్రం ఫాతిమానే హెడ్ అన్నట్టుగా అర్థం చేసుకున్నారు. ఇక టాస్ నాణేన్ని హర్మన్.. పైకి విసరగా హెడ్ పడింది. దీంతో రెఫరీ హర్మన్‌ను కాకుండా ఫాతిమాను పిలవగా తను ఫీల్డింగ్ కోరుకుంది. కానీ అక్కడే ఉన్న హర్మన్ మాత్రం దీనిపై ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా ఉండిపోయింది.



అమ్మాయిలూ.. నో హ్యాండ్‌షేక్

ఊహించినట్టుగానే మహిళల వన్డే వరల్డ్‌కప్‌లోనూ భారత జట్టు పాకిస్థాన్‌తో నో హ్యాండ్‌షేక్ విధానాన్ని పాటించింది. టాస్ వేసే సమయంలో పాక్ కెప్టెన్ ఫాతిమా షేక్‌తో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కరచాలనం చేయలేదు. ఇటీవలి ఆసియాకప్‌లో భారత కెప్టెన్ సూర్యకుమార్ పాక్ సారథి సల్మాన్ ఆఘాతో ఇదే రీతిన వ్యవహరించిన విషయం తెలిసిందే.

చివరిరోజు 4 పతకాలు

ప్రపంచ పారా అథ్లెటిక్స్

- సిమ్రన్, ప్రీతి, నవ్‌దీప్‌కు రజతాలు
- మొత్తంగా భారత్ ఖాతాలో 22 మెడల్స్



ప్రీతి పాల్



సిమ్రన్



నవ్‌దీప్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌ను భారత్ ఘనంగా ముగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 22 పతకాలు (6 స్వర్ణ, 9 రజత, 7 కాంస్య) సాధించి పదో స్థానంలో నిలిచింది. పోటీలకు చివరి రోజైన ఆదివారం మరో మూడు రజతాలు, కాంస్యం భారత్ ఖాతాలో చేరాయి. సిమ్రన్ శర్మ, ప్రీతి పాల్ చాంపియన్‌షిప్స్‌లో రెండో పతకాన్ని సొంతం చేసుకొన్నారు. మహిళల 200 మీటర్ల టీ12 ఫైనల్లో సిమ్రన్ 24.46 సెకన్ల టైమింగ్‌తో రజతం సాధించింది. ఇప్పటికే 100 మీ. టీ12 కేటగిరీలో సిమ్రన్ స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక, మహిళల 100 మీటర్ల టీ35 ఫైనల్లో 14.33 సెకన్లలో రేస్ పూర్తి చేసిన ప్రీతి రజతం దక్కించుకొంది. ఇదివరకే 200 మీ. టీ35 రేస్‌లో పాల్ కాంస్యం సాధించింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 కేటగిరీలో 45.46 మీటర్ల దూరం విసిరిన నవ్‌దీప్ రెండో స్థానంతో రజతం అందుకొన్నాడు. పురుషుల 200 మీటర్ల టీ44 విభాగంలో సందీప్ 23.60 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం సాధించాడు. బ్రెజిల్ 44 (15 స్వర్ణ, 20 రజత, 9 కాంస్య) పతకాలతో టాప్‌లో నిలవగా.. చైనా 52 (13-22-17), ఇరాన్ 16 (9-2-5) మెడల్స్‌తో రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి.

శ్రియాన్షికి తొలి 'సూపర్' టైటిల్



అల్ ఐన్ (యూఏఈ): తెలుగమ్మాయి శ్రియాన్షి వలిశెట్టి కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 100 టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన అల్ ఐన్ మాస్టర్స్ మహిళల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ యువ షట్లర్ శ్రియాన్షి 15-21, 22-20, 21-7తో భారత్‌కే చెందిన తస్నీం మీర్‌పై గెలిచింది. హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడిన శ్రియాన్షి..తర్వాతి రెండు గేముల్లో సత్తా చాటి విజేతగా నిలిచింది.

టైటాన్స్ ఆల్‌రౌండ్ షో

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో విజయం సాధించింది. ఆదివారం చెన్నై వేదికగా యూపీ యోధాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 40-35తో గెలిచింది. టైటాన్స్ ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. విజయ్ భరత్ 14 పాయింట్లతో సూపర్-10 సాధించడంతో పాటు పీకేఎల్‌లో 700 రైడ్ పాయింట్ల మైలురాయికి చేరుకున్నాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 33-29తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

'ఇరానీ' విజేత విదర్భ



నాగ్‌పూర్: ఇరానీ కప్‌ను విదర్భ గెలుచుకుంది. ఇక్కడ ముగిసిన ఐదు రోజుల మ్యాచ్‌లో 93 పరుగులతో రెస్టాఫ్ ఇండియా ఓడించింది. 361 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 30/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్ట్ 267 రన్స్‌కు ఆలౌటైంది. యశ్ ధుల్ (92), మానవ్ సుతార్ (56 నాటౌట్) పోరాడినా 'రెస్ట్'కు ఓటమి తప్పలేదు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 104 రన్స్ జోడించారు.

సంక్షిప్తస్కోర్లు: విదర్భ: 342, 232; **రెస్టాఫ్ ఇండియా:** 214, 267 (ధుల్ 92, మానవ్ 56 నాటౌట్, ఇషాన్ 35, హర్ష్ దూబే 4/73, ఆదిత్య ఠాక్రే 2/27, యశ్ ఠాకూర్ 2/47).

యశ్-ధుల్ కొట్టుకోబోయారు!

ఆఖరిరోజు ఆటలో విదర్భ పేసర్ యశ్ ఠాకూర్, రెస్ట్ బ్యాటర్ యశ్ ధుల్ కొట్టుకున్నంత పని చేశారు. ఠాకూర్ వేసిన షార్ట్‌పిచ్ బంతికి ధుల్ క్యాచవుటయ్యాడు. కీలకమైన వికెట్ పడగొట్టిన నేపథ్యంలో ఠాకూర్ తీవ్రంగా స్పందించాడు. అది జీర్ణించుకోలేని ధుల్..ఠాకూర్‌పై దాడి చేసేందుకు అతడివైపు దూసుకు పోయాడు. ఠాకూర్ కూడా తగ్గేదిలేన్నట్టుగా జవాబివ్వడంతో ఇద్దరూ కొట్టుకొనేదాకా వెళ్లారు. అయితే అంపైర్లు కలుగజేసుకొని వారిని విడదీశారు.

ప్రభ్‌సిమ్రన్ సెంచరీ

మూడో వన్డేలో ఆసీస్ 'ఎ' పరాజయం

సిరీస్ భారత్ 'ఎ' వశం

కాన్పూర్: ఆస్ట్రేలియా 'ఎ'తో మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీస్‌ను భారత్ 'ఎ' 2-1తో దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ ఉత్కంఠ భరితంగా జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 'ఎ' రెండు వికెట్లతో నెగ్గింది. తొలుత ఆస్ట్రేలియా 'ఎ' 49.1 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. ఎడ్వర్డ్స్ (89), స్కాట్ (73), కొనొలీ (64) అర్ధ శతకాలు సాధించారు. అర్ష్‌దీప్, హర్షిత్ చెరో మూడేసి, బదోని రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో భారత్ 'ఎ' 46 ఓవర్లలో 322/8 స్కోరు చేసి గెలుపొందింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (102) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయాస్ (62), పరాగ్ (62) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. చివర్లో వరుస వికెట్లు కోల్పోయి భారత్ 'ఎ' ఇబ్బందులో పడినా అర్ష్‌దీప్ (7 బ్యాటింగ్) అండగా విప్రాజ్ నిగమ్ (24 నాటౌట్) జట్టును విజయ తీరాలకు చేర్చాడు. టాడ్ మర్ఫీ, తన్వీర్ సంఘా చెరో 4 వికెట్లు తీశారు.

మళ్లీ ఓడిన అఫ్ఘాన్

- 3-0తో బంగ్లా క్లీన్‌స్వీప్

షార్జా: అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను బంగ్లాదేశ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన మూడో, ఆఖరి టీ20లో బంగ్లా 6 వికెట్ల తేడాతో అఫ్ఘాన్‌ను ఓడించింది. తొలుత అఫ్ఘాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసింది. సైఫుద్దీన్ 3, నసుమ్, తన్జిమ్ షకిబ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి గెలిచింది. సైఫ్ హసన్ (64 నాటౌట్) సత్తా చాటాడు.

బిజినెస్

బిట్‌కాయిన్ కొత్త రికార్డు



న్యూయార్క్: ప్రపంచంలో అతి పెద్ద క్రిప్టోకరెన్సీ 'బిట్‌కాయిన్' ధర చుక్కలంటింది. ఆదివారం ఒక దశలో 1,25,245.57 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. శనివారంతో పోలిస్తే ఇది 2.7 శాతం ఎక్కువ. దీంతో బిట్‌కాయిన్ మార్కెట్ క్యాప్ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌ను మించిపోయింది. సంస్థాగత మదుపరుల కొనుగోళ్లు, ట్రంప్ సర్కారు సానుకూల విధానాలు, ప్రధాన కరెన్సీలతో పడిపోతున్న డాలర్ మారకం రేటు, అమెరికా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల స్తంభన బిట్‌కాయిన్ ర్యాలీకి కారణాలుగా కనిపిస్తున్నాయి.

2047 నాటికి జీడీపీలో 25% ఆస్తులు లక్ష్యం

- టాప్-20 గ్లోబల్ బ్యాంకుల్లోనూ చోటు
- ఎస్‌బీఐ చీఫ్ చల్లా శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలోని అతి పెద్ద బ్యాంక్ ఎస్‌బీఐ భారీ లక్ష్యాలను పెట్టుకుంది. ఇందుకోసం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని నిర్ణయించింది. 'వికసిత్ భారత్' సాధనకు నిర్దేశించుకున్న లక్ష్యం 2047 నాటికి దేశ జీడీపీలో తమ బ్యాంకు ఆస్తులను 25 శాతానికి పెంచుకోవాలని భావిస్తున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి తెలిపారు. ఎన్‌డీటీవీ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో ఎస్‌బీఐ ఆస్తుల వాటా 20 శాతం వరకు ఉంది. ఆస్తుల పరంగా ప్రస్తుతం ప్రపంచంలోని టాప్-50 బ్యాంకుల్లో ఎస్‌బీఐ 43వ స్థానంలో ఉంది. 2047 నాటికి ఆస్తి-అప్పుల పట్టీని (బ్యాలెన్స్ షీట్) మరింత మెరుగుపరుచుకుని ప్రపంచంలోని టాప్-10 లేదా టాప్-20 బ్యాంకుల జాబితాలో స్థానం సంపాదిస్తామన్నారు. "ప్రస్తుతం దేశ జీడీపీలో మా ఆస్తుల వాటా 20 శాతం వరకు ఉంది. 2047 నాటికి దీన్ని 25 శాతానికి అంటే జీడీపీలో నాలుగో వంతుకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అప్పటికి ప్రపంచంలోని టాప్-10 లేదా టాప్-20 బ్యాంకుల్లోనూ స్థానం సంపాదిస్తాం' అని శ్రీనివాసులు శెట్టి చెప్పారు.

కొత్త రంగాలకు రుణ మద్దతు: సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజెన్, బ్యాటరీ స్టోరేజీ వంటి నూతన వ్యాపార రంగాలపై కంపెనీలు, ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. ఇలాంటి కొత్త ప్రాజెక్టులకు తమ రుణ మద్దతు ఉంటుందన్నారు. ఇందుకోసం ఆయా పరిశ్రమ వర్గాలతో సమన్వయం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. సరికొత్త రంగాలు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఎంతో తోడ్పడనున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరికి ఎస్‌బీఐ ఆస్తి-అప్పుల పట్టీ (బ్యాలెన్స్ షీట్) రూ.66 లక్షల కోట్లు దాటిందని చెప్పారు.

అంతర్జాతీయంగానూ ఆసరా : విదేశీ మార్కెట్లలో ఎదగాలనుకునే భారత కంపెనీలకు సైతం ఎస్‌బీఐ మద్దతు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకుకు 29 దేశాల్లో 240 పైగా శాఖలు ఉన్న విషయాన్ని శ్రీనివాసులు శెట్టి గుర్తు చేశారు. ఈ శాఖల ద్వారా భారత కంపెనీల ఎగుమతుల వృద్ధి, విదేశీ రుణ సేకరణకు అవసరమైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం తమ ఆస్తి-అప్పుల పట్టీలో విదేశాల్లోని శాఖల వాటా 10 శాతం వరకు ఉందన్నారు. ముందు ముందు దీన్ని 12 నుంచి 13 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు.

25250 పైన బుల్లిష్

(అక్టోబరు 6-10 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ స్కోప్

గత వారం నిఫ్టీ: 24896 (+241)

నిఫ్టీ గత వారం 24601-24896 పాయింట్ల మధ్యన కదలాడి 241 పాయింట్ల లాభంతో 24896 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24991, 24839, 24944, 24164 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24600
నిరోధ స్థాయిలు: 25100, 25200, 25300 (25000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24700, 24600, 24500 (24800 దిగువన బేరిష్)

పండుగ సీజన్ విమాన ధరలపై డీజీసీఏ నిఘా

న్యూఢిల్లీ: ప్రస్తుత పండుగల సీజన్‌లో విమాన టికెట్ ధరల ధోరణి, విమానాల్లో సీట్ల సామర్థ్యంపై పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయం గట్టి నిఘా పెట్టింది. టికెట్ల ధరలు విపరీతంగా పెంచకుండా చూడడం దీని లక్ష్యం. సాధారణంగా పండుగ సీజన్‌లో విమాన టికెట్లకు డిమాండ్ అధికంగా ఉంటుంది గనుక అధికంగా రద్దీ ఉండే రూట్లతో సహా అన్ని రూట్లలోనూ విమాన ధరలు పెంచేస్తూ ఉంటారు. విమాన ధరలపై ఎలాంటి నియంత్రణలు లేని కారణంగా ప్రజలు భరించలేని స్థాయిలో ధరలు పెంచేయకుండా కట్టడి చేయడానికి డీజీసీఏ తగు చర్యలు తీసుకుంటూ ఉంటుంది. పండుగల సీజన్‌కు ముందు విమాన ధరలపై నిఘా పెట్టిన డీజీసీఏ పెరుగుతున్న రద్దీకి దీటుగా విమాన సామర్థ్యాలు పెంచాలని విమానయాన సంస్థలను కోరినట్టు పౌర విమానయాన శాఖ తెలిపింది. సీజనల్ రద్దీని తట్టుకునేందుకు ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్ అదనపు సర్వీసులు నడుపుతున్నట్టు ఇప్పటికే ప్రకటించాయి.

4 లక్షల యూనిట్ల ఎగుమతి లక్ష్యం సాధిస్తాం: మారుతి

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా.. ఈ ఆర్థిక సంవత్సరంలో 4 లక్షలకు పైగా వాహనాలను ఎగుమతి చేసే లక్ష్యం దిశగా దూసుకెళ్తోంది. ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో ఇప్పటికే 2 లక్షలకు పైగా యూనిట్లను విదేశాలకు పంపించినట్లు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (కార్పొరేట్ అఫైర్స్) రాహుల్ భారతి వెల్లడించారు. సెప్టెంబర్ నెలలో ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 52% పెరిగి 42,204 యూనిట్లకు చేరాయి. 'మొదటి త్రైమాసికంలో దాదాపు 1.10 లక్షల యూనిట్లు, ప్రథమార్ధంలో 2.07 లక్షల యూనిట్లను ఎగుమతి చేశాం. ఇదే వేగాన్ని కొనసాగిస్తే, ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించుకున్న 4 లక్షల యూనిట్ల ఎగుమతి లక్ష్యాన్ని తప్పక చేరుకుంటాం అని ఆయన అన్నారు. తమ ఎగుమతులు దేశీయ పోటీదారుల కంటే రెండింతలు ఎక్కువే ఉన్నాయన్నారు.

పెరగనున్న ముడి చమురు ఉత్పత్తి



వియన్నా (ఆస్ట్రియా): నవంబరు నుంచి ముడి చమురు రోజువారీ ఉత్పత్తిని 1.37 లక్షల బ్యారెళ్ల మేర పెంచాలని ఒపెక్ దేశాల కూటమి, రష్యా నిర్ణయించాయి. తాము కోల్పోయిన వాటా పెంచుకునేందుకు రోజువారీ ఉత్పత్తిని 2.74 లక్షల నుంచి 5.48 లక్షల బ్యారెళ్ల మేర పెంచాలని సౌది అరేబియా పట్టుపట్టింది. అయితే మెజారిటీ దేశాలు 1.37 లక్షల బ్యారెళ్ల పెంపునకు అమోదం తెలిపాయి. దీంతో ఈ సంవత్సరం మార్చి నుంచి ఈ దేశాలు అమలు చేస్తున్న ఉత్పత్తి కోతకు తెరపడింది. తాజా నిర్ణయంతో ప్రస్తుతం 65 డాలర్ల వద్ద ట్రేడవుతున్న బ్రెంట్ రకం చమురు బ్యారెల్ ధర మరింత దిగి వస్తుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	528	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	124
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	119
కర్నూలు	115	నెల్లూరు	124
విశాఖపట్నం	127	అనంతపురం	124
గోదావరి	124		

ట్రేడింగ్‌లో మిశ్రమ ధోరణికి ఆస్కారం

స్టాక్ మార్కెట్ ఈ వారంలో మిశ్రమ ధోరణిలో ట్రేడ్ కావొచ్చు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణాలు, ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో కొన్ని రంగాల షేర్లు తీవ్ర ప్రభావానికి లోనయ్యే అవకాశముంది. వరుసగా ఎనిమిది సెషన్లు నష్టపోయిన బెంచ్‌మార్క్ సూచీలు చివరి రెండు సెషన్లలో భారీగా పెరిగాయి. ఆటోమొబైల్, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, మెటల్, డిఫెన్స్, గ్లాస్, ఆయిల్ అన్వేషణ రంగాలు జోరు ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమెండేషన్లు

టాటా స్టీల్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన రూ.160 జోన్‌లో ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. ఐరన్ అండ్ స్టీల్ సెక్టార్ సైతం జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 3.4 % లాభంతో రూ.173 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.195 టార్గెట్ ధరతో రూ.170పై శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.166.

బంధన్ బ్యాంకు: చాలా కాలంగా ఈ షేర్లలో దిద్దుబాటు జరుగుతూనే ఉంది. కొన్ని రోజులుగా ప్రైవేటు బ్యాంకింగ్ సెక్టార్ మూమెంటమ్ మెరుగవుతూ వస్తోంది. గత శుక్రవారం రూ.165 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.185 టార్గెట్ ధరతో రూ.160 శ్రేణిలో అక్యూములేట్ చేసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.157.

ఆదిత్య బిర్లా క్యాపిటల్: ప్రస్తుతం ఈ షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. పైగా అక్యూములేషన్ జోన్‌లో ఉన్నాయి. గత శుక్రవారం రూ.303 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.340 టార్గెట్ ధరతో రూ.290 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.280.

ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ కౌంటర్లో అక్యూములేషన్ జరుగుతోంది. ప్రస్తుతం రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.209 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.230 టార్గెట్ ధరతో రూ.205 వద్ద పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.205.

కోటక్ బ్యాంకు: ఆరు నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో ఉంది. ఆర్‌బీఐ ద్రవ్యవిధాన సమీక్ష ముగిసిన నేపథ్యంలో వీటిపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం రూ.2100 ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.2250 టార్గెట్ ధరతో రూ. 2050 వద్ద ప్రవేశించవచ్చు. స్టాప్ లాస్ : రూ. 2010.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25000 పైన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం పునరుజ్జీవం బాట పట్టి 240 పాయింట్లకు పైగా లాభంతో 24,900 వద్ద ముగిసింది. ముందు వారంలో ఏర్పడిన బలమైన డౌన్‌ట్రెండ్ అనంతరం ఏర్పడిన టెక్నికల్ రికవరీ ఇది. కాని మైనర్ రికవరీ కావడం వల్ల పరిమిత కదలికలు మరి కొంత కాలం కొనసాగే ఆస్కారం ఉంది. నెలవారీగా చూసినా కనిష్ఠ స్థాయిల్లో ముగిసినప్పటికీ ఇంకా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ ఎలాంటి కన్సాలిడేషన్ లేకుండానే గత వారంలో 'వి' ఆకారంలో రికవరీ సాధించినందువల్ల సానుకూల సంకేతం కోసం తొలుత కన్సాలిడేట్ అయి నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం మానసిక అవధి 25,000 సమీపంలో ఉన్నందు వల్ల ఈ వారంలో అప్రమత్తంగా ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక సానుకూల సంకేతం ఇవ్వాలంటే మార్కెట్ కీలక నిరోధం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. గత కొద్ది నెలల్లో ఈ కీలక స్థాయిలోనే మార్కెట్ విఫలమవుతూ వస్తోంది. ప్రధాన నిరోధ స్థాయిలు 25300, 25500.

బేరిష్ స్థాయిలు: 25000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. దిగువన మద్దతు స్థాయి 24,700. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మంచి పనితీరుతో 1200 పాయింట్లకు పైగా బలపడి మూడు వారాల గరిష్ఠ స్థాయి 55,600 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 55,600. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే బలహీనత ముప్పు తప్పదు.

పాటర్న్: స్వల్పకాలిక చలన సగటు స్థాయి 25,000 కన్నా నిఫ్టీ స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24920, 25000
మద్దతు	24780, 24700

www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 188
సోమవారం | 6-10-2025
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి మ.12.24 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.6.16, ఉత్తరాభాద్ర తె. 4.01 వరకు; వర్జ్యం: మ.2.58-4.25; దుర్ముహూర్తం: మ.12.26-1.13, మ.2.48-3.35; అమృతఘడియలు: రా.11.40-1.07; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.56
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టమాటా కిలో రూ. 4

ఏపీలోని కర్నూలు జిల్లా

పత్తికొండ మార్కెట్‌లో పతనమైన ధరలు

రోడ్డుపై పారబోసి నిరసన తెలిపిన రైతులు

11





కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

పండగైపోయింది..

పోదాం పద..!

హైదరాబాద్‌కు చేరుకునే మార్గాలన్నీ కిటకిట

సెలవులు ముగియడంతో స్వస్థలాల నుంచి నగరానికి..

విజయవాడ– హైదరాబాద్ హైవే సహా అన్ని దారుల్లో భారీ ట్రాఫిక్.. టోల్ ప్లాజాల వద్ద వాహనాల బారులు

10

సడన్ బ్రేక్.. 6 కార్లు ఢీ

ఓఆర్ఆర్‌పై ఘటన.. ఇద్దరికి స్వల్ప గాయాలు.. 2 కి.మీ. ట్రాఫిక్ జామ్



9

ఔటర్ రింగురోడ్డుపై హిమాయత్‌సాగర్ సమీపంలో ఒకదానికొకటి ఢీకొన్న కార్లు

ఆయుర్దాయంలో మనం వెనకే..



12

జపనీయుల సగటు జీవిత కాలం 85 ఏళ్లు

భారతీయులకు 72 ఏళ్లే..

రోజువారీ అలవాట్లు, తినే ఆహారంలో వ్యత్యాసాలే కారణం



‘సుప్రీం’ సస్పెన్స్

- జీవో 9కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై నేడు విచారణ చేపట్టనున్న సర్వోన్నత న్యాయస్థానం
- బీసీ రిజర్వేషన్లపై తగ్గేది లేదు.. బలంగా వాదించండి
- సీనియర్ న్యాయవాదులతో సీఎం రేవంత్‌రెడ్డి
- అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ్ దవేలతో ఫోన్‌లో మంతనాలు
- ఢిల్లీకి హుటాహుటిన భట్టివిక్రమార్క, పొన్నం, వాకిటి
- 42 శాతంపై కోర్టుల్లో ప్రతికూల స్పందన వస్తే పార్టీ పరంగా బీసీలకు ఆ మేరకు రిజర్వేషన్లు!

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టుకు చేరింది. బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరులో తీసుకొచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారించనుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ దవేతో ఫోన్‌లో ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు గడువు, గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లుల పెండింగ్, రాష్ట్ర ప్రభుత్వాలకు జీవో 9ని తీసుకొచ్చే అధికారం తదితర అంశాలపై వారితో అరగంటకు పైగా చర్చించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో

మిగతా 11వ పేజీలో...

‘జూబ్లీహిల్స్’కు నలుగురి పేర్లు!

ఇన్‌చార్జి మంత్రుల ప్రతిపాదన

నేడు సీఎంతో మీనాక్షి, టీపీసీసీ చీఫ్ భేటీ!

11

ఏసీబీ జోరుకు.. అనుమతుల కళ్లెం!

ఉన్నతాధికారుల తీరుతో దర్యాప్తుల్లో జాప్యం

- ప్రాసిక్యూషన్‌కు ఏసీబీకి అనుమతివ్వని వైనం
- వివిధ శాఖల అధిపతుల వద్ద మగ్గుతున్న వినతులు
- జాప్యాన్ని సాకుగా చూపి, కోర్టు ఉత్తర్వులు తెచ్చుకుని పోస్టింగ్‌లు పొందుతున్న అవినీతి ఉద్యోగులు
- హైకోర్టు ఉత్తర్వులపై సవాల్ చేయని అధికారులు
- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా మళ్లీ కీలక పోస్టింగులు దక్కించుకుంటున్న కొందరు
- 9 నెలల్లో 203 కేసులు.. నాలుగో వంతు కేసుల దర్యాప్తునకు కూడా ఏసీబీకి దక్కని అనుమతులు!



హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏసీబీ జోరుకు ‘అనుమతుల’ ఆటంకం ఎదురవుతోంది. వరుసగా అవినీతి అధికారులను పట్టుకుంటున్నా వారిని విచారించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఏసీబీకి అనుమతులు రావడం లేదు. దీనితో అవినీతి కేసుల దర్యాప్తులు ఏళ్లకేళ్లు జాప్యం అవుతున్నాయి. ఈ ఆలస్యాన్ని సాకుగా చూపుతున్న అవినీతి అధికారులు తిరిగి పోస్టింగులు తెచ్చుకుంటున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన వారు కూడా పైఅధికారులను మచ్చిక చేసుకుని కీలకమైన పోస్టులు దక్కించుకుంటున్నారు. ఇలాంటి వారు మళ్లీ యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారని.. ఉన్నతాధికారుల తీరే దీనికి కారణమని విమర్శలు వస్తున్నాయి. అవినీతికి పాల్పడుతున్న వారిని, ఆదాయానికి మించి ఆస్తులున్న అధికారులను ఏసీబీ అరెస్టు చేసినా.. తదుపరి దర్యాప్తు కోసం సదరు అవినీతి అధికారికి సంబంధించిన శాఖ ఉన్నతాధికారుల అనుమతి కావాలి. ఏసీబీ అధికారులు సంబంధిత ఉద్యోగి చేసిన నేరాన్ని వివరిస్తూ, ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి ఇవ్వాలంటూ లేఖలు రాస్తారు. సంబంధిత శాఖాధిపతులు ఏసీబీ లేఖలపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ శాఖాధిపతులు ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతులు ఇవ్వకుండా ఏళ్లకేళ్లు పెండింగ్‌లో పెడుతున్నారు. ఆ లోపు సదరు అవినీతి ఉద్యోగులు బెయిల్‌పై బయటికి వచ్చి, మళ్లీ విధుల్లో చేరుతున్నారు. తమపై చర్యలకు అనుమతులు ఇవ్వాల్సిన ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని ఏసీబీ లేఖలను అలాగే పెండింగ్‌లో పెట్టేలా చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

హైకోర్టును తప్పుదారి పట్టించి..

తిరిగి ఉద్యోగాల్లో చేరిన అవినీతి ఉద్యోగులు రెండు, మూడేళ్లు ఆగి తమకు పదోన్నతులు ఇవ్వడం లేదంటూ హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ కేసు అంశాన్ని దాచిపెడుతున్నారు. ఈ క్రమంలో వారికి అనుకూలంగా ఉత్తర్వులు వస్తున్నాయి. ఇందులో అవినీతి ఉద్యోగులకు ఉన్నతాధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు

మిగతా 11వ పేజీలో...



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురంలో ఎర్ర తెగులు సోకిన పత్తి పంట

పత్తి దిగుబడి వట్టిదేనా?

ఎకరానికి 3-4 క్వింటాళ్ల మేర పడిపోయే అవకాశం

నాణ్యత లేమి, తేమ కారణంగా మద్దతు ధరా హుళక్కే

పెట్టుబడి అయినా చేతికి వస్తుందా?.. రైతుల్లో ఆందోళన

ఎడతెగని వర్షాలు, వరదలతో పత్తి పంటకు తీవ్ర నష్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తొలకరిలో పత్తిసాగు మొదలు పెట్టిన దశలోని ఉత్సాహం ఇప్పుడు రైతుల్లో కాస్తయినా లేదు. ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం ఏమాత్రం లేకపోవడంతో పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలి? అనే దిగులు పట్టుకుంది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలు, ముసురు, మబ్బుపట్టిన వాతావరణం కారణంగా రాష్ట్రంలో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. అప్పట్లో చేలల్లో వేసిన విత్తనాలు చక్కగా మొలకెత్తినా.. కొత్త చిగుళ్లతో మొక్క బాగా ఎదిగే దశలో మొదలైన

మిగతా 9వ పేజీలో...

వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి!

గడువు విధించిన రాష్ట్ర ప్రభుత్వం

నేడు సీసీఐ ఎండీ, మిల్లర్లతో మరోసారి తుమ్మల భేటీ

9

8 కారిడార్లు ఒకేసారి!

ఏకకాలంలో నిర్మాణ పనులు ప్రారంభం!

వేర్వేరుగా టెండర్లు.. సర్కారు యోచన

వేగంగా 2వ దశ మెట్రో విస్తరణ..

డీపీఆర్‌కు కేంద్రం నుంచి అనుమతి రాగానే అన్ని పనులు షురూ

వచ్చే ఎన్నికల నాటికి చిన్న కారిడార్లను పూర్తిచేసే ప్రయత్నం

కియోలిస్‌తోనే రైళ్ల రాకపోకలు

తగ్గనున్న మెట్రో డిపోలు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో మెట్రోరైలు రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో ఉండే అడ్డంకులను వడివడిగా తొలగించుకుని ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తోంది. ఎల్ అండ్‌టీ నుంచి మొదటి దశలోని మూడు కారిడార్ల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా తీసుకునేందుకు ఆ సంస్థతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో రెండో దశ పనులపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు మొత్తం 8 కారిడార్లకు సంబంధించిన నిర్మాణాన్ని ఒకేసారి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎనిమిది కారిడార్లకు సంబంధించి

మిగతా 10వ పేజీలో...





కొనబోతే కొరివి

వాయుసేన ముందు సవాల్.. స్టెల్త్ విమానాలపై ఎటూ తేల్చుకోలేని స్థితి

చైనా వద్ద 300 జే-20 స్టెల్త్ విమానాలు.. జే-35ల తయారీలో బిజీ

2030 నాటికి పాక్‌కు జే-35లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న డ్రాగన్

ఐదేళ్లలో ఇరుదేశాల నుంచీ పెను ముప్పు.. మనవద్ద ఉన్నవి రాఫెల్‌లే!

ఏఎంసీఏ విమానాలు తయారుచేసుకోవాలన్నా మరో పదేళ్లు

మనకున్న ప్రత్యామ్నాయాలు ఎఫ్35 లేదా ఎస్‌యు57లు కొనడమే

ఎఫ్-35ల స్టెల్త్ సామర్థ్యం అద్భుతమే కానీ.. కొనాలంటేనే షరతులు

వాటితో పోలిస్తే ఎస్‌యు-57ల స్టెల్త్ సామర్థ్యం అంతంతమాత్రమే

కొనాలన్నా.. అవి అందుబాటులోకి వచ్చేసరికి పదేళ్ల దాకా పట్టొచ్చు

ఎల్లుండి ‘ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ డే’ సందర్భంగా ప్రత్యేక కథనం

(సెంట్రల్ డెస్క్)

గగనతల యుద్ధాల్లో అత్యంత ప్రభావం చూపే ఐదో తరం యుద్ధవిమానాల తయారీలో అమెరికా, చైనా.. ఇప్పటికే మిగతా దేశాలకు అందనంత దూరంలో ఉన్నాయి! అమెరికా వద్ద అద్భుతమైన స్టెల్త్ (శత్రుదేశ రాడార్లకు చిక్కని) సామర్థ్యాలున్న ఎఫ్-35లు, ఎఫ్-22లు ఉండగా.. చైనా వద్ద ఇప్పటికే 300కు పైగా జే-20 స్టెల్త్ ఫైటర్ జెట్లు ఉన్నాయి! ఇవి కాక జే-35లను చైనా తయారుచేస్తోంది. రేసులో మరింత ముందుకెళ్లి.. వైట్ ఎలిఫెంట్ (జే36) పేరిట ఆరో తరం యుద్ధ విమానాలనూ

మిగతా 11వ పేజీలో...

బిహార్ ఎన్నికలు నవంబరు 22లోపే

త్వరలో దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తాం

ఎన్నికల ప్రక్రియలో 17 సంస్కరణలకు శ్రీకారం

పట్నా సమీక్షలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

12

వరద సాయమేదీ?

కామారెడ్డిలో సీఎం రేవంత్ పర్యటించినా బాధితులకు నయా పైసా సహాయం అందలేదు

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలపై నిలదీయండి

రాష్ట్రంలో బీజేపీ పనైపోయింది

9

‘స్థానికం’లో మెజారిటీ సీట్లు గెలుస్తాం: హరీశ్

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నాటకాలు



బీజేపీ పదాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

స్థానిక సంస్థలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన అన్యాయాలపై విస్తృత ప్రచారం చేయాలి

బీజేపీ పదాధికారుల భేటీలో నిర్ణయం.. ఎంపీలు, ఎమ్మెల్యేలకు జిల్లాల బాధ్యతలు

మనది టీం బీజేపీ: అధ్యక్షుడు రాంచందర్‌రావు.. కలిసికట్టుగా పనిచేద్దాం: కిషన్‌రెడ్డి

ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

రెండు జిల్లాల అధ్యక్షుల పని తీరుపై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అసహనం

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థలకు చేసిన అన్యాయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని మండిపడింది. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేసిన అంశాలతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ

మిగతా 10వ పేజీలో...

ఔషధం.. నిర్లక్ష్యం.. విషం!

నాణ్యతలేని మందులతో ప్రజలకు ప్రాణ సంకటం

ఔషధ కంపెనీల నిర్లక్ష్యం

కమీషన్లు, మార్జిన్ల కోసం వైద్యులు, దుకాణదార్ల కక్కుర్తి

కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ

విషపూరిత దగ్గుమందుతో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 14 మంది చిన్నారుల మృతి

మధ్యప్రదేశ్‌లో పిల్లల మృతి కేసులో వైద్యుడి అరెస్టు

తయారీ సంస్థపై కేసు

మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో విక్రయాలపై నిషేధం

12

'అక్రమ తుపాకులు' తమిళ అనువాద కథలు

పదకొండు మంది తమిళ రచయితల కథలకు శ్రీనివాస్ తెప్పాల తెలుగు అనువాదాలతో కథా సంకలనం 'అక్రమ తుపాకులు' ఆవిష్కరణ సభ అక్టోబర్ 9 సా.6గంటలకు లామకాన్, బంజారాహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. వక్తలుగా కవి సిద్ధార్థ, పి. జ్యోతి, ఇండ్ల చంద్రశేఖర్, కె. రామచంద్రారెడ్డి మాట్లాడతారు.

బోధి ఫౌండేషన్

రెండుతరాల కవిసంగమం

రెండుతరాల కవిసంగమం సిరీస్ – 44 కార్యక్రమం అక్టోబర్ 11 సా.6గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొంటున్న కవులు: కొండి మల్లారెడ్డి, వి.ఆర్. తూములూరి, లావణ్య సైదీశ్వర్, మహేష్ వేల్పుల, పి. వెంకటేష్ (నిజాం కాలేజి ఎం.ఏ విద్యార్థి)

కవిసంగమం


సృజన సమాలోచన సదస్సు

తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో కవి యాకూబ్ సృజన సమాలోచన సదస్సు అక్టోబర్ 13 ఉ.10గంటల నుంచి సా.8గంటల వరకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

తెలుగు భాషా చైతన్య సమితి

సాంస్కృతిక అస్తిత్వాన్ని ఎలా నిలబెట్టాలో స్పష్టత ఉన్నది!

– ఏనుగు నరసింహారెడ్డి



ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి కవి, రచయిత, విమర్శకులు, అనువాదకులు. మీర్ లాయక్ అలీ రచన 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్'ను 'హైదరాబాదు విషాదం'గాను, వి.పి. మీనన్ రచన 'ద స్టోరీ ఆఫ్ ద ఇంటిగ్రేషన్ ఆఫ్ ద ఇండియన్ స్టేట్స్'ను 'అసఫ్ జాహీ సంస్థానం విలీన గాథ'గా తెలుగులోకి అనువదించి సెప్టెంబర్ 17 పరిశీలనకు కొత్త కోణాన్ని అందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వీరి 'మట్టిపాట', 'తెలంగాణ రుబాయిలు' రచనలు సాహిత్యాభిమానుల మనసును చూరగొన్నాయి. 2017లో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా నియమితులై ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతమయ్యేందుకు కృషి చేశారు. ఇటీవల తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా నియమితులైన సందర్భంగా ఆయనతో సంభాషణ:

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా నియమితులైన సందర్భాన మీకు శుభాకాంక్షలు. మీరు ఈ పదవిలో నియమించబడిన మొదటి పక్షంలోనే తెలంగాణ బతుకమ్మకు రెండు గిన్నిస్ రికార్డులు రావడం పట్ల మీ స్పందన ఏమిటి?

తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఇదొక అత్యంత ఉత్సాహవంతమైన సందర్భం. 63.11ఫీట్ల ఎత్తు బతుకమ్మకు ఒక గిన్నిస్ రికార్డు, 1500మంది మహిళల బతుకమ్మ ఆటలోని ఏకత్వానికి మరో గిన్నిస్ రికార్డు సాధించాం. తక్కువ వ్యవధిలో సరైన ప్రణాళికతో, పర్యాటక-సాంస్కృతిక శాఖల మధ్య సమన్వయంతో ఇది సాధ్యమైంది.

మీరు గతంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఆ అనుభవం ఇప్పుడు ఈ కొత్త హోదాలో ఉపయోగపడుతుంది అని భావించవచ్చా?

తప్పకుండా! సాహిత్య అకాడమీలో పనిచేసిన పరిజ్ఞానమే గాక, గత ముప్పై ఏళ్ళుగా వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థలతో నాకున్న అనుబంధం, కవులు రచయితలతో వ్యక్తిగత సాన్నిహిత్యం తప్పనిసరిగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా పనిచేయడంలో నాకు ఉపయోగపడుతుంది. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో కవులు రచయితలను మాత్రమే కాకుండా కళాకారులను కూడా చాలా సందర్భాలలో ఇన్వాల్వ్ చేశాము. ఆ సందర్భంగా తెలంగాణ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం చేయవలసిన కార్యక్రమాల పట్ల నాకు స్పష్టమైన అవగాహన ఏర్పడింది.

విద్యావ్యవస్థలో మార్పులతో ఇంగ్లీష్ భాష డామినేట్ చేస్తున్న పరిస్థితుల్లో తెలంగాణ భాషను కాపాడుకోవడంపై మీ ఆలోచనలు ఏమిటి?

రెండు తెలుగు రాష్ట్రాలలోనూ తెలుగు మాధ్యమం ప్రాథమిక పాఠశాలల స్థాయిలో కూడా లేకుండా పోయింది కాబట్టి ఇంకొక ఇరవై ఏళ్ళ తరువాత వచ్చే యువతకు తెలుగుపట్ల సాధికారత ఉండదనే విషయాన్ని ఒప్పుకుని తీరవలసిందే. తెలుగుని ఒక భాషగానైనా తప్పనిసరిగా నేర్చుకోవలసిన అవసరం తెలంగాణ రాష్ట్రంలో అందరికీ ఉంది అని తెలుగు భాషా చట్టం 2018 తెలియజేస్తుంది. దీని ప్రకారం ఏ రకమైన యాజమాన్య నిర్వహణలో ఉన్న పాఠశాలల్లోనైనా తెలుగును ఒక అంశంగా చదివి తీరాలి. కాబట్టి తెలుగును ఆసక్తిగా చదివే విద్యార్థులు భవిష్యత్తులో భాషాలో నైపుణ్యాన్ని సాధిస్తారు. ఇక సంస్కృతి విషయానికి వస్తే భాషకు ఉన్నంత డోకా సంస్కృతికి లేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బోనాలు, బతుకమ్మ పండగలకి ఆదరణ పెరిగింది. ప్రభుత్వం వైపు నుండి కూడా ఈ పండుగలను ఉత్సాహభరితంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి కాబట్టి సంస్కృతి పరిరక్షణ, భాషా పరిరక్షణ కంటే మెరుగ్గా ఉంది.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ ఆటల్లో డీజేలు, దాండియా వచ్చి చేరినవి. తెలంగాణ జీవితం ఉట్టిపడే ఈ పండుగకు పూర్వకళ తీసుకురావడానికి ఎలాంటి ప్రణాళికలు వేసుకున్నారు?

బతుకమ్మ పాటలు ఏ కర్తృత్వం లేకుండా, మౌఖికంగా తరం నుండి తరానికి వస్తున్న సాంస్కృతిక సంపద. ఇవి ఒకప్పటి కుటుంబ సంబంధాలకు, ఆ సామాజిక స్థితికి అద్దం పడతాయి. అయితే మొదటి నుండి తెలంగాణాలో ఎగసిపడిన ఉద్యమాల ప్రభావాలకు బతుకమ్మ పండుగ కూడా లోనయ్యింది. ఇక ముందు ఎలాంటి కృత్రిమత్వం లేకుండా, సహజసిద్ధంగా ఈ పండుగ కొనసాగించే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు కూడా ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించారు. ఈ సారి బతుకమ్మ ఆటలో ఈశ్వరమ్మ అనే ఒక ఆవిడతో బతుకమ్మ పాటలు పాడించాము. ఇకపై బతుకమ్మ సంబరాల్లో భౌతికంగా ఆడే పాడే సాంప్రదాయమే కొనసాగుతుంది తప్ప రికార్డింగ్‌లు, డీజేలు ఉండవు.

ఆదివాసీల కళారూపాలు, జానపదకళలు మొదలుకొని తెలంగాణ నాటకం వరకు మీ కార్యాచరణ ఎలా ఉండబోతున్నది? సినిమా విషయంలో గతంలో ఉన్న ప్రోత్సాహం ఎలా ఏవిధంగా కొనసాగబోతున్నది?

కోయ, గుస్సాడి, లంబాడి లాంటి ఆదివాసి కళారూపాలు; ఒగ్గుడోలు, బహురూపులు, పగటి వేషాలు, చిరుతలు, కోలాటం లాంటి జానపద కళారూపాల ప్రదర్శనకు వివిధ సందర్భాలలో అవకాశం దొరుకుతున్నది. ఇదివరకు ఇలాంటి కళా ప్రదర్శనలు చూడని నగర ప్రజలు కూడా వీటిని చూసే అవకాశాలు కలుగుతున్నాయి. ఆధునిక కాలం తీసుకువచ్చిన వేగం వల్ల ఒక్క సినిమాలే గాక టీవీలు, యూట్యూబ్ చానళ్లు, ఇతర మీడియా విస్తరించడంతో ఒక ప్రదర్శన రూపంగా నాటకం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఇది తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన సమస్య కాదు. అయినప్పటికీ వరంగల్, నల్గొండ, ఖమ్మం, హైదరాబాదులో అనేక నాటక సమాజాలు ఉన్నాయి. అవి ప్రదర్శనలు కూడా చేస్తున్నాయి. ఇప్పటికీ పౌరాణిక నాటకాలు కూడా తెలంగాణలో ప్రదర్శించబడుతూనే ఉన్నాయి. రవీంద్రభారతిలో నాటకాలు, జానపద కళలు, ఆదివాసి కళారూపాలు సందర్భానుసారంగా ప్రదర్శించబడుతున్నాయి. సినిమా రంగానికి ప్రోత్సాహం కొనసాగుతుంది. తెలంగాణ భాషలో సంస్కృతిని ప్రతిబింబించే సినిమాలకు ఆదరణ లభిస్తుంది. ప్రభుత్వం గద్దర్ అవార్డులను కూడా బహూకరిస్తూ ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే.

భాషా సాంస్కృతిక శాఖ తరఫున సాహిత్య రంగం విషయంలో మీ దృష్టిలో ఎలాంటి కొత్త ఆలోచనలు, ప్రతిపాదనలు ఉన్నాయి?

సాహిత్యంలో కృషి చేయడానికి తెలంగాణ సాహిత్య అకాడమీ, సంగీతంలోనూ నాటకంలోనూ కృషి చేయడానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఉన్నాయి. ఈ రెండు సంస్థలతో సమన్వయంతో పని చేస్తూ సాహిత్యాన్ని సంగీత నాటకాలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రణాళిక ఉంది. గతంలో సాహిత్య అకాడమీ తరఫున 'కావ్య పరిమళం', 'నవలా స్రవంతి' అనే రెండు కార్యక్రమాల ద్వారా తెలంగాణ కావ్యాలను, నవలలను విస్తృతంగా పరిచయం చేసి యూట్యూబ్‌లో స్థిరపరిచాం. పుస్తకాలుగా కూడా ప్రచురించాం. ఈ దిశగా భారతీయ సాహిత్య వైవిధ్యాన్ని తెలంగాణ పాఠకులకు తెలియజేయడానికి ఒక్కో భాషకు సంబంధించిన ప్రాతినిధ్య కావ్యాన్ని లేదా గ్రంథాన్ని పరిచయం చేసే ఆలోచన ఉంది. అనంతరం ప్రపంచంలో ప్రసిద్ధ సాహిత్య గ్రంథాలను విశేషజ్ఞుల చేత పాఠాలుగా చెప్పించి అటు దృశ్య రూపంలోనూ ఇటు గ్రంథరూపంలోనూ స్థిరపరిచే ఆలోచన కూడా ఉంది. నాటక సమాజాల దృష్టి కోణం నుండి కాకుండా, దార్శనికతతో కొన్ని నాటకాలను సృజింపజేసి అవి తెలంగాణ ప్రధాన పట్టణాలన్నింటిలోనూ ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయాలన్న ఆలోచన ఉంది.

సాహిత్య కార్యక్రమాలు ఇక ముందు మీ శాఖ నిర్వహిస్తుందా? సాహిత్య అకాడమీ నిర్వహిస్తుందా?

సాహిత్య కార్యక్రమాలను ప్రధానంగా సాహిత్య అకాడమీ నిర్వహిస్తుంది. కానీ సాంస్కృతిక శాఖ కూడా సందర్భావసరాలను బట్టి, సాహిత్య అకాడమీతో సమన్వయం చేసుకుంటూ సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

భాషా సాంస్కృతిక శాఖ తరఫున మీ దృష్టిలో వినూత్న కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?


సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి సాహిత్యాన్ని కళలను ఉపయోగించ దలచుకున్నాం. స్త్రీ సాధికారత కోసం, గంజాయి, మాదకద్రవ్యాలులాంటి దుర్వ్యసనాలను నిర్మూలించడం కోసం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ప్రజలను చైతన్యపరచడం కోసం అవసరమైతే జిల్లా కేంద్రాలకు నియోజకవర్గ కేంద్రాలకు మండల కేంద్రాలకు కూడా భాషా సాంస్కృతిక శాఖ కార్యక్రమాలను విస్తరించాలనుకుంటున్నాం.

ఇంటర్వ్యూ ■ **ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్**
✆ 98490 82693

గురజాడకు ముందే ముత్యాలసరం

19వ శతాబ్దాన్ని క్షీణ యుగంగా తెలుగు సాహిత్య చరిత్రకారులు నిర్ణయించడం కారణంగా– ఆ శతాబ్ది సాహితీ ప్రాభవం అజ్ఞాతమై విస్మరణకు గురైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపన తర్వాత పీజీ విద్యార్థులకు వాఙ్మయ పాఠ్య ప్రణాళిక రూపొందించిన సాహితీవేత్తలు కూడా ఇదే అభిప్రాయం కలిగి ఉండటంతో ఈ భావన అలాగే స్థిరపడిపోయింది. 19వ శతాబ్దాన్ని క్షీణయుగంగా నిర్ధారించి నిర్దిష్ట అధ్యయనం, పరిశోధన చేయకపోవటంతో తెలుగు భాష ఎంతో సాహిత్య చరిత్రను కోల్పోయింది.

ఇటీవల ఆధునిక సాహితీవేత్తలు, కవిపండిత విమర్శకులు కొందరు ఆ శతాబ్దిపై దృష్టి సారించారు. వారి కృషి వల్లనే ఆధునిక నవ్యయుగానికి సంబంధించిన బీజాలు 19వ శతాబ్దిలోనే పడ్డాయన్న సత్యం ఎట్టకేలకు వెలుగు చూసింది. ఈ దిశగా తన పరిశోధన ఎక్కుపెట్టిన వారిలో డా. ఆచార్య ఫణీంద్ర ముఖ్యులు. 20వ శతాబ్ది నవ్యకవితా మహావృక్షం ఒక్క మారుగా అవతరించలేదనీ, 19వ శతాబ్దిలో పడిన బీజాలు అంకురించాయనీ ఫణీంద్ర వివిధ దృక్కోణాలలో విస్తృత అధ్యయనం అనంతరం నిరూపించారు. ఆయన ఈ ఇతివృత్తంపై తన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని 2008లో సమర్పించారు. ఆ సిద్ధాంత గ్రంథం 2024లో ప్రచురితమై పండితలోకంలో సంచలనం సృష్టించింది.



'క్షీణయుగం కాదు... ఉషోదయ యుగం (19వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్ర)' పేరుతో ప్రచురితమైన ఈ గ్రంథంలోని ఆరవ అధ్యాయంలో, 11వ శతాబ్ది నుండి 19వ శతాబ్ది అంతం వరకు సంప్రదాయ పద్య ఛందస్సులతో కొనసాగిన తెలుగు కవిత్వం ఏవిధంగా కొత్త మలుపు తిరిగినదీ ఫణీంద్ర విశ్లేషించారు. 19వ శతాబ్ది తెలుగు కవిత్వంలో ఛందో నవ్యతను, నవ్య కవిత్వ యుగారంభంలో దారి ప్రభావాన్ని స్పష్టం చేసారు. రేవణూరి వెంకటార్యుడు 1810ప్రాంతంలో ఇంచుమించుగా ముత్యాలసరం ఛందస్సును తన 'శ్రీపాద రేణు ప్రభావం' అన్న కావ్యంలో ప్రయోగించారని, గురజాడ కంటే సుమారు వందేళ్ళకు పూర్వమే ఈ ఛందస్సు వుందని ఆధారాలతో ఫణీంద్ర రుజువు చేసారు.

రేవణూరి వేంకటార్యుని ఛందస్సు పేరును తురంగ వృత్తంగా పేర్కొంటూ, రెండు ఛందస్సుల సామ్యాన్ని తన సిద్ధాంత గ్రంథంలో పరిశోధనా దృక్కోణంతో అవలోకింప చేసారు ఫణీంద్ర. ఈ వృత్తం గురజాడ ముత్యాలసరం ఛందస్సుకు ఆద్యరూపంగా పేర్కొన్నారు. గురజాడ కొత్తగా మాత్రా ఛందస్సుకు ముత్యాలసరం సృజించాడనే విషయం పూర్తిగా వాస్తవం కాదని నిరూపించారు.

1831 నాటి 'ఆంధ్రభారతి' పత్రికలో 'మేలుకొలుపు' అన్న గేయం ముత్యాలసర మిశ్రగతిలో వుందని సి. నారాయణరెడ్డి తన 'ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు ప్రయోగాలు' గ్రంథంలో ప్రస్తావించారు. గురజాడ రచన 'తోకచుక్క'కు ఒక ఏడాది ముందే 'మేలుకొలుపు' వచ్చింది. 'మేలుకొలుపు' గేయకర్త మంగిపూడి వేంకట కృష్ణశర్మ అయివుండవచ్చని 'ఆధునికాంధ్ర గేయకవిత్వం'లో డా. జి. చెన్నకేశవరెడ్డి అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా ఫణీంద్ర పరిశోధన ప్రకారం 'రేవణూరి' కవి తురంగ వృత్తకావ్య ప్రభావం తదనంతర శతాబ్దిలోని నవ్యకవితారీతులపై పడి వుండవచ్చునని స్పష్టమవుతోంది.

1862లో జన్మించిన గురజాడ కాలం నాటి స్థితిగతులకు, మత సాహిత్యం వెల్లివిరిసిన రేవణూరి వేంకటార్యుని రోజులకు సంబంధం లేదు. గురజాడ 53ఏళ్ల జీవితకాలంలో గ్రాంథిక భాషావాదుల ప్రతిఘటనను ఎదుర్కొంటూ సంస్కరణాయుత తిరుగుబాటుతో ఎదురీదారు. తేటైన తల్లి నుడి కూర్చుకొని ముత్యాలసరాలు గుచ్చి వాడుక పలుకుబడితో తెలుగు పద్య మణిహారాన్ని గేయంగా అవతరింపచేసారు. ఆయన మాటలలో– ముత్యాలసరము ఒక వితత కవితా ఖని. ఆయన తన ముత్యాలసరం రచనా ప్రక్రియ మూలం గురించి వివరంగా ఎక్కడా చెప్పలేదు. "ఒక జాతి పార్శీ గజలు యొక్క నడకతో ముత్యాలసరం తెచ్చుటకు ప్రయత్నించాను" అని మాత్రం లక్షణ వ్యాసంలో తెలిపారు. రేవణూరి వెంకటార్యుని అద్భుత సృష్టి తురంగ వృత్తం, 'వృషభగతి', 'హరిణగతి' ప్రాచీన జానపద గేయాల రగడల ఒరవడిలోనే సాగింది.



గురజాడ అనంతరం తొలి శ్రేణిలో అబ్బూరి, బసవరాజు, దేవులపల్లి, కవికొండల, శ్రీశ్రీ ఎందరో గురజాడ అడుగుజాడలో ఈ ప్రక్రియ అనుసరించి నవ్య కవితా మహోదయాన్ని ఆహ్వానించారు. విశ్వమానవ సౌభ్రాతృత్వం, సంఘ సంస్కరణ ప్రియత్వం, మానవతా విలువలు, జాతీయతా, దేశభక్తి మహదాశయంతో ముత్యాలసరాలు నాంది పలికింది. ఈ అద్భుత ప్రక్రియ సృష్టికర్త రేవణూరి వేంకటార్య కవి తెలుగుజాతికి చిరఃస్మరణీయులు.

■ **జయసూర్య**
✆ 94406 64610

ఎంత గొట్టుగా రాస్తే అంత మంచి కవిత అనుకునేవాడ్ని!

నా మొదటి పుస్తకం

నలిమెల భాస్కర్

అది 1974వ సంవత్సరం. అప్పుడు నాకు 18ఏళ్ళ ప్రాయం. కామారెడ్డి కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరంలో ఉన్నాను. మాకు ఇంటర్, డిగ్రీల్లో గుండి వేంకటాచార్య, కసిరెడ్డి వెంకటరెడ్డి గార్లు తెలుగు బోధించేవాళ్ళు. అదే ఏట నా మొదటి కవితా సంపుటి 'మానవుడా' వచ్చింది. ఇందులో పదహారు గేయాలున్నాయి. దేశభక్తి గేయాలు, అభ్యుదయ గీతాలు, ప్రణయ గీతాలు మొదలైనవి అన్నీ దాదాపుగా తిస్ర చతురస్ర గతుల్లోని గీతాలు. వీటిపై సి. నారాయణరెడ్డి, కనపర్తి, చొప్పకట్ల, వడ్డెపల్లి ప్రభావాలు పడ్డాయి. పైగా అప్పటికి దాదాపు ప్రబంధాలు నేనే ఆసక్తికరంగా చదువుకున్నాను కనుక వాటి ప్రభావమూ ఉంది. చిన్నప్పుడు బాగా పాటలు పాడేవాణ్ణి! కాబట్టి ఆ అసర్ కూడా ఉంది, ఇంతో కొంతో. నా కవిత్వం ప్రతి అక్షరం చూసిన గురువు కసిరెడ్డి గారే నా 'మానవుడా' గేయ సంపుటికి ముందుమాట రాసారు. గుండి వారు, అవధానం రంగనాథ వాచస్పతి గారి ముందు మాటలూ ఉన్నాయి. పుస్తకాన్ని మా కళాశాలకే అంకితం చేసాను. ప్రిన్సిపాల్ ఎ. నరసింహారెడ్డిగారు ఆర్థిక సాయం చేసారు. అప్పట్లో కవర్ పేజీలు ఇంత అందంగా లేవు. అచ్చులో పేరు చూసుకుంటే చాలు అనుకునే సంతృప్తి. సిరిసిల్ల విష్ణు ప్రెస్‌లో అచ్చయింది. ఆవిష్కరణ కళాశాలలోనే. గిరిజా మనోహర్ బాబు సమీక్షించారు. మొదటి ప్రతి ప్రిన్సిపాల్ గారికే. నిజామాబాద్ సిహెచ్.మధు ఏదో పత్రికలో సమీక్ష చేసారు.



ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి 'మానవుడా' అనే టైటిల్ గేయం నాలుగు సార్లు ప్రసారితమైంది. వింజమూరి సోదరీమణుల సంగీతం. నరసింహరాజు 'మానవుడా మానవుడా – మానవతను మరచినావు దారుణ తిమిరాన మునిగి దానవతకు మరగినావు' అంటూ పాడారు. 'రాడాయె వెన్నెల రేడు లేడాయె మిన్నుల నేడు ఎదురు చూసి కన్ను దోయి అలసి పోయె కనవోయి నిరీక్షణ' కవిత. అప్పుడు ఎంత గొట్టుగా రాస్తే అంత మంచి కవిత అనే ఎరుక నాది. 'తృణ సస్య పర్ణస్థిత తుషారమ్ము స్వచ్ఛంద మౌక్తిక సమ ప్రకాశితమ్ము–తరుణీకంకణ కల నినాదమ్ముగృహ బహిర్ద్వారముల కలయంపి చిమ్ము' అని చిమ్ముతూ ఉండేవాణ్ణి! లంచాలను, అక్రమ సంబంధాలను, అత్యాచారాలను కూడా గేయాలతో బలంగా గాయపరచాను



'సంతోషము సంత్రాసము వర్షమ్మును గ్రీష్మమ్మును వాత్సల్యము మాత్సర్యము రసఝురులను విష కీలల కారుణ్యము కాఠిన్యము ఒక్కరూపుగా తలచెడు సమదర్శిని సమదర్శిని' అంటూ నా గురించి చెప్పుకున్నాను. మొదటి ముద్దలో లేని, మొదటి ముద్దులో లేని, మొదటి పొగ గుక్కలో లభించని, చివరి అదృష్టపు డ్రాప్స్‌లో దొరకని అనుభవం సృజనకారులు తమ సిరా చుక్కల్ని మొదటి పుస్తకంలో చూసుకున్నప్పుడు పొందే అనుభూతితో కలుగుతుంది. అది చెప్ప శక్యం కాని ఆనందపారవశ్యం. ■

బిరసొల్లా కొండదారి

అమరాయొల్ల తగలకండా
సింతలొల్ల నుండి జమితెల్లాలంతే
కనబడీది ఈ అడ్డదారి

బిరసాడొల్ల నుండి ఆల్తిపేరంటాల గుడి దాకా
ఉంతాదంతాం కదా
అదే ఈ బతుకు దారి


ఇప్పలొల్ల బస్సునేకమునుపు
ఎవులైనా
దేశమెల్లిపోతే
నెత్తి మీన మూట బరువేగాదు
బారమైపోయిన గుండె బరువూ
దీనికి అనుబవమే

కూలికెల్లే సైకిల్ సెక్రాలు ఎత్తుపల్లాలు ఓరవలేనపుడు
పడిపోయిన కేరేజీని చూసి
తెల్లగా గడ్డకట్టేసిన దుక్కమైపోయాదీ దారి

అప్పడే దించిన జీరుక్కల్లు
పూటుగా తాగేసి పడిపోయినోడ్ని
ఓ పక్కన పడుకోబెట్టుకొని
సెట్టుగొడుగు తొడిగే అమ్మవొడైపోయాది

జమితిలో పెల్లయితే
సెంపావతిలో దిగొచ్చిన పిట్టాడనేత్తాల
అరికాల్లతో ఊసులాడి
నది సంగతులు తెలుసుకొని
పక్కనే పారుతున్న కాలవలో
సేపపిల్లయి సంబరపడిపోయాది

మెంటాడ నాలం పెద్దోడి
మలారం ఇలగే నడిసీది
గజంగుడ్డొల్ల కొండదొర్ల ఆడబొట్టి
సేతిని గాజుపువ్వై మెరిసీది



శీతాకాలం తెల్లారినుండి పొద్దోయిందాకా
కొత్తబట్టల మూటల్ని కొండమీదకి
ఎల్లండ్రా అన్నట్టు పంపి
ఎక్కడెక్కడో పండుగుల్ని ఇక్కడే కలగనీసీది

సముద్రాన్నెండబెట్టి
తట్టకెత్తకొచ్చిన కోనాడ సేపలమ్మని
నెలకోపాలి కీసురాయి గొంతుతో పలకరించీసీది

పంచరు సామాన్లొట్టుకొని
ఊరూరు తిరిగే అప్పారావుని
ఒక్కరోజు సూడప్పోయినా
కోసీసి తిన్నగా పరిసిన
గాల్లేని సైకిల్ సూపునాగ అయిపోయాది

అట్టాటిదారి
మట్టిదారి
మందిదారి
ఇప్పుడేటైపోనాదనుకుంతన్రా
అనుకున్నదే అయింది
అడివిని నొల్లీసుకోడానికి
బూకంపం నాగొచ్చీసి
మడిసిని సూత్తే బగ్గుమంతన్న పేద్దరోడ్డొకటి
దీన్ని మింగీసింది

మాది గానిది
మేమంటే ఒప్పంది
ఎంతగొప్పదైతే మాకేటి
ఎంత పెద్దదైతే మాకేటి

రాజైమా
ఇంకేటి సేత్తాం సెప్పిమి
నీ దారి నీది
మా దారి మాది

■ **పాయల మురళీకృష్ణ**
✆ 83094 68318

చిన్ని చిన్ని ఆనందాలు



ఎప్పుడో ఎక్కాల పుస్తకంలో
శ్రావణభాద్రపదాలు వర్షరుతువని
బట్టీ పెట్టిన దర్జాలు మారి
ఏ కాలంలోనైనా ఉక్కపోతల చెమట ఋతువే
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే
మంచి మనసు లాంటి
మంచిగంధపు తెర వీచినంత ఆనందం

అప్పటివరకు
అలమరలో బీరువాలో వెదకి వెదకీ
ఇక కనబడదనుకొన్న ఇష్టమైన పుస్తకం
చాలాకాలం తర్వాత
అనుకోకుండా
పాతపుస్తకాల దొంతరలో
ఒక్కసారి కనబడగానే
ఎగిరి గంతేసినంత ఆనందం

ఆకులన్నీ రాలిపోయి
రెమ్మలన్నీ ఎండిపోయి
తలవాల్చేసిందనుకొన్న మొక్క
ఒకరోజు పొద్దున్నే
ఎండిన కొమ్మల మధ్యనుంచి
ఎర్రని చిగురునవ్వులతో పలకరించినపుడు
ఆకాశమే వంగినంత ఆనందం

చిన్నపుడు బళ్ళో
ఒకే బెంచీపై పక్కపక్కనే
కబుర్లు అల్లర్లు మేట్నీ సినిమాల
బాల్యస్నేహితురాలు
బతుకు తాపత్రయాల ప్రయాణంలో
చీలిన దారుల్లో
ఎవరికి వారు వేరయ్యాక
చిరకాలానంతరం కలిసినపుడు
ఉత్సాహం ఊయల్లో
ఊగిన ఆనందం

కృత్రిమ మేధా ప్రపంచంలో
చుట్టూ నిలువెత్తు
నిశ్శబ్దం గోడలు మొలిచినపుడు
ఉరి తీయబడుతున్న మాటల నేపథ్యంలో
ఒంటరితనం గొంగళి పురుగు
తన కన్నీటి పత్రాలను తానే తింటున్న వేళ
ఎక్కణ్ణుంచో
చెవుల్లో గుసగుసగా
పాట వినబడుతుంటే
మైమరచిన ఆనందం

చిన్న చిన్న ఆనందాలే
చెప్పలేని మాధుర్యాలు
ప్రమిదల్లో వత్తులు నిలిచి కాలుతున్నట్టు
జీవితాన్ని వెలిగించే అపురూప క్షణాలు

■ **మందరపు హైమవతి**
✆ 94410 62732

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 6 అక్టోబరు 2025



ఆగేనా.. సాగేనా?!

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఉత్కంఠ

- నేడు సుప్రీం కోర్టు తీర్పు.. ఎల్లుండి హైకోర్టులో విచారణ
- కోర్టులు అడ్డు చెబితే రిజర్వేషన్లు మారే అవకాశం
- ఇప్పటికే 42శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానాలు ఖరారు
- కొందరికి సంతృప్తి.. చాలా చోట్ల సీనియర్ నేతల అసంతృప్తి
- సుప్రీం, హైకోర్టు నిర్ణయాలపై ఆశావహుల ఎదురుచూపు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ ఎన్నికలు జరుగుతాయా..? కోర్టు జోక్యంతో వాయిదా పడుతాయా..? రిజర్వేషన్లు మారుతాయా..? అనే ఉత్కంఠ నేతల్లో నెలకొంది. బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయించటంతో ఎన్నికలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేసి, ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే 42శాతం రిజర్వేషన్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తే.. ప్రస్తుత రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. బీసీ సీట్లు తగ్గటంతో పాటు జనరల్ సీట్లు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. రిజర్వేషన్లు కలిసి రాక అసంతృప్తితో ఉన్న ఆశావహులు.. కోర్టు తీర్పుపై ఆశగా ఎదురుచూస్తున్నారు.



రిజర్వేషన్ల ఖరారుతో జోష్

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. తొలి విడత పరిషత్ ఎన్నికల కోసం ఈ నెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 75 జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. వీటితో పాటు 764 ఎంపీటీసీలు, 1,653 గ్రామపంచాయతీలు, 14,786 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. దీంతో బీసీలకు భారీ సంఖ్యలో పోటీ అవకాశం ఏర్పడింది. దీంతో గ్రామాలు, మండలస్థాయిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కొత్తగా ఖరారైన రిజర్వేషన్లతో ఆశావహులు చాలామంది అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి తామే అభ్యర్థులమనే ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు ఎవరనే చర్చ ప్రజల్లో మొదలైంది. ఎవరెవరు బరిలో ఉంటున్నారు..? ఎవరు గెలిచే అవకాశాలున్నాయని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. అభివృద్ధి, సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ఓటర్లకు వల వేసేలా వ్యూహ రచన చేస్తుంటే.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళుతోంది.

అభ్యర్థుల వేట

స్థానిక ఎన్నికలపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ.. జడ్పీటీసీ స్థానానికి పోటీ పడే ముగ్గురు పేర్లతో అభ్యర్థుల జాబితాను ఇప్పటికే అధిష్ఠానానికి పంపించారు. ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేల సమక్షంలో ఎంపిక చేయనున్నారు. మరోవైపు వర్ధన్నపేట, పాలకుర్తి, భూపాలపల్లి, నర్సంపేట, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ, వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి గులాబీ శ్రేణుల్లో జోష్ నింపేలా ప్రచారం చేస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీలు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. వాటిలో మెజారిటీ జడ్పీ పీఠాలను కైవసం చేసుకోవాలని గులాబీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇక బీజేపీ సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టింది. మూడు ప్రధాన పార్టీలు స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాయి. మరోవైపు ఆశావహులు గ్రామాల్లో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల్లో రాజకీయ ఉనికి చాటుకునే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఈ రిజర్వేషన్లు ఉంటాయా..? ఉండవా..? అన్న దానిపై స్పష్టత లేకపోవడం ఆశావహులను ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. ఓ వైపు తాము బరిలో (మిగతా 5లో..)



దొంతి కాంతమ్మకు ఘన నివాళులు

హనుమకొండలోని ఎమ్మెల్యే మాధవరెడ్డి నివాసంలో కాంతమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఫోన్‌లో ఎమ్మెల్యే మాధవరెడ్డికి సీఎం పరామర్శ
- సాయంత్రం శివముక్తి ధామ్‌లో అంత్యక్రియలు
- అంతిమ యాత్రలో పాల్గొన్న నేతలు, ప్రజలు

5

21 నుంచి పత్తి కొనుగోళ్లు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఈనెల 21నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) వరంగల్ శాఖ ప్రకటించింది. రాష్ట్రంలో త్వరలో 122 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపింది. కొనుగోలు కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఇప్పటికే కపాస్ కిసాన్ స్లాట్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. రైతుల సౌలభ్యం కోసం 7 రోజుల రోలింగ్ ప్రాతిపదికన స్లాట్ బుకింగ్‌ను సులభతరం చేస్తామని, ఈ విధానం రైతులు తమ పత్తిని ఇబ్బంది లేకుండా విక్రయించుకోవడానికి అనువుగా ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలోని పత్తి రైతులందరూ ప్రభుత్వ పోర్టల్‌లో తమ రిజిస్ట్రేషన్‌ను నిర్ధారించుకోవాలని సీసీఐ సూచించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.



రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

రామప్పలో సందడి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ముందుగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ఉమాశంకర్, హరీశ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పర్యాటకులు ఆలయ శిల్పకళా సంపదను తనివితీరా వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ఆలయ గార్డెలో కొద్దిసేపు సేదతీరుతూ ఆనందంగా గడిపారు.

- వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి)

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్‌హాల్‌లో జరుగనుందని బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

కదం తొక్కిన కర సేవకులు

- ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వసంతాల ర్యాలీ
- నగరంలో స్వయం సేవక్ రూట్‌మార్చ్
- ఏకరూప దుస్తులతో పాల్గొన్న ప్రముఖులు
- మిన్నంటిన భరతమాత నినాదాలు



హనుమకొండలో జీపులో ఆర్ఎస్ఎస్ ముఖ్యుల చిత్రపటాలతో ర్యాలీ దృశ్యం



హనుమకొండలో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీ పునర్ వైభవమే లక్ష్యంగా, సామాన్యుల అసామాన్య దేశభక్తితో నగరంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తలు కదం తొక్కారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి విజయదశమికి వంద సంవత్సరాలకు చేరుకున్న క్రమంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాల్లో సుమారు 5వేల మంది ఆర్ఎస్ఎస్ సేవకులు పథ సంచలన్ పేరుతో నేత్రపర్వంగా కవాతు నిర్వహించారు. ర్యాలీలో జైజై మాత, భారత్‌మాతా, జైబోలో వందేమాతరం.. అంటూ నినాదాలతో ఓరుగల్లు నగరాన్ని ప్రతిధ్వనింపజేశారు. వేల సంఖ్యలో శాఖలు, కోట్ల సంఖ్యలో సేవకులు, కఠోర క్రమశిక్షణను కనబరుస్తూ అనేక మంది ప్రముఖులు వయోబేధం లేకుండా ఏకరూప దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఘోష్ బృందం బ్యాండ్ మేళంతో వాయిద్యాలను మోగిస్తుండగా మధ్యలో పూలతో అలంకరించిన జీపుపై భరత మాత, డాక్టర్ జీ, గురూజీ చిత్రపటాలతో కాషాయ జెండా ఉంచి స్వయం సేవకులు లయబద్ధంగా కవాతు చేస్తూ నగర వాసులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దారి పొడవునా కొన్ని ప్రాంతాల్లో మహిళలు పూలుచల్లుతూ మంగళహారతులు పట్టారు.

రూట్‌మార్చ్

కాజీపేట రామాలయం నుంచి ప్రారంభమైన రూట్‌మార్చ్.. జూబ్లీమార్కెట్, మెయిన్‌రోడ్, విష్ణుపురి, రహమత్ నగర్ మీదుగా ఒక బృందం రామాలయం చేరుకుంది. భవానీనగర్, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో, తుషార స్కూల్ నుంచి ప్రారంభమైన రూట్‌మార్చ్, ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గ కాలనీ, టీచర్స్‌కాలనీ సుబేదారి మీదుగా తిరిగి కేఎల్ఎన్‌రెడ్డికాలనీకి చేరుకుంది. మరో బృందం విశ్వవిద్యాలయ ప్రాంతంలో పోచమ్మకుంట, హనుమన్ దేవాలయం నుంచి ప్రారంభమై ఎస్‌డీఎల్‌సీఈ నుంచి శరణ్య హాస్పిటల్ మీదుగా డబ్బాల సెంటర్‌కు చేరుకొని అక్కడ నుంచి పోచమ్మకుంట హనుమాన్ ఆలయానికి చేరుకుంది. అదే విధంగా ఖిలావరంగల్ ప్రాంతంలోనూ ర్యాలీలు కొనసాగాయి. ఈ కార్యక్రమాల్లో ప్రొఫెసర్ చిలకమారి సంజీవ, పెద్దిరెడ్డి మల్లారెడ్డి, డాక్టర్ బందెల మోహన్‌రావు, ప్రొఫెసర్ గద్దె రమేశ్, పృథ్వీరాజ్, కె.శ్రీనాథ్, జూలపల్లి కరుణాకర్, ప్రమోద్, డాక్టర్ కోదాటి సుధాకర్‌రావు, ఘంటా రవికుమార్ తదితర ప్రముఖులు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, అమరేందర్‌రెడ్డి, డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి, అభినవ్ భాస్కర్ తదితరులు కూడా ఏకరూప యూనిఫామ్‌లో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్‌లో పాల్గొన్నారు. కాగా, వరంగల్ త్రినగరాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని భూపాలపల్లి, ఏటూరునాగారం, ములుగు, రేగొండ, చిట్యాల, పరకాల, ఆత్మకూరు, నల్లబెల్లి, నర్సంపేట, పర్వతగిరి, వర్ధన్నపేట, జనగామ, నర్మెట్ట ప్రాంతాలలో కూడా ఆయా శాఖల ఆధ్వర్యంలో పథ సంచలన్ పేరిట రూట్‌మార్చ్ నిర్వహించారు.



బొగత సవ్వడి

తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో పర్యాటకులు ఆదివారం భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతం అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈత కొలను వద్ద జలకలాడుతూ పరవశించిపోయారు. బొగత జల సౌందర్యాన్ని సెల్‌ఫోన్లలో బంధించారు. - వాజేడు (ఆంధ్రజ్యోతి)

కుటుంబ కలహాలతో ఆత్మహత్య


సాయిరెడ్డి (ఫైల్)

బచ్చన్నపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామం లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. ఉమ్మెంతల సాయిరెడ్డి (38)కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొద్దిరోజులుగా భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి.దీంతో కొద్దిరోజుల నుంచి అతడి భార్య నందిని పుట్టింటివద్దే ఉంటోంది. ఈ క్రమంలోనే ఆదివారం సాయిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన రైతులు సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అబ్దుల్ హమీద్ తెలిపారు.

మహిళను వీడియో తీసిన యువకుడిపై కేసు

కరీమాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్నానం చేస్తున్న ఓ మహిళను వీడియో తీసిన యువకుడిపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ చింతల్ ఆర్ఎస్ నగర్‌కు చెందిన ఓ మహిళ బాత్రూంలో స్నానం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్ అనే వ్యక్తి వీడియో తీశాడు. ఈ విషయంలో కుటుంబ సభ్యులు అమీర్‌ను నిలదీయగా అతడి కుటుంబ సభ్యులు ఘర్షణకు దిగడంతో పాటు ఎదురు దాడికి దిగారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించగా నిందితుడు మహ్మద్ అమీర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

సీనియర్ న్యాయవాది జాఫర్ అహ్మద్ మృతి


జాఫర్ అహ్మద్ (ఫైల్)

వరంగల్ లీగల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది సయ్యద్ జాఫర్ అహ్మద్(72) శనివారం మృతి చెందారు. దసరా సెలవుల్లో సౌదీలోని మక్కా యాత్రకు వెళ్లిన ఆయన అస్వస్థతకు గురై ఆకస్మికంగా అక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన 1987లో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకొని ప్రాక్టీస్ చేస్తున్నారు. కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన జాఫర్ అహ్మద్.. 43 ఏళ్లుగా సివిల్ కేసులు వాదిస్తూ న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతి పట్ల హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్, పలువురు న్యాయవాదులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఏఐబీఎఫ్ కోశాధికారిగా కేశవరావు


కొండపల్లి కేశవరావుకు తలపాగా అలంకరిస్తున్న జాతీయ ప్రధాన సలహాదారు డాక్టర్ ప్రదీప్‌జ్యోతి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏఐబీఎఫ్) కోశాధికారిగా మహబూబాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కొండపల్లి కేశవరావు ఎన్నికయ్యారు. హర్యాన రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ 2025-28 సంవత్సరాలకు గాను ఎన్నికలు ఆదివారం జరిగాయి. తొలుత జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఎస్‌డీ శర్మ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఛండీఘర్‌కు చెందిన యశ్‌పాల్‌తివారి జాతీయ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. ఆ క్రమంలోనే జాతీయ కోశాధికారిగా తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కొండపల్లి కేశవరావు ఎన్నికయ్యారు. 2022లో తొలిసారిగా కొండపల్లి కేశవరావు ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్‌కు కోశాధికారిగా ఎన్నిక కాగా తాజాగా జరిగిన ఎన్నికల్లోను రెండో సారీ ఇదే పోస్టుకు ఎన్నికయ్యారు.

రేపు కోటకు రానున్న పురావస్తుశాఖ డైరెక్టర్

ఖిలావరంగల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ అర్జున్ రావు ఈనెల 7న ఖిలావరంగల్‌కు వస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ సందర్శన, వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మధ్యకోటలో పర్యటిస్తారు. మ్యూజియం, శ్రీస్వయంభూ-శంభులింగేశ్వర స్వామి దేవాలయంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రారంభతేదీ తదితర విషయాలపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారని సంబంధిత అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 2.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 4.20మీటర్లు నమోదైంది.

రోడ్డు సరే.. రొక్కమేది?

- పరిహారం కోసం ఇన్నర్ రింగ్‌రోడ్ బాధితుల ఎదురుచూపులు
- ఎనిమిదేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- వివిధ కారణాలతో ఫైళ్లు పెండింగ్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- సాకులు చెబుతున్న అధికారులు


వరంగల్ నాయుడు పెట్రోల్‌పంపు వద్ద మాజీ మంత్రి కేటీఆర్ ఇన్నర్‌రింగ్‌రోడ్‌కు శిలాఫలకం వేసిన దృశ్యం

ఖిలావరంగల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టా భూములు తీసుకొని రోడ్డు వేశారు. కాని వారికి పరిహారం అందించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కొందరికి ఇచ్చి మరికొందరికి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఇదేమంటే రకరకాల కారణాలు చెబుతున్నారు. ఇలా ఏకంగా ఎనిమిదేళ్లుగా పరిహారం పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో భూబాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. 1975 సంవత్సరం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిమ్మాపూర్, రంగశాయిపేట, ఖిలావరంగల్, చింతల్, గొర్రెకుంట, ఏనుమాముల మార్కెట్ తదితర ప్రాంతాల నుంచి 8 కిలోమీటర్ల దూరం 200ఫీట్ల ఇన్నర్‌రింగ్ రోడ్‌కు 2017లో ప్లాన్ చేశారు. ఇందుకోసం 350 మంది రైతుల నుంచి భూమిని సేకరించారు. వారిలో మొదటగా రెవెన్యూ అధికారులు 70మందికి, రెండోసారి మరో 90మందికి నష్టపరిహారం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల మరో 70 మందికి రైతులకు చెల్లించారు. మిగిలిన 120 మందికి పెండింగ్‌లో పెట్టారు. వారు ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. అయినా ఫలితం ఉండడంలేదు. కాని ఆరు నెలల క్రితం మామునూరు ఎయిర్‌పోర్టుకు ఆమోదం రాగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు భూములను సర్వే చేసి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తున్నారు. వీరిని మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఈ ఎనిమిదేళ్లలో ఇటు నష్టపరిహారం అందక అటు భూములు కోల్పోయి మనస్తాపంతో 15 మంది రైతులు మృతిచెందారు.

ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ 2023 జూన్ 17న, రూ.313 కోట్లతో వరంగల్ ఇన్నర్‌రింగ్‌రోడ్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత బడ్జెట్ లేదంటూ 2 సంవత్సరాలుగా రైతులకు నష్టపరిహారం చెల్లించడంలేదు.

అధికారుల కొర్రీలు..

పరిహారం పెండింగ్‌లో ఉన్న 120 మంది రైతులకు సంబంధించి పట్టాపాస్‌పుస్తకాలు సరిగా లేవని, సాదా బైనామా, నోటరీ, పోలీస్‌కేసులు, సర్వేనెంబర్ జంప్, కోర్టుకేసులు, వారసత్వ సమస్యలు ఉన్నాయని, అందుకే పరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే ఆ సమస్యలను పరిష్కరించాల్సింది సదరు అధికారులే కదా అని రైతులు అంటున్నారు. సాగులో ఉన్నది మేమే కాదా అని స్పష్టం చేస్తున్నారు.

నాయకులు, అధికారులు స్పందించడం లేదు

పాలకుర్తి సత్యనారాయణ, రైతు, ఖిలావరంగల్



భూమిని కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో నాయకులు, అధికారులు స్పందించడం లేదు. 8 ఏళ్ళుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అప్పటి నుంచి అటు భూమి పోయి ఇటు పరిహారం రాక మనస్తాపంతో పలువురు రైతులు మృతి చెందారు. పరిహారం చెల్లంచకపోయినా దౌర్జన్యంగా రోడ్డు వేశారు. తక్షణమే నాయకులు, అధికారులు స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

పరిష్కరించాల్సింది అధికారులే కదా..

గంగుల దయాకర్, భూబాధితుల అసోసియేషన్ అధ్యక్షుడు



సాదాబైనామా, నోటరీ రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాల్సింది రెవెన్యూ అధికారులే కదా. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు. భూమిని ఆక్రమించి దర్జాగా రోడ్డు వేసినపుడు పరిహారం చెల్లించడంలో ఇబ్బంది ఏమిటి. ఇంకా ఎన్ని సంవత్సరాలు పరిహారం కోసం తిరగాలి. ఇంకా ఎంత మంది చనిపోవాలి. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా మిగిలిన 120 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.


తూర్పుకోట నుంచి వేసిన 200 ఫీట్ల రోడ్


నాయుడు పెట్రోల్‌పంపు నుంచి వేసిన ఇన్నర్‌రింగ్‌రోడ్

రిటైర్డ్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం


వరంగల్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన సమితి, వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎం.చంద్రమౌళి, అధ్యక్షుడిగా శ్రీధర్ల ధర్మేంద్ర, అసోసియేట్ అధ్యక్షులుగా కె.దేవదాసు, ఎం.డి.మహబూబ్ అలీ, ప్రధానకార్యదర్శిగా కడారి భోగేశ్వర్, జాయింట్ సెక్రెటరీలుగా ఎమ్డీ.అబ్దుల్ గఫార్, ఎం.దామోదర్, ఉపాధ్యక్షులుగా ఎస్.బద్రినారాయణ, ఎస్.గోవర్ధన్, పి.సంజీవరెడ్డి, లక్ష్మయ్య, కార్యదర్శులుగా ఎస్. విష్ణువర్ధన్, పి.సోమయ్య, పి.రమణారెడ్డి, జి.కిషన్‌నాయక్, డి.రవి, ఇంద్రసేనారెడ్డి, అశోక్‌కుమార్, కోశాధికారిగా ఎస్.కుమారస్వామి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

దడువాయి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పనిచేసే దడువాయి యూనియన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కన్వీనర్ నిమ్మాని నాంపల్లి ఆదివారం విడుదల చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- 9వ తేదీ గురువారం 11 నుంచి 1 గంట వరకు నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల పరిశీలన అనంతరం బరిలో ఉన్నవారి పేర్లను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తారు.
- 13వ తేదీ సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నోటీస్ బోర్డుపై గుర్తులు ప్రదర్శిస్తారు.
- 16వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతరం ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు.

పర్వతగిరిలో చోరీ

పర్వతగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద చనమల్ల నర్సయ్య ఇంట్లో శనివారం చోరీ జరిగింది. తన కుటుంబ సభ్యులతో కలిసి నర్సయ్య నాలుగు రోజుల కిందట బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, ఇంట్లో తన కూతురు ఫీజు కట్టేందుకు తెచ్చిన రూ. 50 వేల నగదు, బంగారు కమ్మలు, బుట్టలు, చైను, రింగు, వెండి గొలుసులు అపహరణకు గురైయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య


రాజు (ఫైల్)

ఐనవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో చోటుచేసుకుంది. జఫర్‌గడ్ పోలీసులు తెలిపిన ప్రకారం... అదే గ్రామానికి చెందిన రాజారపు రాజు(45) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం మద్యం తాగి రావడంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగి ఇంటి నుంచి వెళ్లి రాత్రి వచ్చాడు. తాను పురుగుల మందు తాగానని చెప్పడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజుకు భార్య సుజాత, కుతూరు ఉన్నారు. ఇంట్లో గొడవ జరిగి క్షణికావేశంలో పురుగుల మందు తాగి కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జఫర్‌గడ్ పోలీసులు తెలిపారు.

రేబిస్‌తో బాలుడు మృతి


శ్రీచరణ్ (ఫైల్)

పాలకుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వీధికుక్క కరవడంతో రేబిస్ వ్యాధి సోకి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వావిలాలకు చెందిన మైదం శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉంటూ కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నాడు. అక్కడే ఐదో తరగతి చదువుతున్న ఆయన కుమారుడు శ్రీచరణ్ (12) రెండు నెలలు క్రితం మాదాపూర్‌లోని ఇంటి బయట ఆడుకుంటుండగా వీధికుక్క దాడి చేసింది. దీంతో గాయపడిన శ్రీచరణ్‌ను స్థానికంగా చికిత్స చేయించారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రేబిస్ వ్యాధి లక్షణాలు కనిపించడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేస్తుండగా మృతిచెందాడు.

కొండపర్తిలో చైన్ స్నాచింగ్

- వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన దుండగుడు


వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు మణెమ్మ

ఐనవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని కొండపర్తి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... కొండపర్తికి చెందిన వరంగంటి మణెమ్మ గ్రామ శివారులో వనమాల కనపర్తి వైపు ఉన్న తమ వ్యవసాయ భూమి వద్దకు నడుచుకుంటూ వెళ్తుంది, మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తి బైక్ ఆపి వృద్ధురాలిని మాటల్లో దింపి బైక్ ఎక్కించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లాక తరాల సాంబయ్య బెండ తోట వద్ద బెండకాయలు తెంపుకుంటానని నమ్మబలకగా వృద్ధురాలు బైక్ దిగింది. వెంటనే ఆమె మెడలో నుంచి 2 తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని వెళ్లిపోయాడు. మణెమ్మ ప్రతిఘటించినా ఫలితం లేకుండా పోయింది. సంఘటన స్థలానికి పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్‌లు చేరుకొని ఆరా తీసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

ప్రమాదాలకు నిలయంగా వరంగల్-ఖమ్మం రహదారి


ఇల్లందలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి (563) అంటేనే ప్రయాణికులు వామ్మో అంటున్నారు. ఈ దారిపై రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే వణికిపోతున్నారు. వరంగల్ నుంచి ఖమ్మం వరకు దాదాపు 119 కిలో మీటర్ల వరకు ఉన్న జాతీయ రహదారిపై నిత్యం వేలాది భారీ వాహనాలు వెళ్తుంటాయి. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారులో ఏర్పడిన గుంతలతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఉప్పరపెల్లి క్రాస్ నుంచి తొర్రూరు వరకు ప్రయాణించే వాహనాలు దినదిన గండంగా వెళ్తున్నాయి. ఎక్కడ చూసినా గుంతలే ఏర్పడడంతో కొత్తగా ఈ దారిలో వచ్చే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. కాంట్రాక్టరు నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.


ఇల్లందలో గుంతను తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడిపోయిన దంపతులు

దంపతులకు తప్పిన్న ప్రమాదం..

ఇల్లంద గ్రామంలో శనివారం రాత్రి గూడురు రాధిక శ్రీనివాస్ అనే దంపతులు తమ కూతురు దివ్యతో కలిసి బైక్‌పై వరంగల్ వెళ్తుండగా జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతను తప్పించబోయి కిందపడ్డారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గుంతలోనే బైక్ పడుంటే పరిస్థితి వేరేలా ఉండేదని దంపతులు వాపోయారు. తమతో పాటు కూతురు సైతం ఉండడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి రహదారిని సరిచేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను అనుమతించేది లేదు

- ఈ నెల 6నుంచి పాఠశాలల్లోకి రానివ్వం
- మూడేళ్లుగా స్కాలర్‌షిప్స్ రావడం లేదు
- బీఏసీ పాఠశాలల యాజమాన్యాల సలహాదారుడు నాగార్జున రెడ్డి

నెక్కొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022 నుంచి 2025 వరకు బెస్ట్ అవైలెబుల్ స్కీం (బీఏసీ) విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నందున ఈ నెల 6 నుంచి విద్యార్థులను పాఠశాలల్లోకి అనుమతించేది లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఏసీ పాఠశాలల మేనేజ్‌మెంట్ ప్రధాన సలహాదారుడు, టీఆర్ఎస్ఎమ్ఏ అధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన నెక్కొండలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు ప్రవేశపెట్టిన బీసీఏ స్కీంకు ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు. యాజమాన్యాలు అప్పులు చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 32 స్కూళ్ల ద్వార ప్రతీ సంవత్సరం 3,500 మంది విద్యార్థులకు విద్యనందిస్తున్నాయని అన్నారు.

స్కాలర్ షిప్స్ కోసం అనేక మార్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి లక్ష్మణ్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ కమిషనర్లకు, జిల్లా కలెక్టర్లు, డీటీడబ్ల్యూవో, డీఎస్‌డీవోలకు వినతి పత్రాలను అందించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. దసరా సెలవుల తరువాత బీఏసీ విద్యార్థులకు పాఠశాలలకు అనుమతించబోమనే విషయాన్ని కూడా తెలిపినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులను పాఠశాలకు తీసుకురావద్దని దసరా సెలవుల ముందే విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖల ద్వారా తెలిపామన్నారు. విద్యార్థుల విద్యకు ఆటంకం కలిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు స్పష్టం చేశారు.

4వ బెటాలియన్‌లో 'కాకా' జయంతి


నివాళి అర్పిస్తున్న పోలీస్ అధికారులు,సిబ్బంది

మామునూరు,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మామునూరు 4వ బెటాలియన్ మైదానంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమాండర్ పి.శ్రీనివాసరావు పాల్గొని కాకా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకా మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఏడు సార్లు పార్లమెంటు సభ్యుడిగా, మూడు సార్లు కేంద్ర మంత్రిగా పని చేశారని కొనియాడారు. 80 వేల మంది నిరాశ్రయులకు ఇళ్ళు పొందడానికి సహాయం చేసిన మహానేత అని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు విజయ్, రవి, రాజ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



జనగామలో నిరాహార దీక్ష చేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు (ఫైల్)

వేతనం మూరెడు.. పని బారెడు..

- చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు
- క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూపులు
- సమ్మె చేసినా పరిష్కారం కాని సమస్యలు
- పని భారంతో సతమతం

రఘునాథపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఉద్యోగ భద్రత లేక, చాలీ చాలని వేతనంతో అవస్థలు పడుతున్నారు. 2012లో 'సమగ్రశిక్ష అభియాన్' ద్వారా సీఆర్పీల వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసినా వారికి అందే వేతనం అంతంతే. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సకాలంలో అందేలా చూడడం, ఎన్నికల విధులతో పాటు అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అయినా తమను క్రమబద్ధీకరించడంతో ప్రభుత్వం ఆలసత్వం వహిస్తుందని ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం సమ్మె చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొర వేతనం..

పాలకులు మారినా తమ జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదని సమగ్రశిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2012లో రూ.5500 ప్రారంభమైన తమ వేతనం ప్రస్తుతం రూ.19,500 చేరింది. 13 సంవత్సరాల నుంచి విద్యాశాఖలో వెట్టి చాకిరీ చేస్తున్నామని, ప్రస్తుతం ఇస్తున్న వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, రోజురోజుకు పని భారం పెరుగుతుండడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రూ.28వేల కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

జనగామ జిల్లాలో 452 మంది ఉద్యోగులు

జిల్లాలోని 12 మండలాల్లో 452 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన సమగ్రశిక్ష ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఎమ్మార్సీలో సీఆర్పీలు 43 మంది, ఎంఎస్ కో-ఆర్డినేటర్లు 10, కంప్యూటర్ ఆపరేటర్లుగా 12, ఐఆర్పీలుగా 20, పీటీఐలు 54 మంది, మెసెంజర్లుగా ఏడుగురు, ఏఐఏలు 10 మంది ఉన్నారు. వీరితో పాటు డీపీవో కార్యాలయం, కేజీబీవీల్లో 296 మంది పని చేస్తున్నారు. 2012లో బీఆర్ఎస్ ప్రభుత్వం కలెక్టర్ ఛైర్మన్‌గా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటిస్తూ బీఈడీ పూర్తి చేసి, టెట్ పాసైన అభ్యర్థులను సీఆర్పీలుగా నియమించింది. అప్పటి నుంచి అనేక సర్వేలు సహా పాఠశాలలో ఫోర్త్ క్లాస్ సిబ్బంది చేసే సేవలకు సైతం వినియోగించుకుంటున్నారు.

పని భారంతో సతమతం..

జిల్లాలో 6-14 సంవత్సరాల పిల్లల వివరాల సేకరణ, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల డేటాబేస్ వంటి సమాచారం, మధ్యాహ్న భోజన అమలు, పర్యవేక్షణ, ఉన్నతాధికారులకు పాఠశాలల పనితీరుపై నివేదికలు అందించడం సీఆర్పీల విధులు. వీటితో పాటు అదనంగా బియ్యం, పుస్తకాల పంపిణీ, విద్యార్థుల ఆధార్ కార్డులు నమోదు చేయాలి. పాఠశాలలో నిర్వహించే ప్రతి పనిలో భాగస్వాములు కావడమే కాకుండా ఉపాధ్యాయులు సెలవులపై వెళ్తే పాఠాలు సైతం బోధించాల్సి వస్తుంది. పని భారంతో సతమతమవుతున్నారు.

సీఆర్పీల డిమాండ్లు..

- వేతనం రూ.28 వేలకు పెంచాలి.
- ఉద్యోగ భద్రత కల్పించి మహిళా సీఆర్పీలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- పాఠశాలలను సందర్శించినప్పుడు టీఏ, డీఏలతో పాటు సెల్‌ఫోన్ ఇంటర్నెట్ చార్జీలను చెల్లించాలి.
- స్టేషనరీ, జిరాక్స్, రవాణా ఖర్చుల కింద ప్రతీ నెల రూ.2 వేల అలవెన్సులు మంజూరు చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేయాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
- 61 ఏళ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందించాలి.
- మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలి.

సీఎం రేవంత్ హామీని నిలబెట్టుకోవాలి

గోలి రవీందర్ రెడ్డి, ఎంఎస్ కోఆర్డినేటర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద మా దీక్ష వద్దకు వచ్చి రేవంత్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో మా సమస్యలను పరిష్కరిస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం తన హామీని నిలబెట్టుకోవాలి.



అర్హులను క్రమబద్ధీకరించాలి

ఎడ్ల శ్రీనివాస్, సీఆర్పీ, ఖిలాషాపూర్, రఘునాథపల్లి

విద్యా వనరుల కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులైన సీఆర్పీలు, ఎంఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను క్రమబద్ధీకరించాలి. ప్రతీ ఉద్యోగికి రూ.10 లక్షల జీవితబీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలి. నెలకు కనీసం రూ.28 వేల వేతనం ఇవ్వాలి.

విద్యార్థులకు అండగా ఉండాలి

- భూపాలపల్లి ఆర్డీవో, అదనపు కలెక్టర్ ఎన్.రవి
- వెలమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



టీచర్‌ను సన్మానిస్తున్న భూపాలపల్లి అదనపు కలెక్టర్ ఎన్.రవి, వెలమ సంక్షేమ సంఘం నాయకులు

న్యూశాయంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వెలమ కుల విద్యార్థులకు విద్య, ఉద్యోగాల విషయంలో వెలమ సంక్షేమ సంఘం అండగా ఉండాలని భూపాలపల్లి అదనపు కలెక్టర్ ఎన్.రవి కోరారు. వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వెలమ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం, వెలమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భూపాలపల్లి అదనపు కలెక్టర్ ఎన్.రవి, విశిష్ట అతిథిగా ములుగు అదనపు కలెక్టర్ మట్టపెల్లి సంపత్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్.రవి మాట్లాడుతూ.. యేటా వెలమ కులంలోని వెనుకబడిన వర్గాల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అభినందనీయమన్నారు. వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. యేటా వెలమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామని, అక్టోబర్ 5 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వెలమ సంఘంలోని టీచర్లను సన్మానించామన్నారు. అనంతరం వెలమ టీచర్లకు శాలువాలు కప్పి షీల్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే 150 మంది వెలమ విద్యార్థులకు రూ.8.50లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్‌రావును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పిన్నింటి బాలచందర్‌రావు, తక్కళ్లపెల్లి శ్యాంసుందర్‌రావు, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి పల్లెపాటి విద్యాసాగర్‌రావు, కోశాధికారి సిద్ధూరి స్వామిరావు, ఈసీ మెంబర్లు చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్‌రావు, తక్కళ్లపెల్లి అమృతరావు, గండ్ర గోపాల్‌రావు, లింగంపెల్లి పాపారావు, పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, జలగం రంజిత్‌కుమార్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావుతోపాటు పెద్ద సంఖ్యలో ఉమ్మడి జిల్లాకు చెందిన వెలమ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ బృంద గీతాల పోటీలు

న్యూశాయంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన వరంగల్ దేశాయిపేట రోడ్‌లోని నాగార్జున ప్రైమ్ స్కూల్‌లో జాతీయ బృంద గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు భారత్ వికాస్ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ డి.సుధీర్‌కుమార్, కె.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృంద గీతాల పోటీలలో పాల్గొనే వారు నాగార్జున ప్రైమ్ స్కూల్‌కు వచ్చి పేర్లు రాయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866660374నెంబర్‌లో సంప్రదించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

ఆగేనా సాగేనా?!

3వ పేజీ తరువాయి

ఉంటామనే సంకేతాలు ఇస్తూనే.. ఖర్చుల విషయంలో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. పోటీదారులు దసరా దావత్‌లకు దూరంగానే ఉంటూ రాజకీయం నడిపినట్లుగా అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

రిజర్వేషన్ల ఝలక్

పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో చాలామంది ద్వితీయ శ్రేణి నేతలు తమ అదృష్టాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో పరీక్షించుకునేందుకు ఆరాటపడుతున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్లు ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లాయి. ప్రధానంగా జనరల్, బీసీ కోటాలో పాగా వేయాలని ఆశించిన నేతలకు జడ్పీ ఛైర్మన్ పదవులు మింగుడు పడటం లేదు. ములుగు జిల్లాకు సంబంధించిన ఓ కీలక నేత జడ్పీ ఛైర్మన్ పదవిపై కన్నేశారు. అయితే అనూహ్యంగా ఎస్టీ మహిళకు ములుగు జడ్పీ పీఠం రిజర్వుడు కావటంతో సదరు నేతలకు ఆశాభంగం కలిగింది. హనుమకొండ జడ్పీ పీఠంపై కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో కీలక నేతలు కన్నేశారు. అయితే ఎస్సీ మహిళకు హనుమకొండ జడ్పీ పీఠం రిజర్వుడు కావటంతో సదరు నేతలు నిరాశకు గురయ్యారు. వరంగల్, జనగామ జడ్పీ ఛైర్మన్‌లు కూడా రిజర్వేషన్ కోటాలో పోవటంతో ఎన్నో ఏళ్లుగా ఆశతో ఉన్న నేతలకు రిజర్వేషన్లు ఝలక్ ఇచ్చాయి. ఇలా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు కూడా రిజర్వేషన్లు కలిసి రాకపోవటంతో అనేక మంది ఆశావహులు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ 42శాతం రిజర్వేషన్లపై కొందరు కోర్టును ఆశ్రయించటంతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏదైనా జరిగితే తమకు అనుకూలంగా రిజర్వేషన్లు మారుతాయనే ఆశతో కొందరు నేతలు ఉన్నారు. మరోవైపు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన క్రమంలో కేవలం భూపాలపల్లి జడ్పీ ఛైర్మనే బీసీలకు కేటాయించారు. ఆరు జడ్పీల్లో కేవలం ఒక్క స్థానమే కేటాయించారని బీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు తీర్పుపై ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. వీటికి 42 శాతం బీసీ రిజర్వేషన్లు కలిపితే 69 శాతం రిజర్వేషన్లు అవుతాయి. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టులో తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై విచారణ జరగనుంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన రిజర్వేషన్లకు కోర్టు బ్రేకులు వేస్తే ఎలా అనే చర్చ నడుస్తోంది. తీర్పును మరో తేదీకి వాయిదా వేస్తే.. తుది తీర్పు వచ్చే దాకా ప్రభుత్వం ఎదురుచూడక తప్పదని మరికొందరు పేర్కొంటున్నారు. ఒక వేళ కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే ఎన్నికలకు వెళ్తే.. ఆ ఎన్నికలు సైతం కోర్టు రద్దుచేయొచ్చని, మహారాష్ట్రలో ఇలాంటి సంఘటనే జరిగిందని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుపై రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. సాంకేతికంగా సాధ్యం కాకుంటే ఇటీవల ఖరారైన రిజర్వేషన్లు మారడం తప్పనిసరిగా కనిపిస్తోందనే ప్రచారం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే బీసీలకు మళ్లీ పాత రిజర్వేషన్లే దిక్కయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేయవచ్చననే ప్రచారం కూడా జరుగుతోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టు తీర్పు ప్రభావం ఉండటంతో అందరి దృష్టి సోమవారం సుప్రీంకోర్టు, 8వ తేదీన హైకోర్టు ఇచ్చే తీర్పులపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

దొంతి కాంతమ్మకు ఘన నివాళి

- ఫోన్‌లో ఎమ్మెల్యే మాధవరెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ
- శివముక్తి ధామ్‌లో అంత్యక్రియలు
- అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, ప్రజలు



మాధవరెడ్డి నివాసంలో వేం నరేందర్‌రెడ్డి, కడియం కావ్య, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, నాగరాజు తదితరులు



కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ(88)కు వివిధ వర్గాలకు చెందిన వారు ఘన నివాళులర్పించారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంతమ్మ శనివారం మృతి చెందిన సంగతి విదితమే. ఆదివారం హనుమకొండ పద్మాక్షి గుట్టు సమీపంలోని శివముక్తి ధామ్‌లో ఆమె అంత్యక్రియలు జరిగాయి.

ముఖ్యమంత్రి రేవంత్ పరామర్శ

తల్లిని కోల్పోయిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం ఫోన్‌లో పరామర్శించారు. మాధవరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. అలాగే హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ఎమ్మెల్యే మాధవరెడ్డి నివాసంలో కాంతమ్మ భౌతికకాయాన్ని కాంగ్రెస్‌తో పాటు వివిధ రాజకీయ పక్షాలు, ప్రముఖులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపీలు కడియం కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఎల్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, మురళీనాయక్, ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, నమిండ్ల శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, వరద రాజేశ్వరరావు, దొమ్మాటి సాంబయ్య, మార్క విజయ్, పెరుమాండ్ల రామక్రిష్ణ, అనిల్ కుమార్, కిసాన్ సెల్ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు పింగిళి వెంకట్రాంరెడ్డి, కొంపెల్లి దేవేందర్‌రావు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, కట్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డితో పాటు మాజీ డిప్యూటీ సీఎం టి.రాజయ్య, బీజేపీ నాయకులు డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డితో పాటు వివిధ రాజకీయ ఇతర వర్గాల వారు నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. నర్సంపేట నుంచి జనం ఉదయమే మాధవరెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. సాయంత్రం 3 గంటలకు మాధవరెడ్డి నివాసం నుంచి శివముక్తిధామ్ వరకు అంతిమయాత్ర సాగింది. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 7న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లోని కబడ్డీ కోర్టులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీల్లో 1జనవరి 2007 సంవత్సరం తరువాత జన్మించిన క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కొమ్ములవంచలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీధర్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమోతో పాటు తమ కళాశాలకు చెందిన బోనఫైడ్ సర్టిఫికెట్ వెంట తీసుకొని హనుమకొండ జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9848876765 నెంబర్‌లో సంప్రదించాలని శ్రీధర్ సూచించారు.

రాహుల్‌గాంధీని పీఎం చేయడమే లక్ష్యం

రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి

మడికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణను ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఓట్ చోరీకి పాల్పడి బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. బీజేపీ ఏ విధంగా ఓట్ చోరీ చేసిందో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామం నుంచి 100కు పైగా సంతకాలను సేకరించాలని కోరారు.



సంతకాల సేకరణ ప్రతులను చూపుతున్న రాఘవరెడ్డి

కళాక్షేత్రంలోని మినీ హాల్స్‌లో వసతులు కల్పించాలి

ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్

వడ్డెపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రం ప్రధాన హాల్ ఆడిటోరియంలో అందరికి అందుబాటులో లేనందున మినీ హాల్స్‌లో కనీస వసతులు కల్పించాలని ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్, ప్రముఖ సమన్వయ కర్త వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్-1లోని ప్రగతి మిత్ర కమ్యూనిటీ హాల్‌లో కళా సాహిత్య స్వచ్ఛంద సంస్థల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాళోజీ కళా క్షేత్రంలోని మినీ హాల్స్‌లో ప్రేక్షకులు కూర్చొనే విధంగా కుర్చీలు, ఫ్యాన్స్ చిన్న స్టేజీ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. అధికారులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కళా సాహిత్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పొట్లపల్లి శ్రీనివాసరావు, ఎండి.రాజ్‌మహ్మద్, సిరాజొద్దీన్, ఓడపల్లి చక్రపాణి, నల్లమారి రమేష్, బిల్ల మహేందర్, చిరంజీవి, పి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంపశయ్య నవీన్, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు

అన్నారంలో అభాగ్యులకు దిక్కెవరు?

- దర్గాల వద్ద దయనీయంగా అనాథల పరిస్థితి
- రోజురోజుకూ పెరుగుతున్న అనామకుల సంఖ్య
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, పోలీసులు



దర్గా ఎదుట భిక్షాటన చేస్తున్న అనాథలు

పర్వతగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా అభాగ్యులకు కేరాఫ్‌గా మారింది. దిక్కులేని వారికి దర్గా పరిసర ప్రాంతాలే ఆశ్రయంగా నిలుస్తున్నాయి. భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. మరణానంతరం వారి దేహాలు గుర్తు తెలియని వ్యక్తులుగా ఎంజీఎం మార్చురీకి లేక అనాథ శవాలుగా మున్సిపాలిటీ వారు దహనం చేస్తున్నరు. ఈ అభాగ్యులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం, పోలీసుల నిఘా వైఫల్యంతో రోజురోజుకు వారి సంఖ్య పెరుగుతుంది.

పనిచేయని సీసీ కెమెరాలు..

అన్నారం షరీఫ్‌లోని యాకూబ్ షావలి బాబా దర్గా ప్రధానమైనది. గౌస్‌పాషా, గుంషావలి, బొలేషావలి, మహబూబీయమ్మ మరిన్ని దర్గాలు చుట్టూ పక్కల ఉన్నాయి. ఇక్కడికి భక్తులు తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ వస్తారు. ప్రతిరోజూ భక్తులు వస్తుండగా, ప్రతి శుక్రవారం దర్గాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏటా దర్గా ఉత్సవాలు సైతం మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఇలా భక్తుల సందడి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మూలకు పడ్డాయి. అయా దర్గాల వద్ద నిఘా లేకపోవడంతో అపరిచితులు ఎవరు వస్తున్నారో తెలియడం లేదు. అనారోగ్యంతో ఉన్న వారిని, వృద్ధాప్యంలోకి చేరిన వారిని బాగోగులు చూడలేక కొంత మంది ఇక్కడ వదిలి వెళ్తున్నారు. ఇక మానసిక దివ్యాంగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంటుంది. ఇలాంటి వారి పట్ల సైతం దర్గా నిర్వాహకులు, అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ఇక్కడ ఉన్న వారి పూర్తి వివరాలు ఎవరికి తెలియవు. ఎవరైనా మృతి చెందితే పోలీసులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

పట్టించుకోని వక్ఫ్ బోర్డు బాధ్యులు

ఇక్కడ సంచరించే వారిపై పోలీసులు సైతం కనీసం నిఘా పెట్టకపోవడంతో ఇటువంటి వ్యక్తులు ఎండకు ఎండి, వానకు తడుస్తూ విగత జీవుల్లా బతుకుతున్నారు. దర్గాకు చెందిన నిర్వాహకులు సైతం అనారోగ్యంతో వస్తున్న వారి వివరాలు నమోదు చేయడం లేదు. రెండు నెలల క్రితం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను ఇక్కడ వదిలేసి వెళ్లిపోయారు. దీంతో అనారోగ్యంతో మహిళ మృతి చెందగా పోలీసులు ఎంజీఎం మార్చురీకి ఆమె మృతదేహాన్ని తరలించారు. దర్గా వక్ఫ్ బోర్డు బాధ్యుల నిర్లక్ష్యంతో ఇటువంటి పరిస్థితులు వచ్చాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి నిర్లక్ష్యంపై కలెక్టర్, వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదులు చేశారు. ఇప్పటికైనా పోలీసులు, దర్గా నిర్వాహకులు సంయుక్తంగా దర్గా పరిసర ప్రాంతాల్లో తిరిగే వారి వివరాలు సేకరించి, వారికి ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



మూలకుపడ్డ సీసీ కెమెరాలు, డీసీఆర్

ఓ వృద్ధుడి దీనగాథ

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు తూర్పాటి వెంకన్న(70) దర్గా వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. తనకు కుటుంబం లేకపోవడంతో జంగాల సామాజిక వర్గానికి చెందిన తనకు తన గ్రామంలో కొంత మంది ఇన్ని రోజులు ఆహారం, ఇతర సౌకర్యాలు అందించారట. కానీ, వారు బతుకు దెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో తన జీవనం ప్రశ్నార్థకంగా మారిందని చెప్పాడు. దీంతో అన్నారం దర్గాలో ఉంటూ భిక్షాటన చేస్తున్నట్లు తెలిపాడు. ఇలా ఇక్కడ భిక్షాటన చేసేవారిది ఒక్కొక్కరి ఒక్కో కన్నీటి కథ. మానవత్వం కలిగిన వారు అనాథలను చేరదీయాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం హనుమకొండలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నయీంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లష్కర్‌సింగారం, నయీంనగర్, రాజాజీనగర్ ఏరియాలో సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు, కేయూసీ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూర్ జెండా, డబ్బాలు, కేయూ సెకండ్ గేట్ ఏరియా, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీ, పాలజెండా ఏరియా, ఏకశిల కళాశాల, హనుమాన్‌నగర్, కొత్తూర్ మార్కెట్, యాదవనగర్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, గోపాలపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండా మురళి గెస్ట్‌హౌస్ ఏరియా, జవహర్ కాలనీ, ఉషోదయ కాలనీ, ఎస్‌వీఎస్ హోమ్స్, విష్ణుపురి కాలనీ, ద్వారక సాయి కాలనీ, నవయుగ కాలనీ, జవహర్ కాలనీ సర్కిల్ ఏరియాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌లో లక్కీడ్రా

విజేతలను ప్రకటించిన ఎంపీ కడియం కావ్య



షాపింగ్ మాల్‌లో లక్కీడ్రా తీస్తున్న ఎంపీ కడియం కావ్య

వరంగల్ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ చౌరస్తాలోని వైభవలక్ష్మీ షాపింగ్ మాల్‌లో ఆదివారం రాత్రి లక్కీ డ్రా తీశారు. ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరై ఇద్దరు విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వినియోగదారుల విశ్వాసమే షాపింగ్‌మాల్ విజయానికి మూలకారణమని అన్నారు. అనంతరం విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించి శుభాకాంక్షలు తెలిపారు. డ్రాలో మొదటి బహుమతిగా ఒక కిలో వెండిని రెడ్డిపాలెంనకు చెందిన జి.ప్రియాంక (కూపన్ నంబర్ జె250) గెలుచుకున్నారు. రెండో బహుమతిగా టీవీఎస్ జూపిటర్ బైక్‌ను కాశిబుగ్గకు చెందిన జి.రోషిణి (కూపన్ నెం.బి373) గెలుచుకున్నారు. కార్యక్రమంలో వైభవలక్ష్మి షాపింగ్ మాల్ డైరెక్టర్లు, ప్రదీప్, హరీష్, రిషిత, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు



వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

వడ్డెపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 60వ డివిజన్ వడ్డెపల్లి టీచర్స్ కాలనీ ఫేజ్-1, ఎస్‌బీహెచ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి 26వ బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిర్ర రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు బీసత్యనారాయణ, పింగిళి స్వరూపరాణి, ప్రధాన కార్యదర్శి డి.జితేందర్‌రెడ్డి, కోశాధికారి బి.రవీందర్ పర్యవేక్షణలో రుత్వికులు కలకోట సీతారామాచార్యులు, కలకోట వెంకటరమణ వేంకటేశ్వర స్వామికి రక్షాబంధనం, అంకురార్పణ, ఆరగింపు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద గోష్ఠి గావించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.

టీచర్ సత్యప్రకాశ్ రావుకు గురుబ్రహ్మ అవార్డు



సత్యప్రకాశ్ రావుకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

రాంనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జీఆర్‌ఎస్ (గురూస్, స్టూడెంట్స్, పేరెంట్స్) స్వచ్ఛంద సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో ఏటా అందించే గురుబ్రహ్మ అవార్డును నయీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరపాటి సత్యప్రకాశ్‌కు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు గంగారపు మల్లేశం తెలిపారు. సత్యప్రకాశ్ సామాజిక సేవ చేయడంతో పాటు విద్యార్థులకు బోధన చేయడంలో అంకితభావంతో పనిచేస్తాడని, ఇప్పటికే 26 సార్లు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వ్యక్తులు కాపాడాడన్నారు.

దత్తక్షేత్రంలో తైలాభిషేకం



దత్తాత్రేయ స్వామికి హారతిస్తున్న అర్చకుడు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో శ్రీవరద దత్తాత్రేయ స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రాపాక గోపీకృష్ణ శర్మ నేతృత్వంలో జరిగిన పూజ కార్యక్రమానికి దాదాపు500 మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం ఉత్సవమూర్తికి నువ్వుల నూనెతో అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, ప్రొఫెసర్ కృష్ణ ప్రసాద్, జూలూరి శ్రీనివాసరావు, చకిలం ఏకాంబరం, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, వడిచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- నేలవాలిన వరి పైరు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



ఎల్కతుర్తి మండలంలోని సూరారంలో నేలవాలిన వరి పైరు

ఎల్కతుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తి మండల పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసిం ది. దీంతో దండేపల్లి, సూరారం, వీరనారాయణపూర్, ఎల్కతుర్తి తదితర గ్రామాల్లో భారీగా వరి పంటలు నేలవాలి తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంటసేపు భారీ వర్షం పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ అధికారులు పంటల నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

గీసుగొండ : గత కొద్ది రోజులకు పడుతున్న వర్షాలకు పంటల తీవ్రంగా దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు పంటల వర్షపు నీరు నిలిచి జాలుపడుతున్నలు రైతులు వాపోతున్నారు. గత 10 రోజులుగా వర్షాలు నిరంతరంగా పడటంతో పత్తి, కూరగాయపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు అంటున్నారు. పత్తిపంటలో వచ్చిన గూడ అంత రాలిపోయి, పడిన కాయలు మురిగిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వరంగల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ రూట్‌మార్చ్

నగరంలో ఆర్‌ఎస్‌ఎస్ రూట్ మార్చ్

మట్టెవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం పథసంచలన్ వైభవంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ వరంగల్ మహానగర్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంట ఆర్‌ఎస్‌ఎస్ ఘనవేశ యూనిఫాం ధరించి రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రత్యేక వాహనం మీద భరతమాత చిత్రపటం, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ గురూజీల చిత్రపటాలను ఏర్పాటు చేసి రూట్‌మార్చ్ నిర్వహించారు. వరంగల్ కాశిబుగ్గ, అండర్ రైల్వేగేట్, ఖిలావరంగల్, ఏవీ కళాశాల మైదానం, వరంగల్ కాశిబుగ్గ, ఓసిటీ కాలనీ, ఖిలావరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో రూట్ మార్చ్ ప్రారంభించారు. వరంగల్ ఎస్‌వీఎన్ రోడ్, బట్టలబజార్, రామన్నపేట, దుర్గేశ్వరాలయం వీధి, జేపీఎన్ రోడ్, రుద్రమాంబ వీధి, నర్సంపేట రోడ్, ఫోర్ట్ రోడ్, కరీమాబాద్, శివనగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ వరంగల్ మహానగర్ సంఘచాలక్ డాక్టర్ బందెల మోహన్‌రావు, తౌటం తిరుమల్, వడిచర్ల లక్ష్మణ్, సహకార్యవాహ వెలిసోజు వీరలింగం, వెలగ రాంమోహన్, నగర కార్యవాహ శ్రీరామ్ శివాజీ, వందలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు గణేష్‌దారులై (సంఘ యూనిఫాం ధరించి) రూట్‌మార్చ్‌లో పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్

శతాబ్ది వర్ష పథ సంచాలన్

హసన్‌పర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్వయం సేవకులు హసన్‌పర్తిలో పథ సంచాలన్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ మహానగర సంపర్క ప్రముఖ్ డాక్టర్ మంద శ్రీనివాస్ ప్రేరణ సందేశమిచ్చారు.

1925లో విజయదశమి రోజున డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హేడ్గేవర్ జీ కేవలం ఐదుగురితో శాఖ ప్రారంభించారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 70వేల గ్రామాలకు సంఘ్ విస్తృతంగా చేరుకొని అనేక కార్యక్రమాల పేరుతో సేవలందిస్తున్నారని తెలిపారు. సంఘ్ స్వయం సేవకుల వ్యక్తి నిర్మాణం చేస్తూ దేశం కోసం ధర్మం, సమాజ హితం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచ దేశాలలో ఉన్నత స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికిపైగా కరసేవకులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వర్ష పథ సంచాలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

అమ్మవారికి ఇండోర్ జడ్జి పూజలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో చారిత్రక భద్రకాళి అమ్మవారిని మధ్యప్రదేశ్ ఇండోర్ జిల్లా జడ్జి ప్రదీప్‌స్వామి దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న జడ్జి దంపతులు వల్లభ గణపతిని దర్శించుకొని అనంతరం భద్రకాళి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. పండితులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదం, ఆశీర్వచనం, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుణోదయ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

వడ్డెపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మండలం గోపాల్‌పూర్‌లోని అరుణోదయ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లూరి మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ రతన్‌సింగ్, కోశాధికారిగా ఉప్పల తిరుపతిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ ముంజం శ్రీనివాస్, ఆచార్య ప్రద్యుమ్న వ్యవహరించారు. ఎన్నికల కార్యక్రమంలో బొట్ల ఆంజనేయులు, ఇనుగాల సుదర్శన్, తిరుపతిరెడ్డి, పోరిక రాజారాం నాయక్, పంజాల ప్రతాప్ తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

ములుగు కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో అపశ్రుతి

భారీ ఇనుప రాడ్ మీద పడి కూలీ మృతి



సిరిపెల్లి రాజయ్య (ఫైల్)

ములుగు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలో సాగుతున్న కలెక్టరేట్ పనుల్లో ఆదివారం అపశ్రుతి చోటు చేసుకుంది. భారీ ఇనుప రాడ్ మీదపడటంతో దినసరి కూలీ మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన సిరిపెల్లి రాజయ్య (50) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ములుగులో రెండస్తుల కలెక్టరేట్ సముదాయం నిర్మాణమవుతుండగా అక్కడ కాంట్రాక్టర్ వద్ద పనికి కుదిరాడు. తొలిరోజే అతడు ప్రమాదానికి గురయ్యాడు. పైఅంతస్తులో నిర్మాణ పనుల్లో భాగంగా ఇద్దరు తోటి కూలీలతో కలిసి రాజయ్య ఓ భారీ ఇనుప రాడ్‌ను మోశాడు.

సుమారు 12 అడుగులు ఉన్న ఆ రాడ్‌ను ముందు భాగంలో ఇద్దరు, చివరి భాగంలో రాజయ్య ఎత్తుకున్నారు. ఈ క్రమంలో భవనంపై వర్షపు నీరు ఉండడంతో రాజయ్య కాలు జారి అక్కడికక్కడే పడ్డాడు. రాజయ్య మోస్తున్న రాడ్ మీద పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో సహచర కూలీలు వెంటనే జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాజయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రాజయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.



ప్రవీణ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు

గౌడ సంఘం కార్యదర్శి ఎన్నిక

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గౌడ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా కొయ్యడ ప్రవీణ్‌కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావుగౌడ్, జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు గండి లక్ష్మయ్య గౌడ్ ప్రవీణ్‌కుమార్ గౌడ్‌కు ఆదివారం నియామక పత్రంఅందజేశారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత

శాయంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరేణిగూడెంలో 20 లీటర్ల గుడుంబాను స్వాధీన పర్చుకు న్నట్లు ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ తెలిపారు. ఆదివారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో బానోతు శోభన్ తనిఖీ చేసి గుడుంబాను స్వాధీనపర్చుకున్నారు. శోభన్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వెల్లడించారు.

తాత్కాలికంగా ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

ధర్మసాగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఇంటింటికి బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమం అనంతరం నర్సింగరావుపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ప్రకటించి అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్ట్ కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదని, రూపాయి ఖర్చు చేయలేదని, పెండింగ్ బిల్లులు చెల్లించలేని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరంలో లిఫ్టు పైపులైన్ కోసం రూ.104 కోట్లు మంజూరి చేయగా కేటీఆర్ చేతుల మీదుగా పనులను ప్రారంభించిన ట్లు తెలిపారు. ఆ పనులను ఇప్పటి వరకు చేపట్ట కపోవడం దురదృష్టకరమన్నారు. లిఫ్టు ఇరిగేషన్ పనులను వెంటనే పూర్తిచేసి పొలాలకు సాగునీరు అందించాలని రాజయ్య డిమాండ్‌చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి బినామీలు నాసిరకంగా నియోజకవర్గంలో పనులు చేపడుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల శ్రమతో మీరు ఎన్నికల్లో గెలిచారని, నైతిక విలువ ఉంటే ఎమ్మెల్యే పదవికి శ్రీహ రి రాజీనామా చేయాలని రాజయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో కమలేష్, సోమిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నాం

» పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు పథకాలు అందిస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంను భారతదేశానికే ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా నిలుస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో స్వలాభం కోసం పని చేశారని విమర్శలు గుప్పించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా పరకాల నియోజకవర్గంను ఆదర్శంగా అభివృద్ధి చేసి చూపిస్తానని రేవూరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బీరం సునందసుధాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మాజీ జడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజుగౌడ్, సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ అబంటి రాజస్వామి, రేవూరి జయపాల్‌రెడ్డి, ముద్దం కృష్ణంరాజు, కౌడగాని ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భీమదేవరపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కొప్పూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రవీణ్ చెరువు, వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడని గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకొని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేకలు, గొర్రెల అపహరణ

వేలేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తన మేకలు, గొర్రెలను దొంగిలించారని బాధితుడు బొజ్జ రాజుయాదవ్ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశాడు. గ్రామానికి చెందిన రాజు యాదవ్ రోజు లాగానే గొర్రెలు, మేకలను మేపి వ్యవసాయ బావివద్ద కొట్టంలో ఉంచాడు. ఆదివారం ఉదయం బావి వద్దకు వెళ్లేసరికి కొన్ని గొర్రెలు, మేకలు కనిపించక పోవడం తో ఆందోళనకు గురయ్యాడు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మందలో చొరబడి 6 మేకలు, 6 గొర్రెపోతులను ఎత్తుకెళ్లినట్టు చెప్పాడు. వాటి విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని, కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

వారాల కుల సంఘం జోనల్ కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన వారాల కుల సంఘం వరంగల్ జోనల్ కార్యనిర్వాహక కమిటీ

హసన్‌పర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వారాల కుల సంఘం వరంగల్ జోనల్ కార్యనిర్వాహక కమిటీ ఎన్నిక ఆదివారం హసన్‌పర్తిలోని వారాల కుల సంఘం భవనంలో ఏకగ్రీవంగా జరిగింది. హసన్‌పర్తి వారాల కుల సంఘం అధ్యక్షుడు పావుశెట్టి రాజు అధ్యక్షతన జరిగిన ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులుగా పావిశెట్టి రమణయ్య, కందుకూరి లక్ష్మీనారాయణ, పావుశెట్టి నర్సింహరాములు, సహాయకులుగా పావుశెట్టి వెంకటేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జోనల్ కమిటీ నూతన అధ్యక్షుడిగా గుండమీది రవీందర్, కార్యదర్శిగా కందుకూరి సంజీవ్, కోశాధికారిగా గంట నాగేశ్వర్, ఉపాధ్యక్షులుగా అమిరిశెట్టి సుధాకర్, మొలుగూరి రాజమౌళి, సహాయ కార్యదర్శులుగా గంట సత్యనారాయణ, బొమ్మిశెట్టి యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పావుశెట్టి నర్సింహరాములుతో పాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వారాల కుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పావుశెట్టి వైకుంఠం, మహిళా ప్రతినిధులు పావుశెట్టి క్రిష్ణవేణి, గంట కళావతి, కుల పెద్దలు కందుకూరి సుధాకర్, కందుకూరి చంద్రమోహన్, పావుశెట్టి శ్రీధర్, పావుశెట్టి సాంబయ్య, ఆయా గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు, వారాల కులస్థులు పాల్గొన్నారు.



హోమ్ స్టే... ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట. కానీ ఆరేళ్ల క్రితమే విశాఖ నగరంలో ఈ విధానానికి శ్రీకారం చుట్టారు **రేణుగుప్తా.** పర్యాటకులకు వసతి కొరత తీర్చడంతో పాటు సొంతింటి అనుభూతిని అందించడమే దీని ఉద్దేశం అంటున్న ఆమె... ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి అభినందనలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో 'నవ్య'తో అనేక విషయాలను ఆమె ప్రత్యేకంగా పంచుకున్నారు.

అచ్చంగా ఇంట్లో ఉన్నట్టే...

"మాది ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్. ఆ రాష్ట్రంలో, ఢిల్లీలో నా చదువంతా సాగింది. కొన్నాళ్లపాటు ఢిల్లీలో కొన్ని ఎన్జీవోలలో, ఇతర సంస్థల్లో పనిచేశాను. 1985లో విశాఖకు చెందిన డాక్టర్ జి.వి.రమణతో వివాహం జరిగింది. ఆయన ఎకనామిక్ టైమ్స్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. మేము ఎనిమిదేళ్లపాటు ఢిల్లీలో ఉద్యోగాలు చేశాం. నా అత్తమామలు అప్పటికి చాలా ఏళ్ల కిందటే విశాఖకు వచ్చి స్థిరపడ్డారు. అప్పుడప్పుడూ విశాఖకు వచ్చి వెళ్లేవాళ్లం. వారికి వయసు పైబడడంతో అనారోగ్య సమస్యలు మొదలయ్యాయి. వారిని దగ్గరుండి చూసుకోవాలన్న ఉద్దేశంతో 1993లో విశాఖ వచ్చేశాం. ఇక్కడ కొత్త ఉపాధి చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో 'ఆర్డీ హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థను ప్రారంభించాం. నేను ప్రస్తుతం ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నా.

ఆలోచన పుట్టింది అలా..

మా ఇల్లు చాలా పెద్దది. అది 60 ఏళ్లకు పూర్వానిది. నా అత్తమామలు చనిపోవడం, మా అమ్మాయికి వివాహమై బెంగళూరు వెళ్లిపోవడంతో.. నేను నా భర్త మిగిలాం. దాంతో కాస్త ఒంటరితనంగా అనిపించేది. అందేకాదు. ఇల్లు కూడా శుభ్రంగా ఉన్నట్టు అనిపించేది కాదు. నిర్వహణ ఖర్చు కూడా ఎక్కువగా ఉండేది. ఈ సమస్యల పరిష్కారం కోసం.. ఇంట్లో గదులను ఎవరైనా వినియోగించుకొనేలా చేస్తే బాగుంటుందని అనుకున్నాను. రమణకు చెబితే సరేనన్నారు. ఈ ఆలోచనలో నుంచి పుట్టిందే 'హోమ్ స్టే'. మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, దేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మా ఇంటికి వచ్చి ఆతిథ్యం పొందే అవకాశాన్ని కల్పించాం. మొదట్లో తెలిసిన వారికి మాత్రమే ఇచ్చేవాళ్లం. ఆ తరువాత ఆన్‌లైన్‌లో వివరాలు పెట్టాం. పర్యాటకులు వారు ఉండే రోజులను బట్టి, ఎంపిక చేసుకునే గదులను బట్టి, వారి సంఖ్యను బట్టి డబ్బులు చెల్లిస్తారు. వసతితోపాటు భోజన సదుపాయం కూడా కావాలంటే కల్పిస్తాం. మేము వండుకున్నదే వారికి పెడతాం. వారి ఆహారపు అలవాట్లకు అనుగుణంగా... వారే వంట చేసుకునేందుకు సదుపాయాలు కూడా ఉన్నాయి. చాలామంది మాతోపాటు మేము వండుకున్నవి తినేందుకు ఇష్టపడుతుంటారు. కొందరు మా కిచెన్‌లోకి వచ్చి, వారి వంటలు వండి, మాకు పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక, వంట చేసే సమయంలో సాయం చేయడానికి కూడా ముందుకు వస్తూ ఉంటారు. నేను సౌతిండియన్, నార్త్ ఇండియన్ వంటలన్నీ బాగా చేస్తాను. పర్యాటకులు ఉన్నన్ని రోజులూ ఒక్కోరోజు ఒక్కో ప్రాంతానికి చెందిన వంటలు వండి పెడతాను.

మూడు కేటగిరీల్లో గదులు..

ప్రస్తుతం మా ఇంట్లో మూడు అదనపు గదులను పర్యాటకుల కోసం కేటాయించాం. వీటిలో రెండు ఫ్యామిలీతో కలిసి ఉండేందుకు, ఒకటి బ్యాచిలర్స్, స్నేహితులు ఉండేందుకు అనువుగా ఉంటాయి. వాటికి పేర్లు కూడా ఉన్నాయి. ఒకటి మెగ్నోలియా స్టే, మరొకటి మెగ్నోలియా స్టూడియో రూమ్, ఇంకొకటి మెగ్నోలియా హోమ్. మెగ్నోలియా అనేది నాకు ఇష్టమైన ఒక పువ్వు పేరు. అందుకే గదులకు ఆ పేరు పెట్టాను. మా ఇంటికి వచ్చే పర్యాటకుల్లో 70 నుంచి 80 శాతం ఇతర రాష్ట్రాలకు చెందినవారు. వారిలో కుటుంబంతో కలిసి వచ్చేవాళ్లు, స్నేహితులతో వచ్చే వాళ్లు ఉంటారు. మరో 20 శాతం మంది విదేశీ పర్యాటకులు. ఎక్కువగా అమెరికా, యూకే, జపాన్, ఫ్రాన్స్ లాంటి దేశాలకు చెందిన టూరిస్టులు వస్తారు. ఒకసారి మా ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించిన వారు... మరోసారి విశాఖ వస్తే మా దగ్గరకే వస్తారు. మరో చోటుకు వెళ్లేందుకు ఇష్టపడరు. మా ఇంటికి వచ్చే వాళ్లను టూరిస్టులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా చూసుకుంటాం. వారితో మమేకమవుతాం. అన్ని విషయాలను చర్చిస్తాం. చాలా మంది ఆ తరువాత కూడా ఫోన్ చేసి, మా బాగోగులు తెలుసుకుంటూ ఉంటారు. వారి ఇళ్లకు ఆహ్వానిస్తూ ఉంటారు. అలాంటప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. అమ్మాయి పెళ్లయి వెళ్లాక, ఒంటరిగా ఉన్నామన్న భావన ఇప్పుడు లేదు. మా. కుటుంబ సభ్యులు పెరిగినట్టు అనిపిస్తోంది.

పరిశుభ్ర నగరంగా కితాబు..

మా ఇంట్లో ఆతిథ్యం తీసుకున్న టూరిస్టుల్లో దాదాపు అందరూ నగర అందాలకు ముగ్ధులైన వారే. విశాఖ నగరం పరిశుభ్రంగా ఉండడంతోపాటు మనుషులు ఆత్మీయంగా ఉంటారని వారు చెబుతుంటారు. ఇక్కడి మనుషుల మాట తీరు, వ్యవహరించే విధానం బాగుందని ప్రశంసిస్తూ ఉంటారు. తొలిసారి వచ్చిన టూరిస్టులు ఎక్కడెక్కడికి వెళ్లాలో, ఏ ప్రాంతాలను సందర్శించాలో తెలుసుకుంటారు. దేశ, విదేశాలకు చెందిన, భిన్నమైన వ్యక్తిత్వం కలిగిన, వివిధ భాషలు మాట్లాడే వ్యక్తులకు ఆతిథ్యం ఇవ్వడం వల్ల అనేక విషయాలను తెలుసుకొనే అవకాశం మాకు ఏర్పడుతోంది. ఇటువంటి విధానాన్ని నగర వాసులతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాలి. కొన్ని ఇబ్బందులు ఉంటాయి. అయితే, అటువంటి సందర్భాలు అతి తక్కువ మాత్రమే మాకు ఎదురయ్యాయి. మా హోమ్ స్టే సంగతి తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కిందటి నెల 27న, 'పర్యాటక దినోత్సవం' సందర్భంగా... వర్చువల్ విధానంలో నాతో మాట్లాడారు. హోమ్ స్టే విధానం అమలు తీరు, వస్తున్న ఆదాయం, తదితర విషయాలను తెలుసుకుని నన్ను అభినందించారు. అది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ప్రభుత్వం రాష్ట్రమంతటా ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధపడుతుండడం మంచి విషయమే. ఇది రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని ఆశిస్తున్నాను."

పరస్పర సహకారం..

మాకు కొద్దిమందితో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటివారికి... వారు చెల్లించిన డబ్బు తిరిగి ఇచ్చి పంపించేస్తాం. మా ఇంట్లో ఉన్నన్ని రోజులు వారికి విశాఖలోని అందాలు, పర్యాటక ప్రదేశాలు, వారు వెళ్లాల్సిన ప్రాంతాల గురించి చెబుతూ ఉంటాం. కొందరు పరిశోధనల కోసం, అధ్యయనాల కోసం వస్తారు. వారికి అవసరమైన సహకారాన్ని రమణ అందిస్తారు. ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి నోట్స్ ప్రిపరేషన్, ఇతర సాంకేతిక అంశాల్లో సహాయాన్ని చాలా సందర్భాల్లో రమణ అందించారు. ఒక రకంగా చెప్పాలంటే గైడ్‌గా కూడా బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాం. కొన్నిసార్లు మా ఇంట్లో దిగిన వారికి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. వారు పూర్తిగా కోలుకునేంత వరకు జాగ్రత్తగా చూసుకుంటాం. మా ఆత్మీయతను చూసి భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్న వాళ్లు కూడా ఉన్నారు.

• బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం
ఫొటోలు: వై.రామకృష్ణ

వాషింగ్ మెషిన్‌లో ఇలా...

వాషింగ్ మెషిన్‌లో వేసి ఉతకడం వల్ల దుస్తులు రంగు వెలవడం, టీ షర్టులు లాంటివి సాగిపోవడం చూస్తుంటాం. ఎక్కువగా డిటర్జెంట్ వినియోగించినప్పటికీ ఒక్కోసారి దుస్తులపై మురికి, మరకలు వదలకుండా ఇబ్బంది కలిగిస్తుంటాయి. అలాకాకుండా చిన్న చిట్కాలు పాటిస్తూ వాషింగ్ మెషిన్‌లో దుస్తులను జాగ్రత్తగా ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం...

- వాషింగ్ మెషిన్‌లో వేసే ముందు దుస్తులపై మరకలు, మురికి ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో పరిశీలించాలి. సాధారణంగా షర్ట్ కాలర్, డ్రెస్ చేతుల చివర్లు, చీర లేదా లెహంగా కింది భాగాల మీద మురికి ఎక్కువగా చేరుతూ ఉంటుంది. ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి కొన్ని నీళ్లు చిలకరించి పేస్టులా చేయాలి. ఈ పేస్టుని దుస్తులమీద మరకలు, మురికి ఎక్కువగా ఉన్నచోట రాసి పావుగంటసేపు ఉంచాలి. తరువాత నీళ్లు చల్లుతూ చేతులతో రుద్దితే మురికి పూర్తిగా వదులుతుంది. బాగా మాసిన దుస్తులను అరగంటసేపు సర్ఫ్ నీళ్లలో నానబెట్టిన తరువాతే వాషింగ్ మెషిన్‌లో వేయడం మంచిది.
- పెయింటింగ్, ఎంబ్రాయిడరీ వర్క్‌లు సహా వివిధ రకాల డిజైన్లు ఉన్న రంగుల దుస్తులను లోపలికి తిప్పి వాషింగ్ మెషిన్‌లో వేయాలి. దీనివల్ల దుస్తులు రంగు వెలవవు. వాటిపై ఉన్న డిజైన్లు కూడా పాడవకుండా ఉంటాయి.
- వాషింగ్ మెషిన్‌లో వేసేముందు దుస్తులకు ఉన్న బటన్లు, ఉక్కులు, జిప్పులను పెట్టేయాలి. దీనివల్ల దుస్తులు ఒకదానికొకటి చుట్టుకోకుండా ఉంటాయి. టీషర్టులు, లో దుస్తులు, సున్నితమైన ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన డ్రెస్‌లను మెష్ లాండ్రీ బ్యాగ్‌లో ఉంచి వాషింగ్ మెషిన్‌లో వేస్తే అవి సాగకుండా ఉంటాయి.



- కొన్ని వాషింగ్ మెషిన్‌లలో వేడినీళ్లు వినియోగించే వెసులుబాటు ఉంటుంది. మరీ వేడిగా కాకుండా గోరువెచ్చని నీళ్లను వాడితే దుస్తులకు పట్టిన దుర్వాసన, జిడ్డు, మురికి, మరకలు చాలావరకూ తొలగిపోతాయి. దుస్తులమీద చేరే హానికారక బ్యాక్టీరియాలు, ఇతర క్రిములు కూడా పూర్తిగా నశిస్తాయి. ముదురు రంగుల దుస్తులకు మాత్రం చల్లని నీళ్లనే వాడాలి.
- వాషింగ్ మెషిన్‌లో పరిమితికి మించి దుస్తులు వేయకూడదు. అలా వేస్తే నీళ్లలో సులువుగా తిరగలేక దుస్తులు సరిగా శుభ్రం కావు. అంతేకాదు వాటిమీద డిటర్జెంట్ నిలవడం వల్ల ఫ్యాబ్రిక్ త్వరగా పాడవుతుంది.
- డ్రయ్యర్‌ను ఎక్కువగా వాడకపోవడమే మంచిది. దీనిలోని అధిక వేడి కారణంగా దుస్తులు రంగు వెలిసిపోతాయి.

యుక్తవయసు దాటాక కూడా...



చాలామంది యుక్త వయసు దాటిన తరవాత ఎత్తు పెరగడం అసాధ్యం అనుకుంటూ ఉంటారు. కానీ కొన్ని చిట్కాలు పాటించి యుక్త వయసు తరవాత కూడా కొద్దిగా ఎత్తు పెరగవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ చిట్కాల గురించి తెలుసుకుందాం..

- యోగా చేసేటప్పుడు తడాసనం, వృక్షాసనం, భుజంగాసనం వేయడం వల్ల శరీరంలో కదలికలు పెరుగుతాయి. దీంతో కండరాలు, ఇతర కణజాలాలు కొద్దిగా సాగుతాయి. అలాగే ఎత్తు పెరగడానికి అవసరమయ్యే హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి.
- ఎత్తు పెరగడానికి స్ట్రెచింగ్ వ్యాయామాలు బాగా దోహదం చేస్తాయి. రోజూ ఎత్తులో ఉన్న రాడ్ లేదా కిటికీ ఊచలు పట్టుకుని వేలాడుతూ శరీరాన్ని సాగదీయాలి. ఏదైనా పని చేసిన తరువాత ఒళ్లు విరుచుకుంటూ ఉండాలి. వెన్నెముకకు సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల కూడా వీపు, నడుము భాగాల్లోని కండరాలు సాగుతాయి. తరచూ ఇవన్నీ చేస్తూ ఉంటే కొద్దిగా ఎత్తు పెరిగే అవకాశం ఉంటుంది. స్కిప్పింగ్, స్విమ్మింగ్, బాస్కెట్ బాల్ ఆడడం లాంటివి మంచి ఫలితాన్నిస్తాయి.
- ఎత్తు పెరగాలంటే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రొటీన్, జింక్, కాల్షియం, విటమిన్లు, మినరల్స్ అధికంగా లభించే ఆహార పదార్థాలు తినాలి. ఇవి ఎముకలు, కండరాలను బలోపేతం చేసి ఎత్తు పెరగడానికి తోడ్పడతాయి.
- శరీరం ఆరోగ్యంగా ఎదగాలంటే మంచి నిద్ర అవసరం. రోజుకు కనీసం ఎనిమిది నుంచి తొమ్మిది గంటలపాటు నిద్రించడం వల్ల శరీరంలో గ్రోత్ హార్మోన్లు ఉత్పత్తయి ఎత్తు పెరగడానికి దోహదం చేస్తాయి.
- నిటారుగా నిలబడి చేతులను పైకి లేపి తలపైన రెంటినీ కలపాలి. పాదాలను పైకి లేపి మునివేళ్ల మీద కొద్దిసేపు నిల్చోవాలి. ఆపై విశ్రాంతి దశకు రావాలి. ఇలా రోజూ ఉదయం, సాయంత్రం ఇరవై సార్లు చేస్తూ ఉంటే ఎత్తు పెరిగే అవకాశం ఉంటుంది.

ఆత్మరక్షణ కేరాఫ్ అస్మిత

భయం, ఆంక్షలు, వేధింపులు... వీటన్నిటినీ ఎదుర్కోవాలంటే మహిళలకు ఆత్మరక్షణ విద్య తప్పనిసరి అంటోంది **అస్మితా పాల్.** దేశవ్యాప్తంగా ఈ అంశంపై అవగాహన పెంచడం కోసం స్కూటీ మీద ఏడువేల కిలోమీటర్లకి పైగా ఒంటరిగా పర్యటించి, ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. ఇరవయ్యేళ్ల ఈ అసోం అమ్మాయి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షకురాలుగా ఎంతోమందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది.



"నాలుగు నెలల క్రితం నా పర్యటనలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఉన్నాను. అక్కడ మహిళలకు, బాలికలకు ఆత్మరక్షణ విద్యల ఆవశ్యకత గురించి ఒక కార్యక్రమం నిర్వహించాను. నేను బయలుదేరబోతూ ఉంటే... పదమూడేళ్ళ అమ్మాయి బిడియపడుతూ నా దగ్గరకు వచ్చింది. "అక్కా! బలంగా, దృఢంగా ఉండాలని నేను ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ నిన్ను చూసిన తరువాత... సెల్ఫ్ డిఫెన్స్ విద్యలు నేర్చుకోవాలనిపిస్తోంది" అంటూ నన్ను గట్టిగా హత్తుకుంది. ఆ అమ్మాయిలో అమాయకత్వంతో పాటు ధైర్యం కూడా కనిపించింది. నా మనసు చలించిపోయింది. నేను చెప్పే మాటల్లో నిజాన్ని ఒకే ఒక్క అమ్మాయి అర్థం చేసుకున్నా... నా ప్రయాణం సఫలమైనట్టేనని భావించాను. ఈ సంఘటన ఆ తరువాత సాగించిన ప్రయాణంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకోగలిగే ప్రేరణను కలిగించింది.

ఇది ప్రతి అమ్మాయి అనుభవం

మాది అసోంలోని గువహటికి చెందిన దిగువ మధ్య తరగతి కుటుంబం. నేను యావరేజ్ స్టూడెంట్‌ని. కానీ ఆటల్లో ముందుండేదాన్ని. ఆత్మ రక్షణ విద్యలు నేర్చుకోవాలనే ఆలోచన రావడానికి కారణం... నా చుట్టూ ఉన్న పరిస్థితులే. వీధుల్లో వెళ్తూ ఉంటే పోకిరీలు వేధించేవారు. ఆ సంగతి ఇంట్లో చెబితే... "ఇక అటువైపు వెళ్ళకు" అనేవారు, ఆంక్షలు పెట్టేవారు. ఇవన్నీ నాలో భయాన్ని పెంచేవి. ఇది నా సమస్య మాత్రమే కాదు... దాదాపు ప్రతి అమ్మాయి నిత్యం ఎదుర్కొనే అనుభవం. 'ఎంతకాలం ఇలా భయపడుతూ బతకాలి?' అని ఆలోచించినప్పుడు, నాకు తోచిన పరిష్కారం... ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవడం. అందుకోసం నా కుటుంబాన్ని ఒప్పించడానికి ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. శిక్షణలో చేరిన తరువాత... రోజురోజుకూ నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అవాంఛనీయమైన సందర్భాలు ఎదురైనప్పుడు... నన్ను నేను కాపాడుకోగలననే ధైర్యం కలిగింది. శిక్షణ పూర్తి చేశాక... సెల్ఫ్ డిఫెన్స్ శిక్షకురాలిగా మారాను. మా ప్రాంతంలోని అమ్మాయిలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను.



స్కూటీయే ఎందుకంటే...

ఆత్మరక్షణ విద్యలు కేవలం శరీర దారుఢ్యానికి, మనల్ని రక్షించుకోవడానికి మాత్రమే కాదు... అవి మహిళా సాధికారతకు కూడా దోహదం చేస్తాయి. సమాజంలో ప్రతి అమ్మాయి సురక్షితంగా, స్వేచ్ఛగా జీవించాలంటే ఈ విద్యలు తప్పనిసరి అనేది నా అభిప్రాయం. ఈ విషయంపై దేశవ్యాప్తంగా మహిళలకు అవగాహన కలిగించడం కోసం పర్యటన చేయాలనే ఆలోచన కొన్నాళ్ళ క్రితం వచ్చింది. దానికి ప్రణాళిక వేసుకుంటున్నప్పుడు... ప్రయాణానికి స్కూటీని ఎంచుకోవాలనుకున్నాను. ఎందుకంటే మన దేశంలో అమ్మాయిలు ఎక్కువగా ఉపయోగించేది స్కూటీనే. నేను దానిమీద వేల కిలోమీటర్లు ఒంటరిగా ప్రయాణిస్తే... వారు నాతో తొందరగా కనెక్ట్ అవుతారని అనుకున్నాను. అదే నిజమైంది. ప్రయాణానికి ముందు... అవసరమైన పత్రాలన్నిటినీ సిద్ధం చేసుకున్నాను. ఎక్కడైనా వాహనం ఆగిపోతే ఇబ్బంది పడకుండా...మరమ్మతు ఎలా చేయాలో నేర్చుకున్నాను.

తొలి మహిళగా...

ఈ ఏడాది మే 18న... గువహటిలో ప్రారంభించిన నా యాత్ర... జమ్మూ కాశ్మీర్ మీదుగా... 22 రాష్ట్రాల్లో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో, పొరుగు దేశమైన నేపాల్‌లో కొనసాగింది. 27 రోజుల తరువాత కన్యాకుమారిలో ముగిసింది. మొత్తం 7,234 కిలోమీటర్ల దూరం ప్రయాణించాను. నాలుగు రాష్ట్రాల గవర్నర్ల నుంచి, నేపాల్ ప్రభుత్వం నుంచి సత్కారాలు అందుకున్నాను. గువాహటి నుంచి జమ్మూకశ్మీర్, కన్యా కుమారి వరకూ.. గరిష్ట దూరం స్కూటీ మీద ఒంటరిగా పర్యటించిన ఈశాన్య రాష్ట్రాలకు చెందిన తొలి మహిళగా... 'ఇండియన్ బుక్ ఆఫ్‌ది రికార్డ్స్'లో నాకు చోటు లభించింది. ఏదైనా గ్రామంలో ఆగినప్పుడు... అమ్మాయిలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతోపాటు మహిళా సాధికారత గురించి, ఆడపిల్లల భద్రతలో ఆత్మరక్షణ విద్యల ప్రాధాన్యం గురించి, వారు చదువుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించాను. ప్రతి అమ్మాయి కలలు కనాలి, వాటిని నెరవేర్చుకోవడానికి ముందుకు సాగాలి. ఇదే నా యాత్ర ద్వారా ఇవ్వాలనుకున్న సందేశం. నా ప్రయాణం కొందరిలో స్ఫూర్తి కలిగించినా నా ప్రయత్నం ఫలించినట్టే."

తల రంగు మరకలా...



మనలో చాలామంది తలకు రంగు వేసుకుంటూ ఉంటారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ నుదుటిమీద, మెడ చుట్టూ నల్లని రంగు మరకలు ఏర్పడుతుంటాయి. వీటిని సులభంగా వదిలించే చిట్కాల గురించి తెలుసుకుందాం...

- రెండు చుక్కల మేకప్ రిమూవర్ లేదా నెయిల్ పాలిష్ రిమూవర్‌ను చిన్న దూది వుండ మీద వేసి దానితో మరకల మీద మెల్లగా రుద్దాలి. ఆపైన గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే మరకలు పోతాయి. తరవాత చర్మం పొడిబారకుండా మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
- రంగు మరకల మీద కొద్దిగా టూత్‌పేస్ట్‌ను రాయాలి. తరవాత మెత్తని చేతి రుమాలు లేదా పాత టూత్‌బ్రష్‌తో రెండు నిమిషాలపాటు రుద్దాలి. ఆపైన గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే మరకలు తొలగిపోతాయి.
- మరకల మీద వైట్ పెట్రోలియం జెల్లీని రాసి చేతి వేళ్లతో మృదువుగా రుద్దాలి. తరవాత తడి గుడ్డతో తుడిచేస్తే మరకలు పోతాయి.
- వెనిగర్‌లో ముంచిన దూది లేదా నిమ్మ చెక్కతో రుద్ది కూడా మరకలను వదిలించుకోవచ్చు.
- చిన్న గిన్నెలో బేబీ ఆయిల్, ఎసెన్షియల్ ఆయిల్, ఆలివ్ ఆయిల్‌లలో ఒకదాన్ని తీసుకుని కొద్దిగా వేడిచేసి మరకల మీద రాయాలి. అయిదు నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే ఫలితం కనిపిస్తుంది.

ఇలా చేస్తే తలనొప్పి మాయం..!

ఒక్కోసారి విపరీతంగా తలనొప్పి వేధిస్తూ ఉంటుంది. అలాంటప్పుడు వెంటనే మందు బిళ్ల మింగకుండా పాటించాల్సిన చిట్కాల గురించి తెలుసుకుందాం...

- తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు చీకటి గదిలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. చీకటి వల్ల కళ్లు, మెదడు విశ్రాంతి పొంది వెంటనే తలనొప్పి తగ్గుతుంది.
- ఒక్కోసారి శరీరంలో ఏర్పడే నిర్జలీకరణ వల్ల కూడా తలనొప్పి వస్తుంటుంది. తలనొప్పి అనిపించగానే ఒక గ్లాసు మంచి నీళ్లు తాగితే ఉపశమనంగా ఉంటుంది.
- కొన్ని ఐస్ క్యూబ్స్‌ను చేతిరుమాలులో చుట్టి నుదిటి మీద ఉంచుకుంటే తలనొప్పి తగ్గుతుంది. చల్లటి నీళ్లతో తడిపిన తువాలును తలకు చుట్టుకున్నా ఫలితం ఉంటుంది.
- గోరువెచ్చని గ్రీన్ టీ తాగినా ప్రయోజనం కనిపిస్తుంది. గ్రీన్ టీ లోని యాంటి ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గించి నరాల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. దీంతో తలనొప్పి తగ్గుతుంది.



- శరీరంలో చక్కెర స్థాయి తగ్గినా విపరీతంగా తలనొప్పి వస్తుంది. ఏదైనా పండు లేదా డ్రై ఫ్రూట్స్ తింటే సమస్య తీరుతుంది.
- మెడ మీద హాట్ బ్యాగ్ పెట్టుకున్నా మెల్లగా మర్దన చేసుకున్నా కండరాలు సడలి తలనొప్పి తగ్గుతుంది.
- ఎక్కువసేపు టీవీ చూస్తున్నా; మొబైల్, ల్యాప్‌టాప్‌లను అదేపనిగా వినియోగిస్తున్నా తలనొప్పి తప్పదు. కాబట్టి స్క్రీన్ టైమ్‌ను నియంత్రించుకుని సమయానుసారం వ్యాయామం చేయడం, నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి. యోగ, ధ్యానం లాంటివి కూడా మంచి ఫలితాన్నిస్తాయి.

దిక్సూచి

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ డిసెంబర్ - 2025

సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. సైన్స్ సబ్జెక్టుల్లో పరిశోధనలకు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్‌తోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం 'సీఎస్ఐఆర్ యూజీసీ నెట్' నిర్వహిస్తారు. దీనితోపాటు జేఆర్ఎఫ్‌కు అర్హత పొందితే సీఎస్ఐఆర్ పరిధిలోని రిసెర్చ్ సెంటర్లలో, వివిధ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వివిధ యూనివర్సిటీల్లో లేదా డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ ఎంపిక కావచ్చు.



పరీక్ష: జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ డిసెంబర్ 2025

మొత్తం పరీక్ష పేపర్లు

- కెమికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, థర్డ్ జండర్, దివ్యాంగ, ఓబీసీ అభ్యర్థులకు 50 శాతం చాలు.

వయస్సు: జేఆర్ఎఫ్‌కు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2025 డిసెంబర్ నాటికి 30 సంవత్సరాలు మించి ఉండరాదు. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళా అభ్యర్థులకు ఐదేళ్లు, నాన్ క్రిమిలేయర్ ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల వయో పరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: పరీక్ష వ్యవధి మూడు గంటలు. మొత్తం 200 మార్కులకు పరీక్ష సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో జరుగుతుంది. మల్టీపుల్ చాయిస్ తరహాలో ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150/-, ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.600/-, ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు/ థర్డ్ జండర్ అభ్యర్థులకు రూ. 325/-

పరీక్ష తేదీ: 2025 డిసెంబర్ 18

చివరి తేదీ: 2025 అక్టోబర్ 10

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in/

జేఈఈ (మెయిన్)-2026

ఈ డాక్యుమెంట్లు సిద్ధమేనా

జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన కళాశాలల్లో ఇంజనీరింగ్ అడ్మిషన్స్‌కు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ 2026 పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కొన్ని కీలక సూచనలు చేసింది. 2026 జనవరిలో సెషన్-1, ఏప్రిల్‌లో సెషన్-2 ఎంట్రెన్స్ జరపనున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. సెషన్-1 ఎంట్రెన్స్ పరీక్ష దరఖాస్తులు 2025 అక్టోబర్ నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. దీనికి దరఖాస్తు చేసే విద్యార్థులు అవసరమైన డాక్యుమెంట్లను అప్పటిలోగా అప్‌డేట్ చేసి పెట్టుకోవాలని సూచించింది. లేకుంటే దరఖాస్తు సమయంలో ఇబ్బందులు పడడమో, సరైన సమయంలో అప్‌డేట్ చేసుకోలేకపోతే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలో జేఈఈ మెయిన్‌కి దాదాపు పద్నాలుగు లక్షల మంది దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో రెండున్నర లక్షల మంది తెలుగు విద్యార్థులే ఉంటారు.

అవసరమైన దరఖాస్తులు

ఆధార్: ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ(పదో తరగతి సర్టిఫికెట్ ప్రకారం) సరిగ్గా ఉండేలా చూసుకోండి. అలాగే తాజా ఫోటో గ్రాఫ్, తండ్రి పేరు, ఇంటి అడ్రస్ అప్‌డేట్ అయి ఉండాలి. వేలి ముద్రలు కూడా అప్‌డేట్ చేయించుకుంటే బెటర్.

దివ్యాంగ అభ్యర్థులైతే: యూడీఐడీ కార్డు చెల్లుబాటు అవుతుంది. అయితే రెన్యూవల్ చేయించుకుని ఉండడం మంచిది.

కేటగిరీ సర్టిఫికెట్: ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ-ఎన్‌సీఎల్ సర్టిఫికెట్‌ను చెల్లుబాటు అయ్యేలా అప్‌డేట్ చేసి పెట్టుకోవాలి.

తాజా సూచనలు ఏమైనా ఉన్నాయేమో అని ఎప్పటికప్పుడు https://jeemain.nta.nic.in వెబ్‌సైట్‌ను చెక్ చేసుకుంటూ ఉండాలి.

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ జాబ్స్

సాధారణంగా సాఫ్ట్‌వేర్ జాబ్ చేయాలంటే ఇంజనీరింగ్, ఎంసీఏ లేదా కనీసం బీఎస్సీ అయినా ఉండాలి. అయితే సంప్రదాయానికి బ్రేక్ చెపుతోంది హెచ్‌సీఎల్ టెక్నాలజీస్. ఇంటర్ పాసైన వారికి సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పించడం కోసం 'టెక్-బీ' పేరిట కొత్త ప్రోగ్రామ్‌ను రూపొందించింది. దీని ద్వారా ఐటీలో ఎంట్రీ లెవల్ ఉద్యోగానికి అవసరం అయిన శిక్షణను అందిస్తుంది. ఈ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఉద్యోగం ఇస్తారు.

'టెక్ బీ' ప్రోగ్రామ్ అర్హతలు

- అభ్యర్థులు దరఖాస్తు చేసే సంవత్సరం లేదా అంతకు ముందు సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అంటే 2024 లేదా 2025లో ఇంటర్ పూర్తి చేసినవారు దరఖాస్తుకు అర్హులు.
- ఇంటర్‌లో మేథ్స్ లేదా బిజినెస్ మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదవడంతోపాటు, అందులో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- ఇంటర్‌లో నిర్ణీత పర్సెంట్ సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాయడానికి అర్హులు. అయితే ఇంటర్ పర్సెంటేజీ విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో పర్సెంటేజీని నిర్ణయించారు. స్టేట్ సిలబస్‌తో పరీక్ష రాసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అయితే 75 శాతం మార్కులు సాధించాలి. అదే సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ విద్యార్థులు అయితే 70 శాతం మార్కులు వచ్చి ఉండాలి.

ఉన్నత చదువులు

హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం చేస్తూనే ఐఐటీ గౌహతి, ఐఐఐటి కొట్టాయం, బిట్స్ పిలానీ, శాస్త్ర, ఐఐఎమ్ సిర్మౌర్, అమిటి తదితర యూనివర్సిటీల్లో దూరవిద్య లేదా ఆన్‌లైన్ మోడ్ ద్వారా ఉన్నత విద్య కోసం నమోదు చేసుకోవచ్చు. ఈ మేరకు ఆయా సంస్థలతో హెచ్‌సీఎల్ ఎంఓయూ కూడా చేసుకుంది.



ఎంపిక విధానం: దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. దీనిలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

ఎంపిక తర్వాత శిక్షణ

- హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రామ్‌కి ఎంపికైన విద్యార్థులకు 12 నెలలు శిక్షణ ఇస్తారు. లక్నో, నోయిడా, మధురై, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, నాగపూర్‌లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.
- ట్రైనింగ్, ఫౌండేషన్, టెక్నాలజీ/ డొమైన్ ట్రైనింగ్, ప్రొఫెషనల్ ప్రాక్టీస్ ట్రైనింగ్ అని మూడు దశల్లో ఉంటుంది.
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అసెస్‌మెంట్లు, చర్చలు, కేస్‌బేస్డ్ సబ్మిషన్లు అన్నీ ఉంటాయి.

ఫీజు : 'టెక్ బీ'లో 'ఐటీ సర్వీసెస్', 'అసోసియేట్' అని రెండు ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ఒక్కో కోర్సును బట్టి ఐటీ రోల్‌లో అయితే లక్షన్నర, అసోసియేట్ రోల్‌లో అయితే దాదాపు యాభై ఒక్కవేల వరకు ఫీజు ఉంటుంది. వార్షిక ఆదాయం తక్కువ ఉన్నవారు బ్యాంక్ నుంచి రుణం కూడా పొందవచ్చు.

- శిక్షణలో 90 శాతంపైగా వచ్చిన విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది. 85పైగా వచ్చిన వారికి 50 శాతం మినహాయింపు ఉంటుంది. కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేసే సమయంలో కొంత స్టయిఫండ్ ఇస్తారు. కోర్సు తర్వాత హెచ్‌సీఎల్‌లో 1.96 లక్షల నుంచి 2.2 లక్షల వేతనంతో పూర్తిస్థాయి ఉద్యోగిగా చేరవచ్చు.

పూర్తి వివరాల కోసం www.hcltech.com చూడవచ్చు. లేదా support-techbee@hcltech.com ఈ మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

ఎంట్రెన్స్ 2026

లిమ్మెండర్స్

గేట్

దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'గేట్-2026' షెడ్యూల్ వెలువడింది. మొత్తం 30 సబ్జెక్టు పేపర్లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఎంట్రెన్స్‌ను గౌహతి ఐఐటీ నిర్వహిస్తోంది. 'గేట్' ఫలితాలు వెలువడిన నాటి నుంచి మూడు సంవత్సరాలపాటు ఎంట్రెన్స్ స్కోరు వాలీడ్‌గా ఉంటుంది. ఆ స్కోరుతో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ తీసుకోవచ్చు.

- **చివరి తేదీ:** 2025 అక్టోబర్ 6
- **ఆలస్య రుసుముతో:** 2025 అక్టోబర్ 9
- **ఎంట్రెన్స్ తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15
- **ఫలితాలు:** 2026 మార్చి 19
- **వెబ్‌సైట్:** http://gate2026.iitg.ac.in/

కామన్ లా అడ్మిషన్ టెస్ట్

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మక న్యాయ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్'(క్లాట్)-2026 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) లా ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. క్లాట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

కోర్సులు:

- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ)



అర్హతలు : అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసై ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

ఎంట్రెన్స్ తేదీ: 2025 డిసెంబర్ 7

వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/

సీడాక్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడాక్)లో ఒప్పంద ప్రాతిపదికన 646 ప్రాజెక్ట్ ఇంజనీర్, ప్రాజెక్ట్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్ తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నారు.

సెంటర్ల వారీగా ఖాళీలు

బెంగళూరు 110, చెన్నై 105, హైదరాబాద్ 65, కోల్‌కతా 06, ముంబాయి 12, నోయిడా 173, పుణె 99, తిరువనంతపురం 54, గువహటి 22

సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, ఎంఫిల్/పీహెచ్‌డీ పాసై ఉండాలి.

దరఖస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 10

వెబ్‌సైట్: https://cdac.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆకట్టుకునే క్రైమ్ కామెడీ



బంగారపు గనుల కోసం జరిపిన అన్వేషణ ఓ మిత్రబృందం జీవితంలో ఎలాంటి అనూహ్య సంఘటనలకు కారణమైంది అనే అంశం చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'బాబా బ్లాక్ షీప్'. దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్న ఈ చిత్రానికి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. టినుఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే దర్శకుడు తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా చిత్ర బృందం మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. గన్స్, గోల్డ్ చుట్టూ తిరిగే కథ ఇది, క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతోంది, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని యూనిట్ తెలిపింది. సందర్భానుసారం వచ్చే కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: స్టీఫెన్ ఆనంద్, సినిమాటోగ్రఫీ: అజయ్ అబ్రహం జార్జ్.



అందమైన జ్ఞాపకాలు

చిరంజీవి

తెలుగు, తమిళ్, మలయాళ, కన్నడ, హిందీ చిత్రపరిశ్రమల్లోని అలనాటి తారలు చెన్నైలో తళుక్కుమన్నారు. '80స్ స్టార్స్ రీ యూనియన్' పేరుతో 1980కి చెందిన నటీనటులు ఇటీవలె కలుసుకున్నారు. ఈ ఫొటోలను మెగాస్టార్ చిరంజీవి తన ఎక్స్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. '1980ల నాటి నా ప్రియమైన స్నేహితులతో జరిగే ప్రతీ రీ యూనియన్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ బంధం విడదీయరానిది. ఎన్నో అందమైన జ్ఞాపకాలు, మరెన్నో నవ్వులతో ఈ వేడుక ఆనందంగా సాగింది' అని పేర్కొన్నారు. కాగా, ఈ వేడుకల్లో మెగాస్టార్ చిరంజీవి, వెంకటేష్, నరేశ్, శరత్ కుమార్, సురేశ్, జయరామ్, ప్రభు, భానుచందర్, భాగ్యరాజ్, రెహ్మాన్, జాకీ ష్రాఫ్, రాధ, సుహాసిని, రమ్యకృష్ణ, జయసుధ, మీనా, ఖుష్బూ, రేవతి, సుమలత, సరిత, పూర్ణిమ భాగ్యరాజ్, లిస్సీ, శోభన, మేనక, అశ్వతి జయరాం, స్వప్న, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

హిమాలయాల్లో రజనీకాంత్

● రోడ్డుపైనే టిఫిన్ చేసిన తలైవర్



సూపర్‌స్టార్ రజనీకాంత్ హిమాలయాల పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డుపైనే టిఫిన్ చేస్తూ కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమా ఇటీవల విడుదలైన విషయం తెల్సిందే. తన సినిమా విడుదలైన ప్రతిసారీ హిమాలయాలకు రజనీకాంత్ వెళ్తుంటారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

గాయకుడిగా వెన్నెల కిశోర్



స్టార్ కమెడియన్ వెన్నెల కిశోర్ గాయకుడిగా మారారు. 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రంలో 'అనుకుందొకటి లే... అయ్యిందొకటిలే...' అంటూ సాగే గీతాన్ని ఆలపించారు. అంతే కాదు ఈ చిత్రంలో డాక్టర్ భ్రమరం పాత్రలో వెన్నెల కిశోర్ నవ్వులు పంచనున్నారు. చికిత్స కోసం వచ్చిన కథానాయకుడికి ధైర్యం చెబుతున్న సందర్భంలో ఈ పాటను ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ చిత్రాన్ని సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారు. విక్రాంత్, చాందినీ చౌదరి, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం కీలక పాత్రలు పోషించారు. సినిమాను త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

థ్రిల్ చేసే అంశాలతో



సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సీమంతం'. వజ్ర యోగి, శ్రేయభారతి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సుధాకర్ పాణి దర్శకత్వంలో ప్రశాంత్ టాటా, గాయత్రి సౌమ్య నిర్మిస్తున్నారు. ఇటీవలె ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు తేజ విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ప్రేక్షకులను థ్రిల్ చేసే అంశాలతో సినిమా ఆద్యంతం అలరిస్తుంది, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. సంగీతం: ఎస్. సుహాస్, సినిమాటోగ్రఫీ: శ్రీనివాస్ విన్నకోట



ప్రపంచ శాంతి కోసం

టాలీవుడ్ దర్శకుడు సత్యా రెడ్డి హాలీవుడ్‌లో 'కింగ్ బుద్ధ' అనే సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను అమెరికాలోని టెక్సాస్ మాజీ మేయర్ మ్యాట్ పావెల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యా రెడ్డి మాట్లాడుతూ 'ప్రపంచ శాంతి కోసం రూపొందుతున్న ఈ సినిమా అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుంది' అని అన్నారు. నిర్మాతల్లో ఒకరైన శైలర్ మాట్లాడుతూ 'ఏ విషయంలోనూ రాజీపడకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో ఉండబోతోందీ చిత్రం' అని చెప్పారు.

అందర్నీ అలరించేలా..



సూర్యతేజ పసుపులేటి స్వీయ నిర్మాణదర్శకత్వంలో కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'మన ఊరి ప్రేమాయణం'. ఈ చిత్రం టైటిల్, లోగోని సీనియర్ నటుడు సుమన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు, రామ సత్యనారాయణ కె.ఎస్. రాజు, డీవోపీ ఎడిటర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ "మన ఊరి ప్రేమాయణం' ఓ చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఎడిటర్ ఉదయ్ కుమార్ జి; సంగీతం: శ్రీ వెంకట్.



ఆద్యంతం ఉత్కంఠ భరితం

వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్ ప్రధాన పాత్రధారులుగా జయశంకర్ తెరకెక్కించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది దీని ఉపశీర్షిక. ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి.శేషురెడ్డి మారంరెడ్డి, డా.తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్‌రెడ్డి నిర్మించారు. సినిమా ఏషియన్ సురేశ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈనెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకనిర్మాతలు ట్రైలర్ విడుదల చేశారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా 'అరి' ఉండబోతున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. 'భూలోకంలో జన్మించాలనే సంకల్పం స్వర్గలోకంలో తెలిసిందట. అప్పుడు ఆరుగురు దేవతలు తమనూ భూలోకం తీసుకెళ్లమని శ్రీకృష్ణుడిని వేడుకున్నారట...' అనే సంభాషణ ఆకట్టుకుంది.

మేఘా కృష్ణారెడ్డికి మాతృవియోగం

» స్వగ్రామం ఏపీలోని దోకిపర్రులో అంతిమ సంస్కారాలు పూర్తి

» పలువురు ప్రముఖుల సంతాపం



హైదరాబాద్, గుడ్లవల్లేరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి తల్లి విజయలక్ష్మి (76) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దీంతో ఆమె భౌతిక కాయాన్ని వారి స్వగ్రామం ఏపీలోని కృష్ణా జిల్లా డోకిపర్రు గ్రామానికి తరలించారు. ఆమె పార్థివదేహాన్ని గ్రామస్థులు, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్, రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని), మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, కృష్ణాజిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము తదితరులు నివాళులర్పించారు. అనంతరం డోకిపర్రు గ్రామంలో విజయలక్ష్మి అంతిమ యాత్ర నిర్వహించి సాయంత్రం అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

సడన్ బ్రేక్‌తో 6 కార్లు ఢీ

ఓఆర్ఆర్‌పై ఘటన.. 2 కి.మీ వరకూ ట్రాఫిక్ జామ్

రాజేంద్రనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డుపై వరుసగా 6 కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో 2 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లోని హిమాయత్ సాగర్ సమీపంలో ఆదివారం జరిగింది. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్న ఎస్ క్రాస్ కారు డ్రైవర్ హిమాయత్ సాగర్ వద్ద సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న 5 కార్లు వరుసగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ఔటర్ రింగ్ రోడ్డుపై 2 కి.మీ. మేర ట్రాఫిక్ జామ్ కాగా, ఢీకొన్న కార్లన్నీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఔటర్‌పై ఏర్పడ్డ ట్రాఫిక్‌ను రాజేంద్రనగర్ పోలీసులు క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న బస్సు



రెండు బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జయిన కారు

చిట్యాల రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును ఓ ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో అది దాని ముందు ఉన్న మరో ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన జోష్‌కుమార్, విజయవాడకు చెందిన పైలా మురళి, మచిలీపట్నానికి చెందిన చల్ల శ్రీహర్షలు శనివారం విజయవాడ దుర్గమ్మను దర్శించుకుని కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున చిట్యాల శివారులోని ఓ పెట్రోల్ బంకు వద్ద రహదారిపై వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక ఆగి ఉన్న వారి కారును హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆ కారు రెండు బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. వెంటనే ఇతర వాహనదారులు కారులో ఉన్న ముగ్గురిని బయటకు తీశారు. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స కోసం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు.

పత్తి దిగుబడి వట్టిదేనా?

(మొదటిపేజీ తరువాయి)



నారాయణపేట జిల్లా ఉట్కూర్‌లో పత్తి ఏరుతున్న రైతు కూలీలు

వర్షం అదేపనిగా కురుస్తుండటమే సమస్యగా మారింది. మొక్కల్లో ఎదుగుదల లోపించింది. కాయలు కాసే దశలో ఆకులు పండుబారిపోతున్నాయి. చేలల్లో రోజుల తరబడి వరద నీరు కారణంగా మొక్కలు జాలు పట్టాయి. నీరుచేరి బూజు పట్టి డొల్లగా మారుతున్న కాయలు రాలిపోతున్నాయి. కొన్నిచోట్ల కాయలు చక్కగా విచ్చుకున్నా వదలని చినుకులకు దూది పింజలు తడిసి నల్లబారుతున్నాయి. వానకు తోడు మబ్బుపట్టిన వాతావరణం కారణంగా తెగుళ్లు పట్టిపీడిస్తుండటం, కలుపు మొక్కలు కప్పేస్తుండటంతో పంటంతా నాశనమవుతోంది. ఎక్కువగా నల్లరేగడి భూముల్లో పత్తిసాగు చేస్తుండటంతో వరుస వర్షాలతో ఆ చేలల్లో తేమ వదలడం లేదు. ఫలితంగా మొక్కలు నిలువునా మురిగిపోతున్నాయి. ఈ పరిస్థితి అంతా దిగుబడిపై ప్రభావం చూపనుంది. సాధారణంగానైతే మంచి వాతావరణ పరిస్థితులు ఉంటే ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల మేర దిగుబడి రావాలి. తాజా పరిస్థితుల కారణంగా ఇది 5-6 క్వింటాళ్లకే పరిమితమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలాచోట్ల 3-4 క్వింటాళ్ల మేర దిగుబడి పడిపోయే అవకాశం ఉందని అంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తామర, ఎర్రనల్లి, ఎర్ర తెగుళ్లతో పత్తిచేలు ఎర్రబారుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గత ఏడాది 6.42 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగవగా.. ఈసారి 7.61 లక్షల ఎకరాల్లో వేశారు. అయితే చీడపీడల వల్ల జిల్లాలో ఎకరాకు 3-4 క్వింటాళ్ల మేర దిగుబడి తగ్గే అవకాశం ఉంది. నారాయణపేట జిల్లా పూత, కాత రాలుతోంది. హనుమకొండ జిల్లా గత ఏడాది ఎకరానికి 9క్వింటాళ్లపైనే దిగుబడి వచ్చింది. ఈసారి 2-3 క్వింటాళ్లు తగ్గుతుందని చెబుతున్నారు.. ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 14వేల ఎకరాల్లో పంట ఎందుకూ పనికిరాకుండాపోయింది. ఆసిఫాబాద్ జిల్లాలో 10వేల ఎకరాల్లో, మంచిర్యాల జిల్లాలో 3వేల ఎకరాల్లో పంట దెబ్బతింది.

మద్దతుకు సీసీఐ కొర్రీలు పెట్టనుందా?

పత్తిపంటకు మద్దతు ధరను ఈసారి క్వింటాకు రూ.8,110గా నిర్ణయించారు. వర్షాలు, వరదలు, చీడపీడల సమస్య కారణంగా పత్తి నాణ్యత బాగా దెబ్బతింది. పైగా తేమ శాతం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్ఠంగా 8-12 శాతం తేమనే సీసీఐ అనుమతిస్తోంది. అంతకుమించి తేమ ఉంటే మద్దతు ధర ఇవ్వడం లేదు. 12శాతానికి మించి తేమ ఉంటే.. ఎక్కువగా ఉన్న ప్రతి ఒక్కశాతానికి రూ.81 చొప్పున తగిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే పత్తిరైతులకు మద్దతు ధర లభించడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకున్నా.. మార్కెట్లకు మాత్రం పత్తి తరలుతోంది. అయితే క్వింటాకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకే రైతులకు ఇస్తున్నారు.

కొనుగోళ్లు ఆలస్యం?

రాష్ట్రవ్యాప్తంగా ఈసారి పత్తిసాగు స్వల్పంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం 48,93,016 ఎకరాలు. గత ఏడాది 44,75,352 ఎకరాల్లో పత్తిసాగైంది. ఈసారి 45,94,684 ఎకరాల్లో సాగైంది. అయినా సాధారణ సాగు విస్తీర్ణంలో ఇది 93శాతమే! ఈసారి యూరియా కొరత వల్ల పంటలో ఎదుగుదల లోపించింది. పైగా వర్షాలు, వరదలు, తెగుళ్ల కారణంగా దిగుబడులు బాగా తగ్గే అవకాశం ఉందని అంచనాలున్నాయి. పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేపనిలో పడింది. దసరా తర్వాత రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే లీజు టెండర్ల విషయం కొలిక్కిరాకపోవడంతో కొనుగోళ్లు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకునేందుకుగాను సీసీఐ టెండర్లు ఆహ్వానించింది. అయితే సీసీఐ నిబంధనలపై అభ్యంతరాలు ఉండటంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. క్వింటా పత్తి నుంచి 33శాతం దూది (లింట్) తీయాలనే నిబంధన ఉంది. దీనిపై వ్యాపారులు, ట్రేడర్స్ మధ్య విభేదాలున్నాయి. ఫలితంగా కొనుగోలు కేంద్రాలు దీపావళికి ప్రారంభమైనా ఆశ్చర్యం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి!

» గడువు విధించిన రాష్ట్ర ప్రభుత్వం

» నేడు సీసీఐ ఎండీ, మిల్లర్లతో మరోసారి మంత్రి తుమ్మల భేటీ

హైదరాబాద్/వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించింది. భారత పత్తి సంస్థ(సీసీఐ) అధికారులు, జిన్నింగ్ మిల్లర్లు ఏకాభిప్రాయానికి వచ్చి, పత్తి కొనుగోలు కేంద్రాలను తెరవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే ఆదేశించారు. అయితే, జాబ్ వర్క్ టెండర్లలో పాల్గొనకుండా మొండికేస్తున్న జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపారు. ఈ సమస్యను కేంద్రం దృష్టికి కూడా తీసుకెళ్లారు. సోమవారం మరోసారి సచివాలయంలో సీసీఐ ఎండీ, జిన్నింగ్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనల్లో ఒకటి, రెండు నిబంధనలను సడలించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా.. జిన్నింగ్ మిల్లర్లు మాత్రం మొండిపట్టు వీడకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిల్లర్ల తీరుపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే వారంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాల్సిందేనని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

21 నుంచి కొనుగోళ్లు: వరంగల్ సీసీఐ

రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఈ నెల 21 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని సీసీఐ వరంగల్ శాఖ ప్రకటించింది. తమ పరిధిలో త్వరలో 122 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపింది. కొనుగోలు కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఇప్పటికే స్లాట్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. పత్తి రైతులందరూ ప్రభుత్వ పోర్టల్‌లో తమ రిజిస్ట్రేషన్‌ను నిర్ధారించుకోవాలని సీసీఐ సూచించింది.

తిరుమల తరహాలో శ్రీశైలం

» పుణ్యక్షేత్రం సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు: ఏపీ సీఎం

» ఏటా లక్షల మంది భక్తులు వస్తున్నారు

» తదనుగుణంగా వసతులు పెంచాలి

» ప్రధాన రహదారులకు అనుసంధానించాలి

» ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం అభివృద్ధిపై సమీక్షించారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఏటా లక్షల సంఖ్యలో శ్రీశైలం ఆలయానికి భక్తులు వస్తున్నందున మెరుగైన సదుపాయాలు ఎలా కల్పించాలి, మాస్టర్‌ప్లాన్, అటవీ శాఖ అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్ల అటవీభూమి కేటాయించాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా అన్ని రకాలుగా ఈ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. అందుకోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా శ్రీశైలానికి జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. భక్తులు పెరుగుతున్నందున ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచీ లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున సౌకర్యాలు విస్తరించాలన్నారు. శబరిమల, ఇతర ప్రముఖ దేవాలయాల్లో సౌకర్యాలు పరిశీలించి అభివృద్ధి చేద్దామని సూచించారు. శ్రీశైలాన్ని ఆదర్శప్రాయ యాత్రాస్థలంగా తీర్చిదిద్దేందుకు దేవదాయ, అటవీ, పర్యాటక శాఖల నడుమ సమన్వయం అవసరమన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపైనా అధికారులకు తగు సూచనలు చేశారు. ఆలయంలో మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు వెళ్లేందుకు, బయటకు రావడానికి ఇప్పుడు ఒకే మార్గం ఉంది. బయటకు వచ్చేందుకు వేరే మార్గం ఏర్పాటుపైనా సమీక్షలో చర్చించారు.

కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో విషాదం

» ఇనుప రాడ్డు మీద పడి కూలీ మృతి

» ములుగు జిల్లాకేంద్రంలో ఘటన

ములుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణమవుతున్న కలెక్టరేట్ సముదాయంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. పనిలో భాగంగా భారీ ఇనుప రాడ్డు మీదపడి సిరిపెల్లి రాజయ్య (50) అనే దినసరి కూలీ మృతి చెందాడు. వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన రాజయ్య ములుగు కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ వద్ద కూలీగా చేరాడు. అతడు పనిలో చేరిన తొలిరోజే ఈ ప్రమాదం జరగడం విషాదకరం. రాజయ్య మరో ఇద్దరు కూలీలతో కలిసి సుమారు 12 అడుగుల పొడవైన భారీ ఇనుప రాడ్డును భవనం పై అంతస్తుకు మోస్తున్నాడు. రాడ్డుకు ముందు వైపున ఇద్దరు కూలీలు, చివరి వైపున రాజయ్య ఉన్నారు. ఆ సమయంలో భవనంపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో రాజయ్య కాలు జారి కిందపడ్డాడు. మోస్తున్న రాడ్డు మీద పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సహచర కూలీలు వెంటనే జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాజయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఎన్నికల్లో లబ్ధికే బీజేపీ జీఎస్టీ బోనాంజా

» సీపీఐ నేత కె నారాయణ

ఖమ్మం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశంలో త్వరలో జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే కేంద్రంలోని బీజేపీ సర్కారు.. జీఎస్టీ తగ్గింపు బోనాంజాను ప్రకటించిందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె నారాయణ ఆరోపించారు. బిహార్ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ రూ. వేల కోట్లు సిద్ధం చేసిందని ఆదివారం ఖమ్మంలో జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో చెప్పారు. బిహార్‌లో బీజేపీ దొంగ ఓట్ల దొల్లతనం బయటపడిందని, తాను బలంగా ఉన్నట్టు ప్రజలను భ్రమింపజేస్తోందే తప్ప క్షేత్రస్థాయిలో బీజేపీ బలహీనపడిందన్నారు. ప్రజల్లో ప్రజాస్వామ్య భావజాలం బలంగా ఉందన్న నారాయణ.. బీజేపీ అప్రజాస్వామిక విధానాలను వారు నిరసిస్తున్నారన్నారు. పండుగల వేళ కార్పొరేట్ కంపెనీలు తమ వస్తువుల ధరల తగ్గింపు ఆఫర్లు ప్రకటించినట్లే.. కేంద్రం కూడా జీఎస్టీ తగ్గించిందన్నారు. జీఎస్టీ పేరుతో కేంద్రం.. 9ఏళ్లలో రూ.15 లక్షల కోట్ల ప్రజాధనం లూటీ చేసిందని ఆయన ఆరోపించారు. దేశంలో పెరిగిపోతున్న డిజిటల్ దోపిడీకి ఏఐ మాయాజాలం తోడైందన్నారు. ఏఐ పేరుతో ఒక మాయ ప్రపంచం సృష్టించి అడ్డదారిలో దోపిడీకి పాల్పడుతున్నారని నారాయణ చెప్పారు.

స్థానికంలో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ : కూనంనేని

రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నాయకులకు సూచించారు. రాష్ట్రంలోని 3 ప్రధాన పార్టీలు ఒక్కోరకమైన సమస్యలతో రాజకీయ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ హామీలు, బీఆర్ఎ‌స్‌లో ఇంటిపోరు, కాళేశ్వరంలపై చర్చ జరుగుతోందని ఆయన చెప్పారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ దొంగాట ఆడుతోందని కూనంనేని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై కొన్ని పార్టీలు ద్వంద్వ విధానం అవలంబిస్తున్నాయన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకటరెడ్డికి సీపీఐ ఖమ్మం జిల్లా సమితి ఘనంగా సత్కరించింది.

ప్రాణాలు తీసిన డీజే మోత!

» బతుకమ్మ ఆడుతూ నవ వధువు సహా ఇద్దరు మహిళల మృతి

» నిర్మల జిల్లాలో విషాద ఘటనలు



భాగ్యలక్ష్మి; రుషిత (ఫైల్)

నిర్మల్ టౌన్/భైంసా రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో తీవ్ర విషాదం జరిగింది. డీజే సౌండ్ బాక్సుల మోత మధ్య బతుకమ్మ ఆడుతూ ఓ నవవధువు సహా ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగిన వేడుకల్లో డీజే సౌండ్‌తో బతుకమ్మ పాటలు పెట్టుకుని మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ క్రమంలో బిట్లింగు భాగ్యలక్ష్మి(56) అనే మహిళ బతుకమ్మ ఆడుతుండగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మరణించినట్టు స్థానికులు తెలిపారు. అలాగే భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో జరిగిన ఘటనలో ఐదు నెలల క్రితమే పెళ్లి చేసుకున్న రుషిత(22) అనే నవవధువు ప్రాణాలు కోల్పోయింది. శనివారం రాత్రి డీజే సౌండ్‌తో బతుకమ్మ పాటలు పెట్టుకుని బతుకమ్మ ఆడుతుండగా రుషిత అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబీకులు స్థానికంగా చికిత్స అందించి, అనంతరం భైంసాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ చికిత్స అందే లోపే రుషిత ప్రాణాలు విడిచింది.

వయోవృద్ధుల దర్శనంపై వదంతులు నమ్మొద్దు: టీటీడీ

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల దర్శనంపై వదంతులను నమ్మొద్దని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసింది. 'రోజు వెయ్యి మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ 3 నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50 విలువైన లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమలనంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్ లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు వార్తలు లేదా వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం' అని టీటీడీ పేర్కొంది.

వరద బాధితులకు సాయమేదీ?

కామారెడ్డిలో ముఖ్యమంత్రి పర్యటించినా నయా పైసా సహాయం అందలేదు

» కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ కేంద్రం నుంచి నిధులు తేలేకపోతున్నారు

» మాజీ మంత్రి హరీశ్‌రావు



కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో వరద వల్ల పంటలు నష్టపోయిన మహిళా రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

నాగిరెడ్డిపేట, గాంధారి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితులకు సహాయం అందించడంలో రేవంత్ రెడ్డి సర్కారు విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటించి నెల రోజులు గడుస్తున్నా బాధితులకు నయా పైసా కూడా సహాయం అందలేదన్నారు. హరీశ్‌రావు ఆదివారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో మంజీరా వరద ముంపునకు గురైన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వరదలతో కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వందలాది ఇళ్లు కూలిపోయాయన్నారు. జిల్లా అధికారులు సర్వే చేసి వరదల వల్ల రూ.344 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినా 34 రూపాయలు కూడా జిల్లాకు విడుదల కాలేదని విమర్శించారు. బాధిత రైతులకు తక్షణమే ఎకరాకు రూ.25 వేల సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సైతం జిల్లావైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. జిల్లాలో కోతకు గురైన రోడ్లు, గండ్లు పడిన కాల్వలు, చెరువుల మరమ్మతు పనులను కూడా ప్రారంభించలేదని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్‌లో భూముల ధరలు తగ్గాయి కానీ మద్యం ధరలు, ఆర్టీసీ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తే హామీలపై నిలదీయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. ఎక్కడైనా బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఒక్కొక్కరి సంగతి చూస్తామని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని, అది పేదల పార్టీ కాదని, ధనవంతుల పార్టీ అని విమర్శించారు. రాష్ట్రంలో వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు కేంద్ర నిధులు తేవడం లేదని ప్రశ్నించారు. రైల్వే ప్రాజెక్టులకు సహా తెలంగాణకు నిధుల కేటాయింపులో మోదీ సర్కారు వివక్ష చూపుతున్నా రేవంత్ ప్రభుత్వం గట్టిగా నిలదీయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బడుగుల గొంతుక కాకా వెంకటస్వామి

» ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

» భట్టి, మహేశ్ గౌడ్, పలువురు మంత్రులు



ట్యాంక్‌బండ్‌పై వెంకటస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహేశ్ గౌడ్, మంత్రులు పొన్నం, వివేక్, వాకిటి తదితరులు

కవాడిగూడ/రవీంద్రభారతి/న్యూఢిల్లీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల గొంతుక గడ్డం వెంకటస్వామి (కాకా) అని.. ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వక్తలు కొనియాడారు. కాకా సేవలు చిరస్మరణీయమని.. ఆయన ఆశయాల సాధనకు యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం గడ్డం వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటు రవీంద్రభారతిలోనూ తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాకా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కేంద్రమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా కాకా చేసిన సేవలు మరువలేనివని భట్టి అన్నారు. దేశంలో కార్మికుల ఉన్నతికి పాటుపడ్డారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో నీతి, నిజాయతీలకు నిలువుటద్దం కాకా అని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో కాకా తనను ఎంతో ప్రోత్సహించి, ప్రేరణ కలిగించారని శ్రీధర్‌బాబు గుర్తు చేసుకున్నారు. పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ సాధనే ధ్యేయంగా కాకా పనిచేశారని.. మలిదశ ఉద్యమంలో తనకు, వివేక్ వెంకటస్వామికి సలహాలు, సూచనలిచ్చారన్నారు. అత్యంత పేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగిన మహోన్నత వ్యక్తి కాకా అని జూపల్లి కొనియాడారు. తెలంగాణ సాధన కోసం చివరి దాకా పోరాడారన్నారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తన తండ్రి (కాకా)ని ఆదర్శంగా తీసుకునే రాజకీయాల్లోకి వచ్చానని.. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కాగా, కాకా జయంతి వేడుకలు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ నిర్వహించారు. భవన్ రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్, ప్రభుత్వ కార్యదర్శి (సమన్వయం) గౌరవ్ ఉప్పల్ సహా అధికారులు, సిబ్బంది కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

పలు జిల్లాల్లో జోరు వాన

- ముులుగు జిల్లా ఏటూరునాగారంలో 10 సెం.మీ
- భూపాలపల్లి జిల్లాలో పిడుగు పడి మహిళ మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం జోరు వాన కురిసింది. ఉమ్మడి కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. జగిత్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత కురిసింది. ఎండపల్లిలో 8.3 సెం.మీ, మల్యాల మండలం ముద్దుట్లలో 6.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. సైదాపూర్ మండలం వెన్కేపల్లి, తిమ్మాపూర్ మండలం రేణికుంటలో 6.4 సెం.మీ. వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వాన దంచి కొట్టింది. సిరిసిల్లలో 6.4 సెం.మీ, కోనరావుపేటలో 6 సెం.మీ వర్షం కురిసింది. పెద్దపల్లి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బషీరాబాద్ మండలంలో 7 సెం.మీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్ లోని. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో 5.7 సెం.మీ వర్షం కురిసింది. కాగా, పిడుగు పాటుతో మహిళా కూలీ మృతి చెందింది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుమ్మళ్లపల్లికి చెందిన ఇసునం లక్ష్మి(50) పత్తి చేనులో పని చేస్తుండగా పిడుగు పడి మృతి చెందింది. మహాముత్తారం మండలం బోర్లగూడెంలో పిడుగుపాటుకు గురై దుక్కిటెద్దు మృతి చెందింది.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 10 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.



పెద్దపల్లి జిల్లా ఓదెలలో నీట మునిగిన వరి పంట

వరదలతో దుర్గమ్మ గుడికి భారీ నష్టం

50 రోజులుగా జలదిగ్బంధంలో ఆలయం

పాపన్నపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వరదలతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల దుర్గామాత ఆలయానికి భారీ నష్టం వాటిల్లింది. ఆలయ మండపం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రిల్స్ లడ్డూ కౌంటర్, రేకుల పైకప్పు, క్యూలైన్లు వరదలో కొట్టుకుపోయాయి. మండపంలో వేసిన టైల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. అమ్మవారి ఆలయంలో ఉన్న ప్రతీ వస్తువుకు నష్టం వాటిల్లింది. తిరిగి పూర్వ వైభవం రావాలంటే సుమారు రూ.50 లక్షల పైచిలుకు ఖర్చు చేయాల్సి ఉంటుందని భావిస్తున్నారు. 50 రోజులపాటు ఆలయం జలదిగ్బంధంలో ఉండటంతో దుర్గామాత రాజగోపురంలోనే అమ్మవారికి పూజలు నిర్వహించారు. వరదలను దృష్టిలో పెట్టుకొని సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకుంటే కొంతమేరే నష్టం జరిగేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈవో చంద్రశేఖర్‌కు వేరే అదనపు బాధ్యతలు ఉండటంతో ఏడుపాయలకు వారానికి ఒకసారి వస్తున్నారని, పూర్తిస్థాయి ఈవోను నియమించాలని భక్తులు కోరుతున్నారు.



బీసీ అఖిలపక్ష నేతల సమావేశంలో అభివాదం చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఆర్.కృష్ణయ్య, బండారు దత్తాత్రేయ తదితరులు

బీసీ రిజర్వేషన్ల కోసం మహోద్యమం

- కోర్టులను ఆశ్రయిస్తూనే ప్రజా పోరాటాలు
- బీసీ అఖిలపక్ష నేతల సమావేశంలో తీర్మానం

ఖైరతాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించడంపై బీసీ అఖిలపక్ష నేతలు భగ్గుమన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా పోరాడుతూనే తెలంగాణ ఉద్యమం మాదిరిగా పోరాటానికి సిద్ధం కావాలని తీర్మానించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్డీకపూల్‌లోని అశోకా హోటల్‌లో బీసీ ప్రజా ప్రతినిధుల, బీసీ కుల సంఘాల, అఖిలపక్ష సమావేశం ఎంపీ ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల సాధన పోరాటానికి ఇదే సరైన సమయమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గదని తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలయ్యేలా అందరం కలసి పని చేయాలని మాజీ గవర్నర్ దత్తాత్రేయ అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటాయని, ఇక్కడ కూడా రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీ, పార్లమెంట్‌లో కృషి జరగాలని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో పోరాడుతూనే ప్రజా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్లే మన వద్ద అమలయ్యేలా బీసీలు ఐక్యంగా పోరాడాలని మాజీ ఎంపీ వీహెచ్ అన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మల్కా కొమురయ్యతో పాటు కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.



భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందిస్తున్న వయోధిక జర్నలిస్టులు

రిటైర్డు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

- డిప్యూటీ సీఎంకు వయోధిక జర్నలిస్టుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవాలక్ష్యంతో దశాబ్దాలుగా మీడియా సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వయోధిక జర్నలిస్టుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం కలిసిన వయోధిక జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు పెన్షన్ సౌకర్యం విస్తరణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు, బస్సు పాసులు జారీ చేయాలని, రిటైర్డ్ జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఆరోగ్య వైద్య బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. రిటైర్డు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పనకు ప్రజాప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో వయోధిక జర్నలిస్టుల సంఘం నేతలు కేశవరావు, లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీనివాసరావు, సి కేశవులు, ఫాజిల్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ఏపీపీ పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును వారం రోజుల పాటు పొడిగిస్తున్నట్లు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని గతంలో ప్రకటించినా వరుస సెలవుల నేపథ్యంలో రిజిస్టర్ చేసుకున్న వారిలో 30 శాతం మంది మాత్రమే దరఖాస్తు చేశారని తెలిపారు. 118 పోస్టులకుగాను 7,183 మంది రిజిస్టర్ చేసుకోగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు 2,193 మంది మాత్రమే దరఖాస్తు చేశారని, దీంతో దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ సాయంత్రం అయిదు గంటల వరకు పొడిగిస్తున్నామని వివరించారు.

ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బీ-ఫార్మసీ, ఫాం-డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ రాసిన బైపీసీ విద్యార్థుల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఆదివారం నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 8వరకు కొనసాగనుంది. 9 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 10 వరకు ఆప్షన్ల ఎంపికకు గడువిచ్చారు. ఈ నెల 13లోపు తొలి విడతలో ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామని ఎప్‌సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు.

నేటి నుంచి ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఇదే రోజు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, మంగళవారం వరకు ఆప్షన్ల ఎంపికకు గడువిచ్చారు. ఈనెల 10లోపు తుది జాబితా విడుదల చేస్తామని టీజీఐసెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు.

పొన్నం కామెంట్ల కలకలం!

- మంత్రి అడ్లూరిని ఉద్దేశించిన వ్యాఖ్యలుగా ప్రచారం

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్నప్పుడు సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ దురుసు వ్యాఖ్యలు చేసినట్లుగా ఆదివారం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కెమెరాలో రికార్డు కాగా.. ప్రెస్‌మీట్‌కు అడ్లూరి ఆలస్యం కావడంపైనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వైరల్ అయింది. అయితే ఈ ప్రచారాన్ని మంత్రి పొన్నం ఓ ప్రకటనలో ఖండించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా.. మంత్రి అడ్లూరిని తాను అనని మాటలను అన్నట్లుగా వక్రీకరించి ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. అడ్లూరి అంటే తనకు గౌరవమని ఆయన పేర్కొన్నారు.

8 కారిడార్లు ఒకేసారి!

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 162.9 కిలోమీటర్ల పనులకుగాను రూ.43,847.22 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టులో 48 శాతం వాటా కింద అంతర్జాతీయ బ్యాంకుల నుంచి 2-4 శాతం వడ్డీతో రుణాలు సేకరించనుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం సావరీన్ గ్యారంటీ ఇవ్వడంతో పాటు తన వంతు వాటాగా 18 శాతం నిధులు సమకూర్చనుంది. ఇక ఎల్అండ్‌టీ నుంచి మొదటి దశ కారిడార్లను టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో రెండో దశలో ప్రతిపాదించిన అన్ని కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌లకు కేంద్రం నుంచి అనుమతి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీలోని వివిధ శాఖల మంత్రులను పలు దఫాలుగా కలిసి రెండో దశ విస్తరణ ప్రాధాన్యాన్ని వివరించారు.

8 కారిడార్లకు వేర్వేరుగా టెండర్లు..

ఎల్అండ్‌టీతో తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, నెట్ వర్కింగ్, టికెట్ ధరలన్నీ ఒకే గొడుగు కింద ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు ఎల్అండ్‌టీతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను కేంద్రానికి త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్రం నుంచి డీపీఆర్‌లకు గ్రీన్‌సిగ్నల్ లభించిన వెంటనే 8 కారిడార్లకు వేర్వేరుగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఒకే టెండర్ కింద అన్నింటినీ నిర్వహిస్తే పనులన్నీ ఆలస్యమవుతాయని భావిస్తోంది. దీంతో ఒక్కో సంస్థకు ఒక్కో కారిడార్‌ను అప్పగించి పూర్తి చేయించాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తక్కువ దూరం కలిగిన ఎల్బీనగర్-హయత్‌నగర్ (7.1 కిలోమీటర్లు), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కిలోమీటర్లు), రాయదుర్గం-కోకాపేట్ నియోపోలీస్ (11.6 కిలోమీటర్లు) పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రెండో దశలోని పార్ట్-ఏలో ప్రతిపాదించిన ఓల్డ్‌సిటీ కారిడార్‌కు ఆస్తుల సేకరణ ఇప్పటివరకు 65 శాతం పూర్తయింది. ఈ నెలాఖరులోగా మిగతా ఆస్తులను సేకరించి టెండర్ పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



తగ్గనున్న మెట్రో డిపోలు..

మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. మొదటి దశ కోసం సుమారు 90 ఎకరాల్లో ఉప్పల్, మియాపూర్ మెట్రో డిపోలను నిర్మించారు. అయితే రెండో దశలో నిర్మించనున్న 5 మార్గాల (ఎల్బీనగర్-హయత్‌నగర్, మియాపూర్-పటాన్‌చెరు, రాయదుర్గం-కోకాపేట నియోపోలీస్, నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట)కు పాత డిపోలనే వినియోగించే అవకాశం ఉంది. మిగిలిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు-భారత్ ఫ్యూచర్ సిటీ, ప్యారడైజ్-మేడ్చల్, ప్యాట్నీ-శామీర్‌పేట మెట్రో మార్గాలకు కొత్తగా రెండు మెట్రో డిపోలను నిర్మిస్తే సరిపోతుందని మెట్రో అధికారులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవంగా మెట్రో డిపోల ఏర్పాటు కోసం సుమారు 100 ఎకరాల భూమి, నిర్మాణాల కోసం రూ.వందల కోట్ల నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే మొదటి దశలో ఇప్పటికే నిర్మించిన 2 డిపోల్లో మరిన్ని మెట్రో రైళ్లను పార్కింగ్ చేసుకొని, నిర్వహణ పనులు చేసుకునే అవకాశం ఉండడంతో డిపోల సంఖ్య తగ్గుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

కియోలిస్ ఆధ్వర్యంలోనే రైళ్ల ఆపరేషన్స్..!

ఫ్రాన్స్‌కు చెందిన కియోలిస్ గ్రూపు అనుబంధ సంస్థగా ఉన్న కియోలిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా మెట్రో రైళ్ల ఆపరేషన్స్ మెయింటెనెన్స్ సేవలు అందిస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు నిర్మించిన ఎల్అండ్‌టీతో జత కట్టి 8 ఏళ్లుగా మెట్రో రైళ్లను నిర్వహిస్తోంది. తాజాగా మహారాష్ట్రలోని పుణె నగరంలో ఉన్న మెట్రోలైన్-3ని నిర్వహించే కాంట్రాక్టును పొందింది. మెట్రో రైళ్ల నిర్వహణలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న కియోలిస్ గ్రూపు హైదరాబాద్, పుణెతోపాటు లండన్, దోహా, దుబాయ్, షాంఘై, పారిస్‌లోనూ మెట్రో రైళ్ల సేవలను ప్రయాణికులకు అందిస్తోంది. మెట్రో రైళ్ల ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిన తర్వాత చేపట్టే ఆపరేషన్స్ మెయిన్‌టెనెన్స్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో కియోలిస్ అగ్రగామి సంస్థగా ఉంది. అయితే ఎల్అండ్‌టీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా కియోలిస్ 2026 వరకు పనిచేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటిదశ మెట్రోను పూర్తిగా తీసుకుంటున్న తరుణంలో ఆపరేషన్స్ నిర్వహణ బాధ్యతలను కూడా కియోలిస్‌కే అప్పగించనుంది.

లోకం తీరు



బ్రాహ్మణ సంఘాలు ఏకమైతే ఏదైనా సాధ్యం

ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు

మన్సూరాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు అనుకుంటే ఏదైనా సాధించగలరని, బ్రాహ్మణ సంఘాలన్నీ ఏకం కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. నాగోల్ బండ్లగూడలో బాస్(బ్రాహ్మిన్ ఆర్గనైజేషన్స్ ఫర్ సోషల్ సర్వీస్) ఆధ్వర్యంలో బ్రాహ్మణ మేధావుల సమావేశం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వేణుగోపాల్ రావుతో పాటు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి హాజరయ్యారు. అనేక పోరాటాల్లో బ్రాహ్మణులు కీలకంగా వ్యవహరించారని, నేడు తమ హక్కుల సాధనలో ఆ పోరాట పటిమ తగ్గిందన్నారు.

జంటనగరాలపై రేవంత్ సర్కార్‌కు కక్ష

అందుకే సిటీబస్ చార్జీల పెంపు: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన నాటినుంచి హైదరాబాద్ జంటనగరాల ప్రజలపై రేవంత్‌రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే ఆర్టీసీ బస్‌చార్జీల రేట్లు అత్యధికంగా పెంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జంటనగరాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తిరస్కరించారనే కసితోనే సీఎం ప్రతీకార చర్యలకు దిగుతున్నారని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రాజధానివాసుల నడ్డివిరిచేలా ప్రతినిత్యం దాదాపు రూ.కోటి భారాన్ని మోపాలని చూస్తున్న ఆయనకు నగర ప్రజలపై ఎంత కక్ష ఉందో స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు, టీ-24టికెట్ చార్జీలను పెంచి.. ఇప్పుడు కనికరంలేకుండా కనీస చార్జీపై 50% ధరలను పెంచడం రేవంత్‌రెడ్డి అసమర్థ, అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే అగ్గిరాజేస్తాం!

- జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయబద్ధంగా రావాల్సిన 42% రిజర్వేషన్ల అమలును కుయుక్తులు, కుతంత్రాలతో అడ్డుకునే శక్తులను ఉపేక్షించేది లేదని, బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే రాష్ట్రవ్యాప్తంగా బీసీలంతా ఐక్యమై అగ్గిరాజేస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. హైకోర్టు, సుప్రీంకోర్టులలో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచడం వల్ల తెలంగాణలో ఏ సామాజిక వర్గానికి నష్టంలేకున్నా.. బీసీ రిజర్వేషన్లను ఎలాగైనా అడ్డుకోవాలని తెరవెనుక కొన్ని శక్తులు కుటిల ప్రయత్నాలు మొదలుపెట్టాయని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మండిపడ్డారు. కుట్రలో భాగంగానే రెడ్డి జాగృతికి చెందిన మాధవరెడ్డి, గోపాల్ రెడ్డిలను ముందుపెట్టి బీసీ రిజర్వేషన్లకు గండిగొట్టాలని, బీసీలను రాజకీయంగా అణచివేయాలనే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను రక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న రాష్ట్రవ్యాప్తంగా పూలే, అంబేడ్కర్ విగ్రహాల ఎదుట శాంతియుతంగా ప్రదర్శనలు నిర్వహించాలని బీసీ సంఘాలకు ఆయన పిలుపునిచ్చారు.

చాగంటి కోటేశ్వరరావుకు సాహితీ పురస్కారం

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ప్రవచన రత్నాకర డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుకు ప్రదానం చేయనున్నారు. ఈ నెల 23న సాయంత్రం 6గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో దీన్ని ప్రదానం చేస్తారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ పురస్కారాన్ని అందజేస్తారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు.



భువనగిరి బైపాస్ రహదారి మీదుగా హైదరాబాద్ వైపు వెళుతున్న వాహనాలు



బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

పండగైపోయింది.. పోదాం పద..!!

హైదరాబాద్‌కు చేరుకునే మార్గాలన్నీ కిటకిట.. సెలవులు ముగియడంతో స్వస్థలాల నుంచి తిరుగుప్రయాణాలు

- విజయవాడ- హైదరాబాద్ హైవే సహా అన్ని రహదారులపై భారీ ట్రాఫిక్

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి, బీబీనగర్, కొండపాక, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల ముగిశాయి. పాఠశాలలు, కళాశాలలకు ఇచ్చిన సెలవులు, ఉద్యోగులకు వారాంతపు సెలవులు కూడా పూర్తయ్యాయి. అంతే.. పండగకు ఊరెళ్లిన హైదరాబాద్ వాసులంతా తిరిగి రాజధాని బాటపట్టారు. తెలంగాణలోని జిల్లాలతో పాటు ఏపీలోని తమ స్వస్థలాలకు వెళ్లిన వారంతా తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శనివారం నుంచే ఈ తిరుగు ప్రయాణాల రద్దీ ప్రారంభమవ్వగా .. రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్‌కు చేరుకునే రహదారులన్నీ ఆదివారం మరింత రద్దీగా మారాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతోపాటు కార్లతో జాతీయ, రాష్ట్ర రహదారులపై విపరీతమైన ట్రాఫిక్ కనిపించింది. టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి చాలా రద్దీగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో రెండు కిలోమీటర్ల పొడవున వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా మీదుగా సాధారణ రోజుల్లో 30వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ, ఆదివారం 45వేలకు పైగా వాహనాలు ప్రయాణించాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోపక్క, వరంగల్-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి శనివారం నుంచే రద్దీగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద సాధారణ రోజుల్లో 21వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కానీ, ఆదివారం 30వేలకు పైగా వాహనాలు రాకపోకలు జరిగాయని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా నుంచి ఆదివారం 15వేల వాహనాలు ప్రయాణించాయి. వాహనాల సంఖ్య విపరీతంగా ఉండడంతో హైదరాబాద్ లేన్‌లో టోల్‌ప్లాజా నుంచి కిలోమీటరు దూరంలోని కొర్లపహాడ్ బస్టాప్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. మరోపక్క, సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇక, హైదరాబాద్‌ను చేరుకునే మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ఎక్కడికక్కడ చర్యలు తీసుకున్నారు. కాగా, దసరా పండుగ తిరుగు ప్రయాణాల రద్దీ దృష్ట్యా ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 1050 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశామని టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. ఇందులో అత్యధికంగా వరంగల్ రీజియన్ నుంచి 229, కరీంనగర్ నుంచి 211, నల్లగొండ నుంచి 137 ప్రత్యేక సర్వీసులను నడిపామని తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సోమవారం కూడా ప్రత్యేక సర్వీసులు నడుపుతామని పేర్కొంది.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నాటకాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తీర్మానించింది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలుకు పార్టీ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎంపీలు, ఎమ్మెల్యేలకు జిల్లాల బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రచార వ్యూహం అమలు చేయాలని.. అందరూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. కలిసికట్టుగా పని చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. 'మనది టీం బీజేపీ. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా సత్తా చాటుదాం. ప్రత్యర్థుల ఎత్తులను తిప్పికొడదాం' అని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచితీరదామన్నారు. అందరినీ కలుపుకొని వెళదామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వార్డు ఎన్నికనూ కీలకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు గతంలో పనిచేసిన జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పదాధికారులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. వారిని కూడా జడ్పీటీసీ ఇన్‌చార్జులుగా, జిల్లా ఇన్‌చార్జులుగా నియమించాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఈ నెల 8న మరోసారి విస్తృత సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతంరావు తెలిపారు. సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. మోదీ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలంటే స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.

ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం: వెంకటరమణారెడ్డి

పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయ లోపం ఏర్పడిందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి కూర్చోలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నట్లు సమాచారం. 'సమావేశాలకు రావడం, వెళ్లడం.. ఇదేనా మా పని? క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు ఎక్కడ?' అని అని వెంకటరమణారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ ఆఫీసులో కార్యక్రమాలు నిర్దేశించినా, క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదని పేర్కొన్నట్లు సమాచారం. తన నియోజకవర్గ పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుల తీరు పట్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీలో సమన్వయం ఉండాల్సింది పోయి, కనీస సమాచారం కూడా లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎలా? అని ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.



ఎర్రగడ్డలో మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఇందిరమ్మ రాజ్యంలో మైనార్టీలకు అండ

» జూబ్లీహిల్స్‌లో ఖబ్రస్థాన్‌కు స్థలం: మంత్రి అడ్లూరి

హైదరాబాద్/ఎర్రగడ్డ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో మైనార్టీలకు అండగా ఉంటున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్‌లో ముస్లింల కోసం ఖబ్రస్థాన్ స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలను విడుదల చేసిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం రహమత్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మైనార్టీ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. ఖబ్రస్థాన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, లైటింగ్, డ్రైనేజీ, రోడ్లు, నీటి సదుపాయాలతో పాటు బౌండర్ వాల్ నిర్మిస్తామని పేర్కొన్నారు. కాగా, హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మైనార్టీస్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ కళాశాల మైనార్టీల విద్యాపునరుజ్జీవనంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిల చెల్లింపునకు చర్యలు

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉపకారవేతనాల పెండింగ్ బకాయిలు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి హైదరాబాద్‌కు రాగానే ఆయనతో సమావేశమై ఆ బకాయిలపై చర్చిస్తానన్నారు. వీలైనంత త్వరలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు రావాల్సిన డబ్బులు అందిస్తామన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఉపకార వేతనాలు వచ్చేదాకా రావొద్దు!' శీర్షికన ప్రచురితమైన కథనంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత తొందరలో బకాయిలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే.. పూర్తిస్థాయిలో పెండింగ్ బకాయిలు విడుదల అయ్యేంత వరకు తాము విద్యార్థులను పాఠశాలలకు రానివ్వబోమని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వల్ల తమ పిల్లల చదువులకు ఇబ్బంది ఎదురవుతుందని.. పాఠశాలలకు అనుమతించాలని కొందరు తల్లిదండ్రులు ఆదివారం మేనేజ్‌మెంట్‌లను సంప్రదించినట్లు తెలిసింది.

కల్లు ధర తగ్గించాలి

» వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో ధర్నాకు దిగిన కల్లు ప్రియులు

పెద్దేముల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేయడం సహజమే, కానీ కల్లు ధర తగ్గించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించిన ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రామంలో జరిగింది. తాండూరు-కోట్‌పల్లి రహదారిపై కల్లు ప్రియులు ఈ వినూత్న నిరసనకు దిగారు. పెద్దేముల్ మండలంలో ఇప్పటివరకు ఒక్కో కల్లు సీసాను రూ.10కి విక్రయించేవారు. అయితే, కల్లు వ్యాపారులు ఇటీవల అన్ని ఖర్చులు పెరిగాయని కారణం చూపి రూ. 15కు సీసా విక్రయించడం మొదలుపెట్టారు. పెరిగిన ధరలపై కల్లు ప్రియులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కల్లు దుకాణదారులతో వాగ్వాదానికి దిగడంతో, వ్యాపారులు జనగాం, పెద్దేముల్‌తోపాటు మరికొన్ని గ్రామాల్లో విక్రయాలు నిలిపివేశారు. దీంతో కల్లుకు బానిసలుగా మారిన కొందరు తట్టుకోలేక, ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రోడ్డుపై బైఠాయించడం, ధర్నాలు చేయడం నిషేధమని చెప్పి వారిని అక్కడి నుంచి పంపించారు.



పత్తికొండ మార్కెట్ యార్డ్‌కు వచ్చిన టమాటా

టమాటా కిలో రూ.4

» పత్తికొండ మార్కెట్‌లో పతనమైన ధరలు

» రోడ్డుపై పారబోసి నిరసన తెలిపిన రైతులు

పత్తికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధరలు పతనమయ్యాయి. కిలో టమాటా ధర మరీ ఘోరంగా రూ.4కి పడిపోయింది. పది కిలోల గంపలు రెండింటికి రూ.80 నుంచి రూ.100కు మించి ధర పలకలేదు. వ్యాపారులు 25 కిలోల గంపలు రెండు కనిష్ఠంగా రూ.180కి కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. దసరా సందర్భంగా 1, 2వ తేదీల్లో మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. దీంతో రెండు రోజుల నుంచి కోతకు సిద్ధంగా ఉన్న పంటను రైతులు మార్కెట్ తీసుకొచ్చారు. శనివారం మార్కెట్‌కు 5.5 టన్నులు దాటి అమ్మకానికి రావడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసినా రైతులు పట్టించుకోలేదు. అయితే ఆదివారం కూడా తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో ఆగ్రహించి ధర్నా చేపట్టారు. దిగుబడులు అధికంగా రావడం, డిమాండ్ లేకపోవడంతో పాటు గ్రేడింగ్ లేని టమాటా రావడంతో ధరలు తగ్గాయని పత్తికొండ మార్కెట్ యార్డ్ కార్యదర్శి కార్నలీస్ చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ యార్డు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఆదివారం సుమారు 6.5 టన్నుల టమాటాను రైతుల నుంచి కిలోకు రూ.6 చెల్లించి కొనుగోలు చేశామని చెప్పారు. రైతులు గ్రేడింగ్ చేసిన పంట తీసుకొస్తే కచ్చితంగా గిట్టుబాటు ధర అందిస్తామని అన్నారు.



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో డీజీపీ శివధర్‌రెడ్డి దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న వేద పండితులు

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

నృసింహుడిని దర్శించుకున్న 46 వేల మంది భక్తులు

సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్న డీజీపీ శివధర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక, ధర్మదర్శనం క్యూలైన్లు భక్తులతో రాత్రి వరకు రద్దీగా కనిపించాయి. ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. 46వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.50,54,516 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. మరోవైపు డీజీపీ శివధర్‌రెడ్డి సతీసమేతంగా లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నాక గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు.

'జూబ్లీహిల్స్'కు నలుగురి పేర్లు!

» ప్రతిపాదించిన ఇన్‌చార్జి మంత్రులు

» జాబితాను 3 పేర్లకు కుదించే అవకాశం

» ఉప ఎన్నిక ప్రచారంపై మీనాక్షి, మహేశ్‌గౌడ్ సమీక్ష

హైదరాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి నలుగురు నేతల పేర్లను ఇన్‌చార్జి మంత్రులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలు నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్‌ల పేర్లను వారు ప్రతిపాదించినట్లు సమాచారం. గెలిచే అవకాశం ఉన్న నేతల పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు పేర్లను ప్రతిపాదిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు వారు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ ఆదివారం ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో భేటీ అయ్యారు. సీఎం రేవంత్ సూచన మేరకు జరిగిన ఈ భేటీలో ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణతోపాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రతిపాదించిన నాలుగు పేర్ల పైనా ప్రాథమికంగా చర్చించారు. దీనిపై సోమవారం లేదా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్, మంత్రి ఉత్తమ్ సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. సర్వేలు, నివేదికల ఆధారంగా ఆశావహుల జాబితాను షార్ట్‌లిస్ట్ చేసి మూడు పేర్లతో అధిష్ఠానానికి ప్రతిపాదన పంపనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్న తీరుపై మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్ ఆదివారం ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల, డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎన్నికల ప్రచారం వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా పార్టీ, సిద్ధాంతం కేంద్రీకృతంగా సాగాలని మహేశ్‌గౌడ్, మీనాక్షి సూచించారు. అభ్యర్థిని సర్వేల ఆధారంగా అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.



సమీక్షలో మహేశ్‌గౌడ్, మీనాక్షి, తుమ్మల తదితరులు

సుప్రీం సస్పెన్స్!

(మొదటిపేజీ తరువాయి)

ఉందని, ఇందులో రాజీపడే ప్రసక్తేలేదని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తామని, ఆ దిశగా ముందుకెళ్లాలని సీనియర్ న్యాయవాదుల ఎదుట చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని సూచించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా సహా ఇతర కేసులగురించి చర్చించినట్టు సమాచారం.

ఢిల్లీకి భట్టి విక్రమార్క, పొన్నం, వాకిటి..

జీవో 9కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆదివారం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. వారి వెంట బీసీ సంక్షేమం, సంబంధిత శాఖల అధికారులు కూడా ఉన్నారు. జీవో 9కి అనుకూలంగా ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీతో వారు భేటీ కానున్నారు. కులగణన సర్వే మొదలుకుని జీవో 9 జారీకి దారి తీసిన పరిస్థితులు, ఇతర అంశాలను ఆయనకు వివరించనున్నారు. కాగా, మంత్రుల బృందం ఆదివారం రాత్రి సుప్రీంకోర్టులో తెలంగాణ స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్‌కుమార్‌తో సమావేశమై చర్చలు జరిపింది. కాగా, సుప్రీంలో పిటిషన్ దాఖలైన వెంటనే బీసీ సంక్షేమ శాఖ అధికారుల బృందం ఢిల్లీకి చేరుకుంది. బీసీ రిజర్వేషన్లు, అమలు, కొత్త జీవో తదితర అంశాలపై న్యాయవాదులతో చర్చించింది.

సుప్రీంకోర్టు స్పందనపై నేతల్లో ఉత్కంఠ..

జీవో 9ని కొట్టివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందన ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ అధికార కాంగ్రెస్ నేతల్లో నెలకొంది. ఇప్పటికే జీవో 9ని వ్యతిరేకిస్తూ హైకోర్టులోనూ పిటిషన్ దాఖలు కాగా.. దానిపై ఈ నెల 8న విచారణ జరగనుంది. అయితే ఆ జీవోకు మద్దతుగా ప్రజాప్రతినిధులు, సంఘాలతో హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేయించేందుకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోంది. ఈ ప్రయత్నాలు ఇలా కొనసాగుతుండగానే.. సుప్రీంకోర్టులోనూ జీవో 9కి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలైంది. దీంతో ఈ కేసు ఇప్పటికే హైకోర్టులో విచారణలో ఉన్నందున.. అక్కడే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు చెబుతుందా? లేక ఏదైనా సూచన చేస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా ఇచ్చిన ఈ జీవో.. చట్ట విరుద్ధమంటూ పిటిషన్‌దారు పేర్కొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించడంలో న్యాయవాదులకు సహకారం అందించేందుకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అధికారులు ఢిల్లీకి వెళ్లారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఎన్నికలపై ముందుకే..!

జీవో 9పై న్యాయస్థానాల స్పందన ఎలా ఉన్నా.. ఎన్నికలపై ముందుకే వెళ్లాలన్న యోచనలో రాష్ట్రప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జీవో 9 పట్ల కోర్టులు సానుకూలంగా స్పందిస్తే ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం జరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ కోర్టుల స్పందన ప్రతికూలంగా ఉంటే.. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం ప్లాన్-బీ సిద్ధం చేసుకుని ఉన్నట్లు చెబుతున్నారు. జీవో 9 రాజ్యాంగ విరుద్ధమని, రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఒకవేళ సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పినా, లేక ఈ నెల 8న హైకోర్టు ఇలా సూచించినా.. తమ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లు ప్రకటించి ఎన్నికలపై ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే సాంకేతికంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది కాబట్టి.. ఎన్నికల షెడ్యూల్‌ను రీ షెడ్యూల్ చేయాల్సి రావచ్చునని అంటున్నారు.




ఢిల్లీలో సమావేశమైన భట్టి, పొన్నం, వాకిటి తదితరులు

'జీవో 9తో ప్రాథమిక హక్కులకు భంగం'

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ ఈ నెల 4న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వంగా గోపాల్‌రెడ్డి.. అందులో పలు అంశాలను ప్రస్తావించారు. "బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో 9ని తీసుకొచ్చింది. అయితే ఇప్పటికే ఎస్సీలకు అమల్లో ఉన్న 15%, ఎస్టీలకు 10 శాతంతో కలిపి రిజర్వేషన్లు 67 శాతానికి చేరుతాయి. ఇది ముమ్మాటికీ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285కు విరుద్ధం. జీవో 9 ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుంది. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. అయితే, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేస్తే తీవ్ర నష్టం జరిగే ప్రమాదంఉంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే ఇవకాశాలు తక్కువగా ఉన్నందున నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించాం. అత్యవసర పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జీవో అమలుపై స్టే ఇవ్వండి" అని గోపాల్‌రెడ్డి పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

ఒక మతంపై ద్వేషం రగిలించడం అన్యాయం

» విద్యావేత్త, చరిత్రకారుడు రామ్ పునియాని



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): 'చరిత్రలో రాజులు, మతం, రాజ్యకాంక్ష కలగలసి ఉన్నాయి. వాటిని మన రాజకీయ ప్రయోజనాల కోసం వేర్వేరుగా చిత్రీకరించి ఒక మతంపై ద్వేషాన్ని రగిలించడం అన్యాయం' అని ప్రఖ్యాత విద్యావేత్త, చరిత్ర కారుడు రామ్ పునియాని అన్నారు. మహారాణా ప్రతాప్, అక్బర్ మధ్య సాగిన పోరులో అక్బర్ విజయం సాధించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతుంటే, రాణా ప్రతాప్ గెలిచినట్లుగా రాజస్థాన్ ప్రభుత్వం చరిత్ర మార్చి రాయించిందని పేర్కొన్నారు. ఔరంగజేబు పది దేవాలయాలను ధ్వంసం చేస్తే, కామాఖ్య, మహాకాళేశ్వర్ వంటి యాభైకుపైగా దేవాలయాలకు విరాళాలు ఇచ్చాడని రిచర్డ్ ఈటెన్ రీసెర్చ్ ట్రస్ట్ పరిశోధనలోనూ వెల్లడైందని వివరించారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని మదీనా విద్యాలయం ప్రాంగణంలో 'పాఠ్యాంశాల్లో చరిత్ర వక్రీకరణ -పరిణామాలు' అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్ పునియాని మాట్లాడుతూ మన దేశంలో ఇస్లాం వ్యాప్తికి అంటరానితనం లాంటి దురాచారాలు ప్రధాన కారణమని విశ్లేషించారు. 'భారతదేశంలోకి ఇస్లాం రావడమన్నది అణగారిన కులాల విముక్తి ఉద్యమం లాంటిదని స్వామి వివేకానంద అన్నారని ఉటంకించారు. తెలంగాణ విద్యా కమిషన్ అధ్యక్షుడు ఆకునూరి మురళి మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని పూర్తిగా తిరస్కరించనవసరం లేదని, అలా అని స్వాగతించలేమని అన్నారు. ఆచార్య పద్మజా షా, ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ జాతీయ బాధ్యురాలు డా. కాంచన్, రాష్ట్ర అధ్యక్షుడు లతీఫ్, ఉపాధ్యక్షురాలు మరియ తబస్సుమ్ తదితరులు మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో అబద్ధాల చరిత్ర జోడించడం ద్వారా విద్యార్థుల మనసుల్లో ద్వేష బీజాలు నాటుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏసీబీ జోరుకు..

అనుమతుల కళ్లెం!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. పదోన్నతులు ఇవ్వడం లేదంటూ సదరు ఉద్యోగులు హైకోర్టులో కేసు వేసినప్పుడు.. ఏసీబీ కేసు పెండింగ్‌లో ఉండటం వల్లే పదోన్నతి ఇవ్వడం లేదని ఉన్నతాధికారులు కోర్టుకు చెప్పకపోవడమే దీనికి తార్కాణమనే విమర్శలు వస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీశ్‌బాబు.. 2017లో కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సమయంలో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. జగదీశ్‌బాబుపై ప్రాసిక్యూషన్ కోసం సంబంధిత శాఖ ఉన్నతాధికారి నుంచి ఏసీబీకి అనుమతి రాలేదు. ఈ క్రమంలో కీలక పోస్టింగ్ దక్కించుకున్న ఆయన.. ఈ ఏడాది జూలైలో మరో కాంట్రాక్టర్ నుంచి రూ.90వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి మళ్లీ పట్టుబడ్డారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇలాంటి అధికారులు చాలా మంది ఉన్నారని అధికార యంత్రాంగంలోనే చర్చ జరుగుతోంది. ప్రజావేగులు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతుంది.

పావు వంతు కూడా అనుమతులు రాక..

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు ఏసీబీ అధికారులు 203 కేసుల్లో ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి కోరుతూ లేఖలు పంపారు. అందులో పావువంతు కూడా అనుమతులు రాలేదని తెలిసింది. గత ఏడాది కూడా 152 కేసుల్లో 223 మందిని అరెస్టు చేసిన ఏసీబీకి సగం కేసుల్లో కూడా ప్రాసిక్యూషన్ చర్యలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాలేదని సమాచారం. దీనితో ఆ కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేయలేక పోతుమని ఏసీబీ అధికారులు వాపోతున్నారు. అంతేకాదు ఏళ్లకేళ్ల జాప్యం తర్వాత శాఖాధికారుల నుంచి అనుమతులు వచ్చి, చార్జిషీట్లు దాఖలు చేసినా.. కోర్టు విచారణ పూర్తవడానికి కొన్నేళ్లు పడుతుందని అంటున్నారు. ఇటీవల ఏసీబీ జారీ చేసిన ఒక పత్రికా ప్రకటనను గమనిస్తే 2013లో నమోదైన కేసులో ఇటీవల అంటే సుమారు 12 ఏళ్ల తర్వాత శిక్ష పడటం గమనార్హం. అవినీతికి పాల్పడుతున్న వారిని పట్టుకోవడం ఎంత ముఖ్యమో, సకాలంలో శిక్షపడేలా చూడటం అంతే ముఖ్యమని ప్రజావేగులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులే ఏసీబీకి అడ్డు పడుతుండటంపై ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు.

పుట్టపర్తిలో విజయ్ దేవరకొండ

» కుటుంబ సభ్యులతో కలిసి సత్యసాయి మహాసమాధి సందర్శన

పుట్టపర్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సినీనటుడు విజయ్ దేవరకొండ పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. తల్లిదండ్రులు, సోదరుడు ఆనంద్ దేవరకొండతో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలోని పుట్టపర్తికి విచ్చేశారు. ప్రశాంతి నిలయంలో ఆయనకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు వర్గాలు స్వాగతం పలికాయి. అనంతరం సాయికుల్వంత్ మందిరానికి చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. తర్వాత శాంతిభవనం వద్దకు చేరుకున్నారు. రాత్రి ఇక్కడే బస చేశారు. సినీనటి రష్మిక మందన్నతో విజయ్ దేవరకొండ వివాహం నిశ్చమైన నేపథ్యంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నట్లు చర్చ జరుగుతోంది.

కొనబోతే కొరివి



(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తోంది. తాను తయారుచేసే జే-35లను 2030 నాటికి పాకిస్థాన్‌కు కూడా సరఫరా చేసేందుకు చైనా సిద్ధమైంది. అంటే.. మన దాయాది దేశానికి కూడా మరో ఐదేళ్లలో ఐదో తరం యుద్ధ విమానాలు అందుబాటులోకి వస్తాయన్నమాట. మరి ఈ రేసులో భారత్ ఎక్కడుంది? అంటే.. దశాబ్ద కాలం వెనకబడి ఉంది. మన వద్ద ప్రస్తుతం ఉన్నవి నాలుగో తరం యుద్ధవిమానాలే. రాఫెల్ యుద్ధవిమానాలు ఈ కోవలోకే వస్తాయి. ఫిఫ్త్ జనరేషన్ ఫైటర్ జెట్ మనవద్ద ఒక్కటి కూడా లేదు సరికదా.. వాటిని సమకూర్చుకోవడానికి ఇంకా పదేళ్లు పడుతుందని రక్షణ రంగ నిపుణుల అంచనా! ఒకవైపు చైనా, మరోవైపు పాకిస్థాన్.. ఇలా రెండువైపుల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఐదో తరం యుద్ధ విమానాల విషయంలో భారత్ ముందున్న ప్రత్యామ్నాయాలు మూడు. వాటిలో మొదటిది.. రూ.15 వేల కోట్లతో చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ-ఆమ్కా)'. ఇవి 2035 నాటికి వాయుసేనకు అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. కానీ.. దానిపైనా పలు సందేహాలున్నాయి. ఎందుకంటే.. అసలు ఈ విమానాల తయారీకి ఏ ఇంజన్ వాడాలన్నదే ఇంకా తేలలేదు. ఫ్రెంచ్ కంపెనీ శాఫ్రాన్‌తో ఒప్పందానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. అవి ఫలించి ఇంజన్ తయారీ మొదలుపెట్టినా, అవి అందుబాటులోకి వచ్చేసరికి 2033-2034 అవుతుంది. మరి అప్పటి దాకా చైనా, పాక్ ముప్పును ఎలా ఎదుర్కోవాలి? అనే ప్రశ్నకు సమాధానంగా మిగతా రెండు ప్రత్యామ్నాయాలూ తెరపైకి వస్తున్నాయి. అవి.. అమెరికన్ ఎఫ్-35లు, రష్యన్ సుఖోయ్-57లు.

రెండింటితో కొన్ని సమస్యలు..

ఐదో తరం యుద్ధవిమానాలైన ఎఫ్-35లను భారత్‌కు విక్రయించడానికి ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేశారు. కానీ.. దాంతో చాలా సమస్యలు ఉంటాయి. ఎఫ్-35ల స్టెల్త్ సామర్థ్యం అద్భుతం. అయితే, వాటిని కొనాలంటే అమెరికా పలు షరతులు విధిస్తుంది. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థకు దూరంగా ఈ విమానాలను ఉంచాలని పట్టుపడుతుంది. ఎఫ్-35లను డిటెక్ట్ చేసేవిధంగా ఎస్400ను ట్యూన్ చేసుకుంటామన్న భయమే ఇందుకు కారణం. రెండో సమస్య.. అమెరికా మనకు ఈ విమానాలను విక్రయించినప్పటికీ, సోర్స్ కోడ్ ఇవ్వదు. అలా ఇవ్వకపోతే మన బ్రహ్మోస్, అస్త్ర, రుద్రం వంటి క్షిపణులను ఆ యుద్ధవిమానాలతో ఇంటిగ్రేట్ చేయలేం. ఇదో పెద్ద సమస్య. అన్నిటికన్నా అతిపెద్ద సమస్య.. ఎఫ్-35 యుద్ధవిమానాల్లో కిల్ స్విచ్ ఉంటుంది. అంటే.. మనం చేసే యుద్ధం ఏదైనా అమెరికాకు నచ్చకపోతే.. మన దగ్గర ఉన్న ఎఫ్-35లేవీ పని చేయకుండా అమెరికా రిమోట్‌గా ఆపేయగలదు. అందుకే.. భారత్ ఆ విమానాల కొనుగోలుకు మొగ్గు చూపట్లేదు. ఇక మిగిలిన ప్రత్యామ్నాయం.. రష్యా వద్ద ఉన్న ఎస్‌యు-57ల కొనుగోలు. కానీ, వీటికి చాలా సమస్యలున్నాయి. నిజానికి ఈ విమానాల తయారీలో తొలుత రష్యాతో భారత్ కూడా పాలుపంచుకుంది. ఫిఫ్త్ జనరేషన్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎఫ్‌జీఎఫ్ఏ) పేరుతో రెండు దేశాలూ ఉమ్మడిగా దీన్ని తయారుచేయడం మొదలుపెట్టాయి. కానీ.. రష్యన్లు ఈ విమానం తయారీలో అనుసరిస్తున్న విధానాలు మనకు అంతగా నచ్చలేదు. విమానం మొత్తానికీ స్టెల్త్ సామర్థ్యం (ఏ వైపు నుంచీ కూడా శత్రు రేడార్లకు చిక్కకుండా ఉండే సామర్థ్యం) ఉండాలని భారత్ భావిస్తే.. ముందు భాగంలో మాత్రమే ఆ (ఫ్రంటల్ స్టెల్త్) సామర్థ్యం ఉంటే సరిపోతుందని రష్యా భావించింది. దీనికితోడు.. ఎస్‌యు-57 సోర్స్ కోడ్ ఇవ్వడానికి కూడా రష్యా అప్పట్లో అంగీకరించలేదు. దీంతో ఆ ప్రాజెక్టు నుంచి భారత్ బయటకు వచ్చేసింది. దరిమిలా రష్యా తయారుచేసిన ఎస్‌యు-57ల స్టెల్త్ సామర్థ్యం.. ఎఫ్-35, ఎఫ్-22, జె-20, జె-35లతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. ఎస్‌యు-57 రేడార్ క్రాస్ సెక్షన్ (ఆర్‌సీఎస్) వాటితో పోలిస్తే చాలా ఎక్కువ. శత్రు రేడార్లు వెలువరించే సంకేతాలు తమపై పడినప్పుడు.. అవి ప్రతిఫలించకుండా, లోపలికి శోషించుకునే శక్తినే ఆర్‌సీఎస్ అంటారు. దీన్ని చదరపు మీటర్లలో కొలుస్తారు. ఒక యుద్ధ విమానం ఆర్‌సీఎస్ ఎంత తక్కువగా ఉంటే దానికి అంత ఎక్కువ స్టెల్త్ సామర్థ్యం ఉన్నట్టు. ఎఫ్-35ల ఆర్‌సీఎస్ 0.001 నుంచి 0.005 చదరపు మీటర్లు. అంటే.. శత్రు రేడార్లకు ఆ విమానం అంత చిన్నగా.. ఒక పురుగులాగా కనపడుతుందన్నమాట. జే-20ల ఆర్‌సీఎస్ 0.02 నుంచి 0.1 చదరపు మీటర్లు అని అంచనా. అదే ఎస్‌యు-57 ఆర్‌సీఎస్.. 0.1 నుంచి 0.5 చదరపు మీటర్లు. ఎఫ్-35, జే20, జే35.. దేంతో పోల్చినా రేడార్ స్క్రీన్ మీద ఇది చాలా పెద్దగా కనపడుతుంది. అంతేకాదు.. ప్రస్తుతం రష్యా తయారు చేస్తున్న ఎస్‌యు57 విమానాలకు సూపర్ క్రూయిజ్ (ఆఫ్టర్ బర్నర్లు లేకుండా సూపర్ సానిక్ వేగంతో ఎక్కువసేపు ప్రయాణించే) సామర్థ్యం లేదు. సూపర్ క్రూయిజ్ సామర్థ్యం ఉండే కొత్త ఇంజన్ అభివృద్ధికి రష్యా శ్రమిస్తోంది. ఇన్ని సమస్యలున్నప్పటికీ.. భారత్‌కు వీటిని కొనుగోలు చేయడం తప్ప ప్రస్తుతం వేరే గతి లేని పరిస్థితి. ఈ సంగతి తెలుసు కాబట్టే రష్యా మనతో వీటిని కొనిపించేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. 114 రఫేల్ యుద్ధవిమానాలు.. 60 ఎస్‌యు-57లు కొనుగోలు చేయాలన్న భారత్ ఆలోచనలకు భిన్నంగా.. మొత్తం 200 ఎస్‌యు-57 విమానాలను కొనుగోలు చేయాలని సూచిస్తోంది. అలా కొంటే.. ఈ విమానాల సోర్స్ కోడ్ ఇస్తామని.. వాటితో మన క్షిపణులను ఇంటిగ్రేట్ చేసుకోవచ్చని.. భారత్‌లోనే వాటిని తయారు చేసుకోవచ్చని.. కావాలంటే ఇతర దేశాలకు ఎగుమతి కూడా చేసుకోవచ్చని అంటోంది. ఈ ఏడాది డిసెంబరులో రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చినప్పుడు వీటి కొనుగోలుకు సంబంధించి ఒప్పందం కుదిరే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ అలా కుదుర్చుకున్నా కూడా అవి మనకు అందుబాటులోకి రావడానికి పదేళ్లు పడుతుందని అంచనా! అయినా గత్యంతరం లేని పరిస్థితి. ఎందుకంటే.. ఆమ్కా ప్రాజెక్టు ఎంతవరకూ ముందుకెళ్తుందో తెలియదు. ఒకవేళ అది విఫలమైతే.. 'గుడ్డిలో మెల్ల' అన్నట్టు ఇవే దిక్కవుతాయి. ఎఫ్-35లు, జే-20, జే-35లంత సమర్థమైనవి కాకపోయినా.. తప్పక వీటిని కొనాల్సిన పరిస్థితిలో భారత్ ఉందని చెప్పొచ్చు!!

చివరాఖరు: ఒకవేళ పుతిన్ మనదేశానికి వచ్చినప్పుడు వీటి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంటే ట్రంప్ ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూడాలి! రష్యా దగ్గర చమురు కొన్నందుకే 25% అదనపు సుంకాలు విధించిన ట్రంప్.. తాను ఇస్తానన్న ఎఫ్-35లు కొనకుండా రష్యా ఎస్‌యు-57లు కొంటే ఊరుకుంటారా? అప్పుడు ఆంక్షలు పెడతారో..!!

(సెంట్రల్ డెస్క్)

అప్పటిలోగా ఏంచేయాలి?

ఇప్పటికే చైనా వద్ద 300కు పైగా జే-20లు ఉన్నాయి. 2035 నాటికి 1500 జే-20ల తయారీని ఆ దేశం లక్ష్యంగా పెట్టుకుంది. వాటిలో కొన్నింటిని పాకిస్థాన్‌కి ఇస్తే.. రెండు దేశాలూ భారత్‌కు పక్కలో బల్లేల్లాగా మారుతాయి. మనకు ఐదో తరం యుద్ధవిమానాలు అందుబాటులోకి రావడానికి పదేళ్లు పడుతుంది కాబట్టి.. అప్పటిదాకా ఆ లోటును పూడ్చుకోవడం కత్తి మీద సాములా ఉంటుంది. మనవద్ద ఉన్న, కొత్తగా కొనబోతున్న రఫేల్ యుద్ధవిమానాలకు ఫ్రంటల్ స్టెల్త్ ఉంటుంది కాబట్టి వాటిని సమర్థంగా వాడుకోవాలి. అలాగే.. మన మీదకి దూసుకువచ్చే స్టెల్త్ విమానాలను గుర్తించేలా మన రేడార్ వ్యవస్థలను, గగనతల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలి.

ఐదోతరం యుద్ధ విమానం అంటే?

రిచర్డ్ పి.హాలియన్ అనే ఎయిర్ హిస్టారియన్ 1990లో.. యుద్ధవిమానాలను ఆరు తరాలుగా వర్గీకరించారు. వేగం, టెక్నాలజీ వంటివాటి ఆధారంగా ఆయన ఆ వర్గీకరణ చేశారు. అప్పటికి స్టెల్త్ సామర్థ్యం ఇంకా ఏ దేశానికీ అందుబాటులోకి రాలేదు కాబట్టి ఆయన వర్గీకరణలో ఆ అంశం కనిపించదు. 2000 సంవత్సరం తర్వాత అమెరికా వాయుసేన, వైమానిక రంగ నిపుణులు రిచర్డ్ వర్గీకరణను నాలుగు జనరేషన్లకు కుదించి.. స్టెల్త్ సహా ఐదు సామర్థ్యాలు ఉన్న విమానాలను ఐదోతరంగా పేర్కొన్నారు. స్టెల్త్ సామర్థ్యం అంటే శత్రు రేడార్లకు దొరక్కుండా ఉండడం. మిగతా నాలుగూ.. సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అడ్వాన్స్‌డ్ సెన్సర్ ఫ్యూజన్, హైలీ ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్స్, నెట్‌వర్క్ సెంట్రిక్ వార్‌ఫేర్ కేపబిలిటీ(ఫైటర్‌జెట్లు, డ్రోన్లు, రేడార్లు, ఉపగ్రహాలు, గ్రౌండ్ స్టేషన్లు ఒక డిజిటల్ నెట్‌వర్క్‌లాగా ఏర్పడతాయి. దీనివల్ల పైలెట్‌కు.. తనకు కనిపించని కోణాల్లో ఉన్న శత్రువుల గురించి కూడా సమాచారం వస్తుంది. శత్రు లక్ష్యాలను ఛేదించడం సులువవుతుంది).. ఈ ఐదూ ఉండే వాటిని ఐదో తరం యుద్ధ విమానాలుగా పేర్కొంటారు.


దార్జిలింగ్‌లో వరద బీభత్సానికి ధ్వంసమైన రోడ్డు

దార్జిలింగ్‌లో వరుణుడి బీభత్సం

» భారీ వర్షాలకు వరదలు, విరిగిపడ్డ కొండచరియలు

» వేర్వేరు ప్రాంతాల్లో 20 మంది దుర్మరణం

డార్జిలింగ్, అక్టోబరు 5 : పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల వల్ల డార్జిలింగ్, ఆ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తగా, చాలా చోట్ల పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో డార్జిలింగ్, ఆ జిల్లాలోని మిరీక్ సహా ఇతర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఘటనల్లో పలువురు చిన్నారులు సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు.ఒక్క మిరీక్ ప్రాంతంలోనే 11 మంది ప్రాణాలు కోల్పోగా ఏడుగురు గాయపడ్డారని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రకటించాయి. మిరీక్, సిలిగురి ప్రాంతాలను కలిపే బాలాసోన్ నదిపై దుదియాలో ఉన్న ఓ వంతెన కూలిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా తెగిపోయాయి. కొండచరియలు విరిగి పడడంతో పెద్ద సంఖ్యలో ఇళ్లు ధ్వంసమై చాలా మంది నిరాశ్రయులవ్వగా.. పలువురి ఆచూకీ గల్లంతయింది. వర్షాలకు తోడు కొండచరియలు విరిగి పడుతుండడంతో డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసేశారు. డార్జిలింగ్ అందాలను చూసేందుకు వచ్చిన వేల మంది పర్యాటకులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. సోమవారం వరకు డార్జిలింగ్‌లో భారీ వర్షాలు కొనసాగుతాయనే వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోపక్క, భూటాన్‌లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందనే హెచ్చరికలు కూడా ఉన్నాయి. కాగా, డార్జిలింగ్‌లో విపత్కర పరిస్థితిపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరోవైపు, నేపాల్‌లోనూ భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో నేపాల్‌లో 51 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఎయిరిండియా విమానానికి తప్పిన ముప్పు!

ముంబై, అక్టోబరు 5: ఎయిరిండియాకు చెందిన మరో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. అమృత్‌సర్-బర్మింగ్‌హామ్ మధ్య నడిచే బోయింగ్ 787లో అత్యవసర పరిస్థితుల్లో తెరచుకునే ర్యామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్) తెరచుకుంది. శనివారం (ఈ నెల 4న) విమానం బర్మింగ్‌హామ్‌లో ల్యాండ్ కావడానికి ముందు ర్యాట్ తెరచుకున్నట్లు, అయితే విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఎయిరిండియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, విమానంలో ప్రధానమైన ఎలక్ట్రికల్, హైడ్రాలిక్ వ్యవస్థలు పనిచేయని సందర్భంలోనే ర్యాట్ తెరచుకుంటుంది. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన ఎయిరిండియా బోయింగ్ 787 విమానానికి కూడా ర్యాట్ తెరుచుకోగా.. ఆ వెంటనే అది కూలిపోయింది. ఈ ఘటనలో 260 మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో దేశంలోని బోయింగ్ 787 విమానాలన్నింట్లోనూ ఎలక్ట్రికల్ వ్యవస్థను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) కోరింది. ఈ మేరకు ఆదివారం డీజీసీఏకు లేఖ రాసింది.

ఆక్రమణలో ఉన్న గదిని స్వాధీనం చేసుకోవాలి

» పీఓకేపై భాగవత్ పరోక్ష వ్యాఖ్యలు

సాత్నా, అక్టోబరు 5: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆరెస్సెస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ పరోక్షంగా చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని సాత్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఓకేని ఇంటిలోని ఓ గదితో సరిపోల్చారు. "మొత్తం భారత దేశం ఓ ఇల్లు. కొందరు మన ఇంటిలో ఓ గదిని లేకుండా చేశారు. ఆ గదిలోనే నా టేబులు, కుర్చీ, దుస్తులను పెట్టుకునేవాడిని. దాన్ని వారు ఆక్రమించుకున్నారు. రేపయినా దాన్ని తిరిగి తెచ్చుకోవాలి గదా! దీని ద్వారా మనం అవిభాజ్య భారత దేశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి" అని అన్నారు. సమావేశానికి హాజరయిన సింధీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ విభజన సందర్భంగా వారు పాకిస్థాన్‌ను కాకుండా భారత్‌ను ఎంచుకున్నారని చెప్పారు. "పరిస్థితుల కారణంగా వారు ఇక్కడికి వచ్చారు. ఆ ఇల్లు, ఈ ఇల్లు వేరువేరు కాదు" అని అన్నారు.

హమాస్ ఇంకా ఆలస్యం చేయవద్దు: ట్రంప్

వాషింగ్టన్ డీసీ, గాజా, అక్టోబరు 5: గాజా శాంతి ప్రణాళికపై వేగంగా నిర్ణయం తీసుకోకపోతే గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హమా‌స్‌ను మరోమారు హెచ్చరించారు. గడువులోగా స్పందించకపోతే నరకం చూపిస్తామని, మునుపెన్నడూ చూడనంతగా దాడులు చేస్తామని ఆయన ఇప్పటికే హెచ్చరించారు. గాజా నుంచి బలగాలను ఉపసంహరించేందుకు ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని, హమాస్ ఇక ఆలస్యం చేయవద్దని ట్రంప్ సూచించారు. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల్లో నిరాయుధీకరణ, గాజాపై అధికారాన్ని వదులుకోవడంపై హమాస్ విభేదిస్తోంది. మరోవైపు, ఈజిప్టులో కొద్ది గంటల్లో జరిగే శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్ తన ప్రతినిధులను ఇప్పటికే పంపగా అమెరికా నుంచి ట్రంప్ తన అల్లుడు జరేద్ కుష్నర్‌ను, ప్రత్యేక రాయబారి విట్కాఫ్‌ను తన ప్రతినిధులుగా పంపారు.

క్షయ నిర్ధారణ ఇక తేలిక..!

» రెండు కొత్త స్వదేశీ పరికరాలకు ఐసీఎంఆర్ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబరు 5: క్షయ వ్యాధిపై పోరాటంలో కీలక ముందడుగు పడింది. తక్కువ ఖర్చుతో వేగంగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వీలుగా దేశీయంగా అభివృద్ధి చేసిన రెండు కొత్త సాధనాలకు ఐసీఎంఆర్ ఆమోదం తెలిపింది. తక్కువ ఖర్చుతోనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు... క్వాంటీప్లస్ ఎంటీబీ ఫాస్ట్ డిటెక్షన్ కిట్, యూనిఏఎంపీ ఎంటీబీ న్యూక్లియిక్ యాసిడ్ టెస్ట్ కార్డ్ అనే పరికరాలను తెలంగాణకు చెందిన హువెల్ లైఫ్‌సైన్సెస్ దేశీయంగా అభివృద్ధి చేసిందని ఐసీఎంఆర్ వెల్లడించింది. క్వాంటీప్లస్.. టీబీని గుర్తించడానికి ఆమోదం పొందిన తొలి ఓపెన్ సిస్టమ్ ఆర్టీ-పీసీఆర్. ఎందుకంటే ఇది ఇప్పటికే ఉన్న ఇతర పీసీఆర్ పరికరాల్లోనూ పనిచేస్తుంది. దీనిసాయంతో టీబీ పరీక్షను తక్కువ ఖర్చుతో, వేగంగా నిర్వహించవచ్చని ఐసీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి. క్వాంటీప్లస్ ఒకేసారి 96 నమూనాలను పరీక్షించగలదని పేర్కొన్నాయి. ఇతర పద్ధతుల్లో టీబీ నిర్ధారణ పరీక్షకయ్యే వ్యయంతో పోలిస్తే క్వాంటీప్లస్ వల్ల ఖర్చు ఐదింతలు తగ్గుతుందని తెలిపాయి. కాగా, ఐసీఎంఆర్ ఆమోదించిన మరో స్వదేశీ ఆవిష్కరణ యూనిఏఎంపీ ఎంటీబీ న్యూక్లియిక్ యాసిడ్ టెస్ట్ కార్డ్‌ను కూడా హువెల్ లైఫ్‌సైన్సెస్ అభివృద్ధి చేసింది. ఈ రెండు పరికరాల ద్వారా కఫం నమూనాలకు బదులుగా నాలుకపై ఉండే ఉమ్మితో టీబీ నిర్ధారణ చేయవచ్చని ఆ వర్గాలు తెలిపాయి.

షికాగోను వార్ జోన్‌గా ప్రకటించిన ట్రంప్ సర్కారు

వాషింగ్టన్, అక్టోబరు 5: స్థానిక డెమోక్రటిక్ నేతల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నా.. షికాగో నగరాన్ని ట్రంప్ పరిపాలన విభాగం వార్ జోన్‌గా ప్రకటించింది. జాతీయ భద్రతా దళాలు ఆ నగరాన్ని మోహరించేందుకు అనుమతినిచ్చింది. డెమోక్రాట్ల ఆధీనంలో ఉన్న నగరాలపై రాజకీయంగా ఆధిపత్యం చెలాయించడానికి దేశాధ్యక్షుడు ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలోనే తాజా నిర్ణయం వెలువడింది. అంతకుముందు ఒరెగాన్‌లోని పోర్ట్‌ల్యాండ్‌లో బలగాలను మోహరించేందుకు ట్రంప్ సర్కారు ఆదేశాలివ్వగా.. స్థానిక కోర్టు కలుగజేసుకొని తాత్కాలికంగా నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. షికాగోలో భద్రతా దళాల మోహరింపును సమర్థిస్తూ.. ఆ ప్రాంతం యుద్ధ భూమిగా మారిపోయిందంటూ హోంల్యాండ్ భద్రతా కార్యదర్శి క్రిస్టి నోయెమ్ వ్యాఖ్యానించారు.

బిహార్ ఎన్నికలు నవంబరు 22లోపే

ఛఠ్ పూజలాగే ఉత్సాహంగా పాల్గొనాలి

» ఓటర్లకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పిలుపు

» ఎన్నికల సన్నద్ధతపై పట్నాలో సమీక్ష



న్యూఢిల్లీ, అక్టోబరు 5: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు.. శాసనసభ పదవీకాలం ముగిసే నవంబరు 22వ తేదీలోపే జరుగుతాయని ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఛఠ్ పూజ(ఈ నెల 25 నుంచి 28 వరకు) మాదిరిగానే ఓటింగ్‌లోనూ ఆనందోత్సాహాలతో పాల్గొనాలని రాష్ట్ర ఓటర్లకు పిలుపిచ్చారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశామన్నారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)ను చట్టబద్ధంగానే చేపట్టామని చెప్పారు. త్వరలోనే దీనిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. రెండ్రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం రెండో రోజు ఆదివారం ఆయన పట్నాలో సహచర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలతో కలిసి అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లు కూడా దీనికి హాజరయ్యారు. బిహార్ ఎన్నికలతో మొదలయ్యే పలు సంస్కరణలను సీఈసీ విశదీకరించారు. ఇక నుంచి ఈ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా పోలింగ్ కేంద్రానికి 1,200 మంది మాత్రమే ఓటర్లు ఉంటారని చెప్పారు. 'బిహార్లోని వైశాలి ప్రపంచానికే ప్రజాస్వామ్య మార్గాన్ని ఎలా చూపిందో.. అదే విధంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళనలో వీరు దేశానికే స్ఫూర్తిగా నిలిచారు' అని కొనియాడారు. ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల సవరణ ప్రజాప్రాతినిధ్య చట్టప్రకారం చట్టబద్ధమేనని.. ఎన్నికలు ముగిశాక సవరించడం కుదరదని గుర్తుచేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సెప్టెంబరు 30న ఓటర్ల జాబితాను ప్రచురించామని.. చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలున్నా.. అర్హులైనవారిని చేర్చకపోయినా.. అభ్యంతరాలు తెలియజేసేందుకు ఇప్పటికీ పది రోజుల వ్యవధి ఉందని చెప్పారు. అన్ని అభ్యంతరాలను ఓటర్ నమోదు అధికారు(ఈఆర్‌వో)ల స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. నామినేషన్లు మొదలు కాగానే ఓటర్ల జాబితా నిశ్చలంగా ఉంటుందని.. ఎన్నికల ప్రక్రియ ముగిసేదాకా అందులో మార్పులకు ఆస్కారం ఉండదన్నారు.

పారదర్శకత కోసం 17 సంస్కరణలు..

ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం 17 సంస్కరణలను బిహార్ ఎన్నికల నుంచే ఎన్నికల కమిషన్ శ్రీకారం చుడుతోందని జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో పోలింగ్ సందర్భంగా కొన్ని, ఓట్ల లెక్కింపు సమయంలో కొన్ని అమలవుతాయన్నారు. ఇకపై ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండరని స్పష్టంచేశారు. ప్రస్తుతం 1,500 మంది ఓటర్లు ఉంటున్నారు. తాజా సవరణతో బిహార్లో ఇప్పుడున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరుగుతాయి.

- బీఎల్‌వోలు గుర్తింపు కార్డులు ధరించడం తప్పనిసరి. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లు తమ మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేసేందుకు ఒక కేంద్రం ఏర్పాటుచేస్తారు.
- ఎన్నికల గుర్తు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఈవీఎంలోని బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి ఫొటో బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటోంది. వారిని గుర్తించడం కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఫొటోలు ఇక కలర్‌లో ఉంటాయి. బిహార్‌తో మొదలుపెట్టి ఇక దేశవ్యాప్తంగా ఇదే అమలవుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఉంటారో ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే ఫాం-17సీకి, ఈవీఎం కౌంటింగ్ యూనిట్‌లో పోలైన ఓట్లల సరిపోలనప్పుడు వీవీప్యాట్లన్నిటినీ పూర్తిగా లెక్కిస్తారు.
- ఇక మీదట ఓట్ల లెక్కింపులో తుది రెండు రౌండ్ల ముందు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రీకౌంట్ చేస్తారు.

ఆధార్ గుర్తింపు కార్డు మాత్రమే..

గుర్తింపు ధ్రువపత్రాల్లో ఆధార్‌ను చేర్చడంపై జ్ఞానేశ్‌కుమార్ స్పష్టత ఇచ్చారు. అది గుర్తింపు కార్డు మాత్రమేనన్నారు. అదీగాక ఆధార్ నంబర్ ఇవ్వాలని ఎన్యుమరేషన్ ఫాంలో ఎన్నికల కమిషనే కోరిందని గుర్తుచేశారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. ఆధార్ చట్టం కింద కూడా ఆధార్ కార్డును పుట్టినరోజు, చిరునామా, పౌరసత్వాలకు ధ్రువీకరణగా పరిగణించడానికి వీల్లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 26వ సెక్షన్ ప్రకారం అది ఐచ్ఛికం మాత్రమే' అని ఆయన వివరించారు.

బిహార్ అసెంబ్లీలో ప్రస్తుత బలాలు..

మొత్తం అసెంబ్లీ స్థానాలు : 243

ఎన్డీఏ	-138 (బీజేపీ-84, జేడీయూ-48, హెచ్ఏఎం-4, స్వతంత్రులు-2)
మహాకూటమి	-103 (ఆర్జేడీ-71, కాంగ్రెస్-17, సీపీఐఎంఎల్-లిబరేషన్-11, సీపీఎం-2, సీపీఐ-2)
ఇతరులు	-2 (ఎంఐఎం-1, స్వతంత్ర-1)

కులగణన వెంటనే ఆపండి

» అదో పిచ్చోళ్ల సంతలా ఉంది: సోమణ్ణ

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో చేపడుతున్న కులగణన సర్వేను వెంటనే ఆపాలని, అదో పిచ్చోళ్ల సంతలా మారిందని కేంద్రమంత్రి సోమణ్ణ మండిపడ్డారు. ఆదివారం బెంగళూరు విజయనగర్‌లోని నివాసం వద్ద మంత్రి మీడియాతో మాట్లాడారు. సర్వే చేసేందుకు వచ్చిన ఉద్యోగులు తన ఒక్కడి సమాచారాన్ని గంటకుపైగా సేకరించారని తెలిపారు. ఇలా రాష్ట్ర మంతటా ఉండే ఏడు కోట్ల మంది వివరాలను కేవలం 15 రోజుల్లో సేకరించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇదో అశాస్త్రీయత సర్వే అంటూ కొట్టిపారేశారు.

లోకాయుక్త వలలో కర్ణాటక విద్యుత్ మంత్రి ఓఎస్డీ

బెంగళూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్‌కు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీకి లంచం తీసుకుంటూ కర్ణాటక విద్యుత్‌శాఖ మంత్రి ఓఎస్డీ లోకాయుక్త అధికారులకు పట్టుబడారు. ఓఎస్డీతోపాటు కారు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. కేపీటీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయిన జ్యోతిప్రకాష్ ప్రస్తుతం విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్‌కు ఓఎస్డీగా సేవలు అందిస్తున్నారు. లేఅవుట్‌కు కరెంటు కనెక్షన్ కోసం బ్యాడరహళ్లి నివాసి కేఎం అనంతరాజు దరఖాస్తు చేసుకోగా, ఎన్ఓసీ మంజూరు చేసేందుకు జ్యోతిప్రకాష్ లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. దీంతో అనంతరాజు లోకాయుక్త అధికారులను ఆశ్రయించారు.

భారత్‌ను సమాధి చేస్తాం

» పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

న్యూఢిల్లీ, అక్టోబరు 5: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్నారు. భారత్‌ను దాని యుద్ధ విమానాల శిథిలాల కిందే సమాధి చేస్తామంటూ 'ఎక్స్'లో చేసిన ట్వీట్‌లో ప్రగల్భాలు పలికారు. పాక్‌ను ప్రపంచ పటం నుంచి తుడిచేస్తామంటూ భారత సైనికాధికారులు, రాజకీయ నాయకులు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌లో 0-6 తేడాతో భారత్ ఓడిపోయిందని, ఇంకా తమపై యుద్ధానికి ప్రయత్నిస్తే పాక్ స్కోరు మరింత మెరుగుపడుతుందని ఖవాజా వ్యాఖ్యానించారు.

ఆయుర్దాయంలో మనం వెనుకే!



» జపనీయులు 85 ఏళ్లు.. భారతీయులు 72 ఏళ్లే..

» రోజువారీ అలవాట్లు, తినే ఆహారంలో తేడానే కారణం

న్యూఢిల్లీ, అక్టోబరు 5: ప్రపంచవ్యాప్తంగా దీర్ఘాయుష్షుతో జీవించే ప్రజలు ఎవరంటే.. జపనీయులే అని చెబుతాం..? జపాన్‌లో మనిషి సగటు అయుర్దాయం 85 ఏళ్లు. అయితే వారితో పోలిస్తే భారతీయుల ఆయుర్దాయం 13 ఏళ్లు తక్కువగా ఉందని తాజా డేటాలో వెల్లడైంది. జపనీయులు అంత ఎక్కువకాలం జీవించడానికి, భారతీయుల జీవితకాలం 75 ఏళ్లకు తగ్గిపోవడానికి రోజువారీ అలవాట్లు, తినే ఆహారమే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆహారం, పని, నిద్ర వంటి వాటిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే ఎవరైనా మరింత ఎక్కువ కాలం హాయిగా జీవించొచ్చంటున్నారు.

నిశ్చల జీవితం..!

జపాన్‌లో ఒకచోటు నుంచి మరొక చోటుకి వెళ్లాలంటే ఎక్కువగా నడిచే వెళ్తారు. సైకిల్ తొక్కడం వారి దినచర్యలో భాగం. వాళ్లు రోజూ 7వేల నుంచి 10 వేల అడుగుల దూరం నడుస్తారు. కానీ.. భారత్‌లో ఎక్కడికైనా వెళ్లాలంటే.. కారు, క్యాబ్, లేదంటే బైక్ వినియోగిస్తారు. పట్టణాల్లో ఉండే వాళ్లయితే రోజుకు కనీసం 3వేల అడుగులు కూడా వేయడం లేదు. జపాన్ వాళ్లు బ్రేక్‌ఫాస్ట్‌లో మిసో సూప్, రైస్, గ్రిల్డ్ ఫిష్‌తో పాటు ప్రొటీన్లు అధికంగా ఉండేలా చూసుకుంటారు. భారత్‌లో అల్పాహారం అంటే.. నెయ్యి, వెన్నతో కూడి పరోటాలు, కార్బొహైడ్రేట్లు అధికంగా ఉండే వంటకాలు ఉంటాయి. వీటి వల్ల ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు ఎక్కువవుతాయి.

లేట్ నైట్ డిన్నర్

జపాన్‌లో దాదాపు అందరూ రాత్రి 8 గంటలలోపే భోజనం ముగించేస్తారు. అదికూడా చాలా తేలికగా జీర్ణమయ్యే ఆహారమే తింటారు. భారత్‌లో రాత్రి 10, 11 తర్వాత కూడా బిర్యానీలు, పిజ్జాలు, బటర్ చికెన్లు వంటివి తింటారు. దీని వల్ల సరిగా జీర్ణం కాక.. బరువు పెరగడం, నిద్రలేమి సమస్యలు ఎదురవుతాయి.

పని ఒత్తిడి..

జపాన్‌లో పనికి అధిక ప్రాధాన్యమిస్తారు. అక్కడ రోజూ సగటున 8.5 గంటలు పనిచేస్తారు. భారత్‌లో రోజూ 10 నుంచి 12 గంటలు కష్టపడతారు. దీనికి ప్రయాణ సమయాన్ని కూడా జోడిస్తే భారతీయులు రోజులో ఎక్కువ సమయం కూర్చుని పనిచేస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

నిద్రలేమి

జపానీయులు సగటున 6 నుంచి 7 గంటలు నిద్రపోతారు. భారతీయుల సగటు నిద్ర 5-6 గంటలే. దీర్ఘకాలిక నిద్రలేమి వల్ల ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు, అకాల మరణం సంభవించే ప్రమాదం ఉంటుంది. జపనీయులు నడక, సైక్లింగ్ వంటి దినచర్యతో ఫిట్‌నెస్‌ను వారి జీవితంలో భాగం చేసుకుంటారు. భారత్‌లో చాలా కొద్దిమంది మాత్రమే ఫిట్‌నెస్‌పై దృష్టి పెడతారు.

జపాన్‌లో లక్షకు చేరువైన శతాధికులు

జపాన్‌లో వృద్ధుల జనాభా గణనీయంగా పెరుగుతోంది. ఈ దేశంలో 100 ఏళ్లకుపైబడిన వృద్ధుల సంఖ్య రికార్డు స్థాయిలో లక్షకు చేరువైందని జపాన్ ప్రభుత్వం వెల్లడించింది. వారిలో 90 శాతం మంది మహిళలేనని పేర్కొంది. ప్రపంచంలోని నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్‌లో ఓ వైపు ప్రజల ఆయుర్దాయం పెరుగుతుండగా.. మరోవైపు జననాల రేటు గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో ఈ దేశం అతిపెద్ద జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నాటికి జపాన్‌లో 99,763 మంది శతాధిక వృద్ధులు ఉన్నారు.

ఔషధం..నిర్లక్ష్యం..విషం!

నాణ్యతలేని మందులతో ప్రజలకు ప్రాణ సంకటం



» రసాయనం కలిసిన దగ్గుమందుతో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 14 మంది మృతి

అదో చిన్న ఫార్మా కంపెనీ.. ఎన్నో మందులు తయారు చేసి అమ్ముతోంది.. పెద్ద కంపెనీలతో పోటీపడలేక అడ్డదారులు తొక్కుతోంది.. మందులపై ఎక్కువ ఎమ్మార్పీ (గరిష్ట చిల్లర ధర) ముద్రించి.. అతి తక్కువ ధరకే మందుల షాపులకు హోల్‌సేల్‌గా సరఫరా చేస్తుంది.. వైద్యులకు అడ్డగోలు కమీషన్లు ఆశచూపి.. పేషెంట్లకు తమ మందులే రాసేలా ప్రలోభపెడుతుంది.. ఇటు వైద్యులకు, అటు మందుల షాపులకు బోలెడు లాభం.. ఇంతదాకా బాగానే ఉంది. కానీ అతి తక్కువ ధరకు మందులు, ఆపై కమీషన్లు ఇస్తూ, తాను కూడా లాభం పొందాలంటే.. ఆ ఫార్మా కంపెనీ ఎంత నాణ్యంగా మందులు తయారు చేస్తుంది? చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయదా? ప్రాణాలకు ప్రమాదం తలెత్తదా? మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో అదే జరిగింది. ఓ చిన్న ఫార్మా కంపెనీ తయారు చేసిన దగ్గు మందులోని విష పదార్థాల కారణంగా ముక్కుపచ్చలారని 14మంది చిన్నారులు చనిపోయారు.

ప్రమాదకర రసాయనం కలవడంతో..

మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో పిల్లలకు ఇచ్చిన 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందును ల్యాబ్‌లలో పరీక్షించగా 'డైథైలీన్ గ్లైకాల్ (డీఈజీ), ఇథైలీన్ గ్లైకాల్ (ఈజీ)'గా పిలిచే ప్రమాదకర రసాయనాల ఆనవాళ్లు ఉన్నట్టు తేలింది. తమిళనాడులోని కాంచీపురంలో శ్రేసన్ ఫార్మా కంపెనీకి చెందిన యూనిట్‌లో ఈ దగ్గు మందు తయారైంది. డీఈజీ, ఈజీ రసాయనాలను పరిశ్రమల్లో పెయింట్లు, బ్రేక్ ఫ్లూయిడ్స్, కొన్ని రకాల ప్లాస్టిక్ తయారీలో వినియోగిస్తారు. మందుల తయారీకి వాటితో ఏమాత్రం సంబంధం ఉండదు. అయితే ఔషధాల తయారీలో వాడే గ్లిసరిన్ వంటి ముడి పదార్థాల రవాణా సమయంలో వాటిలో డీఈజీ, ఈజీ చేరే అవకాశం ఉంటుంది. డీఈజీ, ఈజీ మన శరీరంలో మూత్రపిండాలు, కాలేయంతోపాటు నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతాయి.

వైద్యులు, దుకాణదారుల కక్కుర్తితో..

చిన్న ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వైద్యులను, మందుల దుకాణాల వారిని ప్రలోభపెట్టడం సాధారణంగా మారిపోయింది. అతి తక్కువ ధరకు ఇచ్చే ఆ మందులపై ఎమ్మార్పీ మాత్రం పెద్ద పెద్ద కంపెనీల మందులకన్నా ఎక్కువగా ఉంటుంది. దీనితో వైద్యులు, దుకాణాల వారికి భారీగా మార్జిన్లు మిగులుతాయి. దీనితో వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు ఆ కంపెనీల మందులే రాస్తున్నారు. ఫార్మా కంపెనీల్లో పరిస్థితులు, పరికరాలు, ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను సంబంధిత ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, తూతూమంత్రంగా పరిశీలించి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

'దగ్గు మందు' కంపెనీల్లో తనిఖీలు

మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో దగ్గు మందుతో చిన్నారులు మృతి చెందడంతో కేంద్రం అప్రమత్తమైంది. ఆదివారం అన్ని రాష్ట్రాల వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా దగ్గు మందు తయారీ సంస్థల వివరాలు సేకరించి.. వెంటనే ఆయా యూనిట్లలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు, పరీక్షలకు ఏర్పాట్లు ప్రారంభించారు. (సెంట్రల్ డెస్క్)

పిల్లల మృతి కేసులో వైద్యుడి అరెస్టు

మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో దగ్గు మందు కారణంగా పిల్లలు మృతి చెందిన ఘటనలో ప్రభుత్వ వైద్యుడు ప్రవీణ్ సోనిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఈ దగ్గుమందు తయారుచేసిన సంస్థపైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. కోల్డ్రిఫ్ దగ్గు మందుపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. ప్రవీణ్ సోని ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూ ఈ దగ్గుమందును సిఫారసు చేసినట్లు ఛింద్వారా ఎస్పీ చెప్పారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రవీణ్‌ను వైద్య విధుల నుంచి సస్పెండ్ చేసింది. మరోవైపు తమిళనాడు డ్రగ్ కంట్రోల్ అధికారులు ఈ నెల 2వ తేదీన ఇచ్చిన తమ నివేదికలో శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ తయారుచేసిన కోల్డ్రిఫ్ దగ్గుమందు డైఇథలీన్ గ్లైకాల్(48.6%)తో కల్తీ అయ్యిందని పేర్కొంది.

పాక్‌కు జెట్ ఇంజన్లు ఇవ్వట్లేదు!

» భారత్‌ను ఇబ్బంది పెట్టే పనిచేయం: రష్యా

న్యూఢిల్లీ, అక్టోబరు 5: పాకిస్థాన్‌కు తాము ఫైటర్ జెట్ ఇంజన్లు సరఫరా చేస్తున్నట్లు వచ్చిన వార్తలను రష్యా ఖండించింది. భారత్‌ను ఇబ్బంది పెట్టే పని చేయబోమని తేల్చిచెప్పింది. చైనా తయారీ జేఎఫ్-17 థండర్ బ్లాక్-3 యుద్ధ విమానాలకు అమర్చేందుకు కీలకమైన ఆర్డీ-93 ఎంఏ ఇంజన్లను పాక్‌కు రష్యా సరఫరా చేస్తోందని.. మోదీ మార్క్ దౌత్యం విఫలమైందని.. కేంద్రం దీనికి జవాబు చెప్పాలని కాంగ్రెస్ శనివారం డిమాండ్ చేసింది. ఈ వార్త అర్థరహితమని రష్యా ప్రభుత్వ వర్గాలు తాజాగా తేల్చిచెప్పాయి. పాక్‌తో ఆ స్థాయిలో మిలిటరీ సహకారం లేదని స్పష్టం చేసినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ నివేదించింది. పాక్‌కు రష్యా ఫైటర్ జెట్లు సరఫరా చేస్తుందన్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ శనివారం 'ఎక్స్'లో స్పందిస్తూ.. ప్రధాని మోదీ దౌత్యం దేశ ప్రయోజనాల కంటే తన ఇమేజ్‌ను పెంచుకోవడం కోసం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. ఒకప్పుడు భారత్‌కు అత్యంత విశ్వసనీయ వ్యూహాత్మక మిత్రదేశంగా ఉన్న రష్యా.. భారత్ అభ్యర్థనలను విస్మరించి, పాక్‌కు జెట్ ఇంజన్లు సరఫరా చేసేందుకు ఎందుకు ముందుకెళ్తోందో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సరిహద్దు రక్షణకు ఏకే-630 గన్స్

» ఆరు శతఘ్నుల కొనుగోలుకు ఆర్మీ టెండర్

న్యూఢిల్లీ, అక్టోబరు 5: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ తన గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా భారత ఆర్మీ.. ప్రభుత్వ యాజమాన్యంలోని అడ్వాన్స్‌డ్ వెపన్ అండ్ ఎక్విప్‌మెంట్ ఇండియా లిమిటెడ్ (ఏడబ్ల్యూఈఐఎల్) నుంచి ఆరు ఏకే-630 వైమానిక రక్షణ శతఘ్నుల కొనుగోలుకు టెండర్ జారీ చేసింది. మిషన్ సుదర్శన్ చక్ర ప్రాజెక్టు కింద డ్రోన్లు, రాకెట్ల వంటి వైమానిక ముప్పుల నుంచి పాకిస్థాన్‌కు సరిహద్దుకు దగ్గరగా ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో వీటిని మోహరించనున్నట్టు రక్షణశాఖ అధికారులు తెలిపారు. ఈ కొత్త ఆయుధ వ్యవస్థ భారత గగనతల రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని, ముఖ్యంగా భూమిపై నుంచి 10వేల మీటర్ల ఎత్తు నుంచి వచ్చే ముప్పులపై ఇది దృష్టిపెడుతుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్మూ కశ్మీర్, పంజాబ్‌ల్లోని పౌర నివాసాలు, మతపరమైన భవనాలపై పాక్ సైన్యం ప్రత్యక్ష దాడులకు తెగబడింది. దీంతో భవిష్యత్తులో ఇలాంటి ముప్పుని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత్ ఏకే-630 వైమానిక రక్షణ శతఘ్నుల కొనుగోలుకు సిద్ధమైంది.ఏకే-630 అనేది ఆరు బ్యారెళ్లతో కూడిన 30 ఎంఎం ఫిరంగి. 4 నుంచి 6 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను అలవోకగా ఛేదించగలదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.